సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 160

శుక్రవారం 30-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం’



**పసిడి.. కొత్త రికార్డు**

ఢిల్లీ మార్కెట్లో రూ. 40,220. మాంద్యం భయాలు -బిజినెస్‌లో



**సింగిల్ ‘బ్రాండ్’ బాజా..!**

భారత్‌కు విదేశీ దిగ్గజాల క్యూ.. స్టోర్స్ ఏర్పాటుకు దిగ్గజాల ఆసక్తి -బిజినెస్‌లో

# టార్గెట్ ఖరీఫ్

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వచ్చే ఖరీఫ్‌కి పూర్తవ్వాలి



- నాలుగు నెలల్లో కరివెన రిజర్వాయర్ పనిచేయాలి
- నిరంతరంగా మూడు షిఫ్టుల్లో పనిచేయండి
- ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల సమీక్షలో సీఎం కేసీఆర్
- బిల్లుల కోసం చింతించొద్దు..
- పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోం
- అవసరమైతే టెండర్లు రద్దు చేసి పనిచేసేవారికి ఇస్తాం

**“ ప్రస్తుతం ప్రతి రైతు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నడు. రైతు ఆర్థికంగా బలపడాలంటే మరో ఎనిమిదేళ్లు కూడా పట్టొచ్చు. అప్పటి వరకు కచ్చితంగా ఉచిత కరెంటందిస్తాం. అందుకోసం రూ.15వేల కోట్లయినా ఖర్చు చేస్తాం. ఇది మా పాలసీ.. మా పార్టీ సిద్ధాంతం.. ప్రభుత్వ సిద్ధాంతం.**

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/హైదరాబాద్

వచ్చే ఖరీఫ్ నాటికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులన్నింటినీ పూర్తి చేయడంతో పాటు భవిష్యత్‌లో ఈ నీటిని సంగంబండకు సరఫరా చేసి అక్కడ్నుంచి జూరాలకు తరలించే ఆలోచనతో ఉన్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ ఎత్తిపోతల పథకంలో కీలకమైన కరివెన రిజర్వాయర్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలకు ఆయన ఆదేశించారు. ప్రస్తుతం నడుస్తున్న పనులను మూడు షిఫ్టులకు పెంచి నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి జలాలను ఇరు రాష్ట్రాలు పూర్తి స్థాయిలో వాడుకునేలా రెండు నదులను అనుసంధానం చేస్తామని, దీనిద్వారా మహబూబ్‌నగర్‌తో పాటు వికారాబాద్, నల్లగొండ (పాక్షికం) జిల్లాకు తాగు, సాగు నీటితో పాటు హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. ఈ విషయంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పిన కేసీఆర్ త్వరలోనే చర్చలు జరిపి జలాల వినియోగంపై ఓ ఒప్పందానికి వస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనలో భాగంగా సీఎం కేసీఆర్ గురువారం పాలమూరు, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో పర్యటించారు. ఆయా జిల్లాల్లో కొనసాగుతున్న కరివెన, నార్లాపూర్, వట్టెం, ఏదుల రిజర్వాయర్ల పనులను పరిశీలించారు. ఏదుల రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడారు. గత పాలకుల అసమర్థత, వివక్ష కారణంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టు పనులు ఆగిపోయి తాగు, సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ‘కొంతమంది చవటలు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు తీసుకురావాలని చెబుతున్నరు. అసలు వాళ్లకు ప్రాజెక్టులపై అవగాహన లేదు. జూరాల 6 టీఎంసీల ప్రాజెక్టు.. దాని కింద ఉన్న నెట్టెంపాడు, జూరాల సొంత ఆయకట్టు, భీమా, గట్టు, కోయిల్‌సాగర్ కింద సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడంతో పాటు మిషన్ భగీరథ కోసం 3.37 టీఎంసీల నీళ్లు అవసరముంటది. ఇందుకోసం 71.1% నీటిని వాడుకుంటున్నం. జూరాలలో నీళ్లు లేకపోతే ఆయా ప్రాజెక్టుల ఆయకట్టుకు సాగు, తాగునీటి అవసరాలు

మిగతా 2వ పేజీలో ▶

**చంద్రబాబు సాధించింది శూన్యమే!**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు లాభం కలిగించే గోదావరి, కృష్ణా జలాల అనుసంధానం విషయంలో ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సంకుచితంగా ఏదేదో మాట్లాడుతున్నారని కేసీఆర్ మండిపడ్డారు. ‘గతంలో బాబ్లీ విషయంలోనూ ఇలాంటి గొడవే. సాధించింది గుండు సున్నా. ఎక్కడ ప్రాజెక్టు అన్నా.. బస్తీమే సవాల్ అనడం.. కోర్టుకెళ్లడం.. హంగామా చేయడం తప్ప సాధించిందేం లేదు. అదే మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మహారాష్ట్రకు పోయి బాబ్లీ విషయంలో అగ్రిమెంట్ చేసుకుంటే ఈ రోజు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. బ్రహ్మాండంగా 570 టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం ఏర్పడింది. చంద్రబాబు లేదా ఆయనలాగా ఆలోచించేవారికి ఇప్పుడు ఒక్కటే చెబుతున్న.. రేపు కృష్ణా, గోదావరి జలాల అనుసంధానం విషయంలో నీటి వినియోగంపై పూర్తిస్థాయిలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒప్పందానికి వచ్చిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం’అని కేసీఆర్ స్పష్టంచేశారు.

శ్రీహర్షిణి (ఫైల్)



# ఫేస్‌బుక్ మర్డర్

## ప్రేమ పేరుతో వలవిసిరి ఉన్మాదం

- జడ్చర్ల శివారులో పదో తరగతి విద్యార్థిని దారుణహత్య
- లైంగికదాడిని ప్రతిఘటించడంతో బండరాయితో మోది ఘాతుకం.. రెండు రోజుల తర్వాత వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు నవీన్‌రెడ్డి
- నిందితుడిని ఉరితీయాలని జడ్చర్లలో ఆందోళన

**జడ్చర్ల:** ఫేస్‌బుక్ కపట ప్రేమ మరోసారి పడగ విప్పింది. గుర్తు తెలియని వ్యక్తితో చేసిన చాటింగ్ ముదిరి.. జస్ట్ కలుద్దామని పిలవగానే వెళ్లడం ఓ అమ్మాయిని నిర్జీవంగా మార్చేసింది. పాలమూరు జిల్లా జడ్చర్ల శివారులో రెండ్రోజుల క్రితం జరిగిన దారుణ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల వాసులను దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న రవిశంకర్, సురేఖ దంపతులకు ఇద్దరు కూతుళ్లు శ్రీహర్షిణి, శ్రీమాన్విత. జిల్లాకేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో శ్రీహర్షిణి (15) పదో తరగతి, శ్రీమాన్విత ఆరోతరగతి చదువుతున్నారు. తండ్రి రవిశంకర్ జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. షాద్‌నగర్‌కు చెందిన రవిశంకర్ కుటుంబం 25ఏళ్ల క్రితమే జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీలో స్థిర పడింది.

**దుకాణానికి వెళ్లి:** హౌసింగ్‌బోర్డు కాలనీలోని తమ నివాసం నుంచి శ్రీహర్షిణి మంగళవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో పెన్ను, పెన్సిల్ కొనేందుకు జడ్చర్ల-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపైకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన శ్రీహర్షిణి.. వెంటనే మళ్లీ ఏదో కొనాలని చెప్పి

మిగతా 4వ పేజీలో ▶

# భిక్ష కాదు

## కులం పేరుతో కొట్లాడి మంత్రిని కాలే.. ఘాటుగా స్పందించిన ఈటల రాజేందర్



- గులాబీ జెండాకు ఓనర్లం మేం
- తెలంగాణ కోసం మూడున్నర కోట్ల మందిని ఏకం చేసినం
- 2003 నాటికే నేనో పెద్ద పారిశ్రామికవేత్తను
- హుజూరాబాద్ సభలో ఉద్వేగభరిత ప్రసంగం
- తన వ్యాఖ్యలపై కలకలం రేగడంతో వివరణ
- నేను గులాబీ సైనికుడినే.. మా నాయకుడు కేసీఆరే అని స్పష్టీకరణ

**నా 15 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవ్వల దగ్గరి నుంచైనా ఐదువేలు లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచే వైదొలుగుతా. నేను ఇల్లు కట్టుకుంటే ఇంత కక్షా? ఇల్లు కట్టుకున్న భూమి కూడా ఇప్పుడు కొన్నది కాదు. ”**

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/హుజూరాబాద్

‘మంత్రి పదవి నాకు ఎవరో వేస్తే వచ్చిన భిక్ష కాదు.. మంత్రి పదవి కోసం కులం పేరుతో కొట్లాడలేదు.. తెలంగాణ కోసం చేసిన ఉద్యమమే నన్ను మంత్రిని చేసింది’అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో గురువారం జరిగిన టీఆర్‌ఎస్ సభలో ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. మంత్రి పదవిపై గత కొన్ని రోజులుగా కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఆయన పరోక్షంగా స్పందించారు. పదవిని అడుక్కునేవాళ్లం కాదని, అడుక్కునేవాళ్లు ఎవరో తొందరలోనే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. అధికారం శాశ్వతం కాకపోవచ్చునని.. ధర్మం, న్యాయం మాత్రమే శాశ్వతమని పేర్కొన్నారు. సొంతంగా ఎదగలేని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, బయట జరుగుతున్న చిల్లర రాజకీయాలపై స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ వ్యవహారంపై సభలో ఘాటుగా స్పందించిన ఆయన.. అనంతరం తన వ్యాఖ్యలు తీవ్రంగా చర్చనీయాంశం కావడంతో గురువారం రాత్రి వివరణ ఇస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. తన ప్రసంగాన్ని వక్రీకరించడం సరికాదని, తాను గులాబీ సైనికుడినేనని, తమ నాయకుడు సీఎం కేసీఆరేనని స్పష్టంచేశారు. అంతకుముందు సభలో ఈటల ఏమన్నారంటే...

**నేనానాడే పారిశ్రామికవేత్తను..**

‘తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలైనప్పుడు ఆ ఉద్యమానికి పారిశ్రామికవేత్తగా నన్ను సాయం చేయమని ఓ నాయకుడు కోరినప్పుడు పార్టీ పరిచయమైంది. ఆ కాలంలోనే నా గురించి పెద్ద పారిశ్రామికవేత్తనని పత్రికలు రాసినయి. హైదరాబాద్‌లో ఆ రోజుల్లో ఈటల రాజేందర్ అంటే తెలియని వారు ఉండరనుకుంట. అప్పటి ఉద్యమ రోజుల్లోనే పది లక్షల కోళ్ల ఫారాలను నడుపుతున్నా. 50 లక్షల కోళ్ల ఫాంలను నడిపే సత్తా ఉన్నవాడిని. 2003లో నేను టీఆర్‌ఎస్‌లో

మిగతా 2వ పేజీలో ▶

**అడుక్కునే వాళ్లు ఎవరో తెలుస్తది..**

నేను చెప్పాలంటే 10 గంటలు చెప్తా. ఒక్కోరోజు 4 జిల్లాల్లో 20 సభల్లో లక్షల మందితో ఇంటరాక్ట్ అయి ఉద్యమాన్ని నడిపిన వాళ్లం మేం. ఈ గులాబీ జెండాకు ఓనర్లం మేం. అడుక్కుని వచ్చిన వాళ్లం కాదు మేం. బతుకచ్చినోళ్లం కాదు మేం. అడుక్కునేవాళ్లెవరో రేపు తెలుస్తది. అధికారం అనేది శాశ్వతం కాకపోవచ్చు.. కానీ ధర్మం, న్యాయం శాశ్వతంగా ఉంటుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు తప్ప.. నాయకులు కాదనే సత్యాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి. కుసంస్కారం ఉన్న, ఎదగలేని, సొంతంగా తిరగలేని నాయకుల గురించి అప్రమత్తంగా ఉండాలి. ధర్మం నుంచి అలాంటి నాయకులు తప్పించుకోలేరు. ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదు.

## అణు క్షిపణిని పరీక్షించిన పాక్

జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించిన తర్వాత భారతదేశంపై కయ్యానికి కాలు దువ్వుతున్న దాయాది దేశం పాకిస్తాన్ తాజాగా అణు బాలిస్టిక్ క్షిపణి ‘ఘజ్నవి’ని విజయవంతంగా పరీక్షించింది. ఇప్పటికే గగనతల మార్గాలను మూసివేసి, నిత్యం భారత్‌పై అక్కసును వెళ్లగక్కుతున్న పాక్ ఇప్పుడు ఏకంగా అణు క్షిపణిని పరీక్షించడం గమనార్హం.

-వివరాలు 5లో




**ఇదండీ సంగతి**



... ఫోర్త్ డిగ్రీకి పోతే సరి!

# ఇక వాచిపోద్ది!

## 1 నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా




**సాక్షి, హైదరాబాద్:** హెల్మెట్ లేకపోయినా ఏం పరవాలేదు అని డ్రైవింగ్ చేస్తున్నారా.. మద్యం తాగి వాహనం నడుపుతున్నారా.. ఆ.. ఏముంది వందో రెండు వందలో జరిమానా కడితే సరిపోతుంది అని ఆలోచిస్తున్నారా?.. ఇకపై మీ పప్పులుడకవు. ఎందుకంటే వేలకు వేలు జరిమానా కట్టాల్సిందే. అంతేనా కొన్ని నిబంధనలు పాటించకుంటే ఏకంగా డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తారు. ఇంకా ఉంది.. ఓవర్ లోడింగ్ ప్రయాణికులను ఎక్కించుకుంటే ఒక్కో ప్రయాణికునికి రూ.1000 చొప్పున ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ‘మోటారు వాహనాల సవరణ చట్టం–2019’ అమల్లోకి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర రవాణాశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు 100 నుంచి 500 శాతం పెరగనున్నాయి. ప్రధానంగా 25 ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు భారీగా పెరుగుతున్నాయి. ఇకపై ట్రాఫిక్ జరిమానాల మొత్తం ఏటా 10 శాతం చొప్పున పెరుగుతూ ఉంటుంది. గురువారం నోటిఫికేషన్ అందుకున్న రాష్ట్ర రవాణాశాఖ.. వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు కసరత్తు చేపట్టింది. శనివారం లేదా మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ కానున్నాయి.

**పెరగనున్న జరిమానాల్లో కొన్ని..**

| ఉల్లంఘన | ప్రస్తుతం | పెరిగేది |
|---|---|---|
| సాధారణ ఉల్లంఘన | రూ.100 | రూ.500 |
| హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ | రూ.100 | రూ.500 |
| మద్యం తాగి డ్రైవింగ్ | రూ.2,000 | రూ.10,000 |
| లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ | రూ.1,000 | రూ.5,000 |
| అతి వేగం | రూ.400 | రూ. 1–2 వేలు |
| పర్మిట్ లేకుంటే | రూ.5 వేలు | రూ.10 వేలు |
| ఓవర్ లోడింగ్ (సరుకు) | రూ.2 వేలు | రూ.20 వేలు |
| సీట్ బెల్ట్ పెట్టుకోకుంటే | రూ.100 | రూ.1,000 |
| త్రిబుల్ రైడింగ్ | రూ.1,000 | రూ.2 వేలు |
| ఇన్సూరెన్స్ లేకుంటే | రూ.1,000 | రూ.2 వేలు |



**ఎవరి సత్తా ఎంత?**

భారత్–పాక్ మధ్య యుద్ధ వాతావరణం

- వివరాలు 2లో



**పప్పులు ఉడకడం లేదు!**

రూ. 100కి చేరిన కిలో కందిపప్పు

- వివరాలు 4లో




**అన్నదాతకు క్రెడిట్!**

రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయం

- వివరాలు 14లో



## క్లుప్తంగా...

### రూ.3,110 కోట్ల కంపా నిధులు

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ తెలంగాణకు కంపా నిధుల కింద రూ.3,110 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన జరిగిన అన్ని రాష్ట్రాల అటవీ శాఖ మంత్రుల సమావేశంలో ఉత్తర్వులిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆర్.శోభ పాల్గొన్నారు. ముఖ్యంగా దేశంలో ఇప్పుడున్న అడవులను రానున్న నాలుగేళ్లలో రెట్టింపు చేసే లక్ష్యంగా రాష్ట్రాల వారీగా పథకాలు రూపొందించడంపై సమావేశంలో చర్చ జరిగింది. అలాగే పర్యావరణ సమతుల్యతకు అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో చెట్ల పెంపకం, నదీ పరీవాహక ప్రాంతాల్లో అడవుల రక్షణ, కంపా నిధుల వినియోగం, కేటాయింపులు తదితర అంశాలపై చర్చించారు.

### కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.18,751 కోట్ల రుణం

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో అదనంగా మరో టీఎంసీ (మూడో టీఎంసీ) నీటిని తీసుకునేలా చేపట్టే అదనపు పనుల కోసం భారీ రుణం తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అదనపు పనుల నిర్మాణాలకు వీలుగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి కాళేశ్వరానికి మొత్తంగా రూ.18,751.38 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే ఈ రుణాలను తీసుకునేలా సీఎస్ ఎస్కే జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ జలాశయం నుంచి ఎల్లంపల్లి వరకు మూడో టీఎంసీ ఎత్తిపోతల పనుల కోసం రూ.4657.95 కోట్లు, మిడ్‌మానేరు నుంచి కొమురవెల్లి మల్లన్న సాగర్ వరకు ఎత్తిపోతల పనులకు రూ.14,093.43 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇప్పటికే కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా వివిధ రుణ సంస్థలు సేకరించిన రుణాలు రూ.45,500 కోట్ల మేర ఉండగా, ప్రస్తుత రుణాలతో అది రూ.64,254 కోట్లకు చేరనుంది.

### తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

**సాక్షి, న్యూఢిల్లీ:** హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. హరియాణాలోని బల్లాబ్‌గఢ్ వద్ద ఉదయం 7.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. థర్డ్ ఏసీలోని రెండు రైలు బోగీల్లో మంటలను గుర్తించిన వెంటనే ఉత్తర రైల్వే అధికారులు అప్రమత్తమై ఆయా బోగీలను రైలు నుంచి వేరు చేశారు. అలాగే 9వ కోచ్ వెనకవైపు చక్రాల నుంచి పొగ వ్యాపించడంతో రైలును అసోటీ–బల్లాబ్‌గఢ్ స్టేషన్ల మధ్య నిలిపివేశారు. ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, వారిని ఇతర బోగీల్లోకి మార్చినట్లు అధికారులు పేర్కొన్నారు. బ్రేక్ బైండింగ్ గట్టిగా పట్టేయడంతో పొగలు వ్యాపించాయని అధికారుల ప్రాథమిక సమాచారం.

### వచ్చే నెల 8న గ్రూప్‌–2 ప్రొఫిషియెన్సీ టెస్టు

**సాక్షి, హైదరాబాద్:** గ్రూప్‌–2 పోస్టుల భర్తీలో భాగంగా వివిధ శాఖల్లో అసిస్టెంట్ గణాంక అధికారి (ఏఎస్‌వో) పోస్టులను ఎంచుకున్న వారిలో ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబరు 8వ తేదీన 'ఆటోమేషన్ విత్ యూసేజ్ ఆఫ్ కంప్యూటర్ అండ్ అసోసియేటెడ్ సాఫ్ట్‌వేర్'పై ప్రొఫిషియెన్సీ టెస్టును హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి సంబంధించిన పరీక్ష కేంద్రాల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని పేర్కొంది. ఈ పరీక్షకు సంబంధించిన స్కీం అండ్ సిలబస్‌ను ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వెల్లడించింది.

### నవంబర్ 3న మెరిట్ పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష, నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌ను నవంబర్ 3న నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు సుధాకర్ తెలిపారు. వచ్చే నెల 9లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు **http//bse.telangana.gov.in** చూడొచ్చని పేర్కొన్నారు.

### ఎస్‌ఏ, ఎస్జీటీ పోస్టులకు 30న మెడికల్ టెస్టులు

**సాక్షి, హైదరాబాద్:** స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులోని స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టుల భర్తీకి సంబంధించి దివ్యాంగుల కోటా (ఆర్థోపెడిక్ హ్యాండీకాప్డ్)లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 30న మెడికల్ టెస్టులకు హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, రూమ్ నంబర్ 507, ఎంఆర్డీ (పాత బిల్డింగ్)లో ఉదయం 9 గంటలకు మెడికల్ టెస్టులకు హాజరు కావాలని సూచించింది. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్‌తోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫీజు, హాల్ టిక్కెట్ తమ వెంట తెచ్చుకోవాలని పేర్కొంది. పూర్తి వివరాలను **www.tspsc.gov.in** వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది.

# ఎవరి సత్తా ఎంత?

## భారత్‌-పాక్ మధ్య యుద్ధ వాతావరణం

## రెండు దేశాల బలాలివీ..



భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిపోతున్నాయి. ఇరుదేశాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మంచివి కావని పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ హెచ్చరిస్తుంటే.. అక్టోబర్, నవంబర్‌లో భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధమే జరుగుతుందని, అదే ఆఖరి యుద్ధమని ఆ దేశ రైల్వేమంత్రి షేక్ రషీద్ అహ్మద్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని కేంద్రం రద్దు చేసిన తర్వాత సరిహద్దుల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. గుజరాత్ సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు మన దేశంలోకి చొచ్చుకువచ్చి విధ్వంసం సృష్టించే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ హెచ్చరికలు చేసింది. ఇప్పుడు భారత్, పాక్ మధ్య యుద్ధం వస్తే ఎవరి బలాలు ఎంత? ఎవరి సత్తా ఎంత ? అన్నది ఆసక్తిని రేపుతోంది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) లెక్క ప్రకారం...

**భారత ఆర్మీ...**

| | |
|---|---|
| 14 లక్షలు | సైనిక దళం |
| 3,565 | యుద్ధ ట్యాంకులు |
| 3,100 | యుద్ధ వాహనాలు |
| 9,719 | ఫిరంగులు |
| 336 | సాయుధ శకటాలు |
| 814 | యుద్ధ విమానాలు |

**పాక్ ఆర్మీ...**

| | |
|---|---|
| 6,53,800 | సైనిక దళం |
| 2,496 | యుద్ధ ట్యాంకులు |
| 1605 | సాయుధ శకటాలు |
| 4,472 | ఫిరంగులు |

**భారత నేవీ...**

| | |
|---|---|
| 67,700 | నావికా దళం |
| 13 | యుద్ధ నౌకలు |
| 16 | జలాంతర్గాములు |
| 106 | గస్తీ నౌకలు |
| 14 | విధ్వంసక నౌకలు |
| 01 | యుద్ధ విమానాలను మోసుకుపోయే నౌక |
| 75 | తేలికపాటి యుద్ధ విమానాలను మోసుకువెళ్లే నౌకలు |

**భారత వాయుసేన..** 1,27,200 వైమానిక దళం

**పాకిస్తాన్ నేవీ...**

| | |
|---|---|
| 37,700 | నావికా దళం |
| 09 | యుద్ధ నౌకలు |
| 08 | జలాంతర్గాములు |
| 17 | గస్తీ నౌకలు |
| 08 | తేలికపాటి యుద్ధ విమానాలను మోసుకువెళ్లే నౌకలు |

**పాకిస్తాన్ వాయుసేన..** 70,000 వైమానిక దళం; 425 యుద్ధ విమానాలు

**మిలటరీ బడ్జెట్ (2018)** (భారత్)

| | |
|---|---|
| రూ.4 లక్షల కోట్లు | భారత్ రక్షణ రంగ కేటాయింపులు |
| 2.1 | దేశ జీడీపీలో దీని శాతం |

**అణ్వాయుధాలు..** 130-140 భారత్ వద్ద ఉన్న అణు వార్‌హెడ్లు

**మిలటరీ బడ్జెట్ (2018)** (పాకిస్తాన్)

| | |
|---|---|
| రూ.1.26 లక్షల కోట్లు | పాకిస్తాన్ రక్షణ రంగ కేటాయింపులు |
| 3.6 | దేశ జీడీపీలో దీని శాతం |

**అణ్వాయుధాలు..** 140-150 పాక్ వద్ద ఉన్న అణు వార్‌హెడ్లు

**భారత క్షిపణులు..**

భారత్ దగ్గర 3,000 కి.మీ. నుంచి 5,000 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే అగ్ని–3 సహా తొమ్మిది రకాలైన బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయి.

**పాక్ క్షిపణులు..**

పాకిస్తాన్.. చైనా సహకారంతో క్షిపణుల్ని అభివృద్ధి చేసింది. తక్కువ, మధ్య తరహా దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే క్షిపణిలు ఉన్నాయి. భారత్‌లో ఏ ప్రాంతాన్నయినా లక్ష్యంగా చేసుకునే క్షిపణులు పాక్ దగ్గరున్నాయి. 2,000 కి.మీ. దూరంలో లక్ష్యాలను ఛేదించే షాహీన్–2 క్షిపణి పాక్ దగ్గర ఉంది.

**1993, 2006 మధ్య కాలంలో పాకిస్తాన్ జీడీపీలో ఏకంగా 20శాతానికి పైగా రక్షణ రంగానికి కేటాయించినట్టు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడించింది.**

# భిక్ష కాదు

▶ మొదటి పేజీ తరువాయి

చేరి పనిచేస్తున్న క్రమంలో అప్పటి ఉద్యమ నేత అయిన కేసీఆర్ నన్ను మీది ఎక్కడయ్యా అని అడిగితే కమలాపూర్ అని చెప్పిన. ఆ సందర్భంలో గిక్కడ ఏముందయ్యా.. నీకు గట్టుకు కట్టెలు మోసినట్లు అని చెప్పి.. నీకు డబ్బు, మంచి పేరు ఉంది. నువ్వు అక్కడికి వెళ్లు అని కమలాపూర్ పొమ్మన్నడు. అప్పుడు కమలాపూర్ నాకు పెద్దగా పరిచయం లేదు సార్.. నేను ఈటల మల్లయ్య కొడుకు గానో, ఈటల సమ్మయ్య తమ్ముని గానో, ఈటల భద్రయ్య అన్నగానో చెప్పుకోవాలె తప్ప అక్కడ నాకు చరిత్ర లేదు సార్ అని చెప్పిన. అప్పుడు సీఎం కేసీఆర్ నువ్వు పో.. నీకు మంచిగ ఉంటుందని చెబితే కమలాపూర్‌లో అడుగు పెట్టిన. తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన బిడ్డగా నన్ను ఆరుసార్లు గెలిపించి నియోజకవర్గ ప్రజలు మద్దతుగా నిలిచారు.

**తెలంగాణ ఆత్మగౌరవ బావుటా ఎగరేసినం**

అనామక మనిషిగా వచ్చి, ఈ గడ్డ మీద ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుచుడు అనేది ఓ చరిత్ర. నా తండ్రి రాజకీయాల్లో లేడు. నాకు నేనుగా నిలబడ్డా. ఒక్క హుజూరాబాదే కాదు.. నేను ఆదిలాబాద్‌కు పోయినా పదిమంది వచ్చి ఫొటో దిగి పోతరు. నేను మహబూబ్‌నగర్ పోయినా, వ్యాన్‌లలో వచ్చి పదిమంది ఫొటో దిగి పోతరు. లక్షల మందితో తెలంగాణ గడ్డపై ఉద్యమం చేసిన బిడ్డలం. ఒక పత్రిక రాస్తది.. ఈయనకు మంత్రి పదవే రాకపోతుండే.. కుల సమీకరణలు కలిసొచ్చాయని. కొడుకా గుర్తుపెట్టుకో.. కులంతోటి కొట్లాట పెట్టలే. ఈ మంత్రి పదవే ముఖ్యమా? కులంతో వచ్చినవాడిని కాదు నేను. ఈటల రాజేందర్ అనేవాడు తెలంగాణ ఉద్యమం మూడున్నర కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవ బావుటా. ఆ బావుటా ఎగరేసిన తెలంగాణ బిడ్డను. తెలంగాణ ఆత్మగౌరవం కోసం, తెలంగాణ తల్లి విముక్తి కోసం కొట్లాడినం. దొంగలెవరో, ద్రోహులెవరో త్వరలోనే తెలుస్తది. ద్రోహులు పదేపదే మోసం చేయలేరు. న్యాయం, ధర్మం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఆనాడు జైళ్లలో, పీడీ యాక్టులు పెట్టాలె అని ముఠాలు కట్టిన్రు. నన్ను చంపాలె అని రెక్కీలు నిర్వహించినప్పుడు.. సంపుతవా నా కొడకా! అని ఛాలెంజ్ చేసిన తెలంగాణ బిడ్డను నేను. ఈటల రాజేందర్ తెలంగాణ విముక్తి పోరాటం వల్ల గెలిచాడు తప్ప.. నాకు నేనుగా గెలవలేదు అని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌కు చెప్పిన. ఇవాళ పైసల గురించి మాట్లాడుతున్నారు. నాకు ఆనాడే పైసలున్నయ్. నా సొంతంగా కోళ్ల ఫారాలతో వ్యాపారాలు చేసుకొని సంపాదించిన పైసలు. నా 15 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవ్వల దగ్గరి నుంచైనా ఐదువేలు లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచే వైదొలుగుతా. నేను ఇల్లు కట్టుకుంటే ఇంత కక్షా? ఇల్లు కట్టుకున్న భూమి కూడా ఇప్పుడు కొన్నది కాదు.

**చిల్లరమల్లర వార్తలకు భయపడను..**

నేను గెలవగలిగే సత్తా ఉన్నోడిని.. అమ్ముడుపోకుండా ఉన్నోడిని నా భుజాలమీద మోసే ప్రయత్నం చేస్తా. ఈ బాధ.. ఇదంతా కూడా నానోటి నుంచే కాదు.. ఎన్నడో ఒకనాడు తప్పకుండా బయటకొస్తాయ్. ఎవడు పోయి ద్రోహి అయ్యాడో.. ఎవడు హీరో అయ్యాడో అనేది ఆ రోజు తెలుస్తదన్న ఆశతో బతికేవాడిని. ఈటల రాజేందర్ వెలిగే దీపమే తప్ప.. తెలంగాణ గడ్డమీద ఆత్మగౌరవంతో బతికేవాడే తప్ప.. ఈ చిల్లరమల్లర వారితో, వార్తలతో భయపడే ప్రసక్తే లేదని చెబుతున్నా'అని ఉద్వేగంగా వ్యాఖ్యానించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

## తప్పుడు వార్తలతో అవమానించొద్దు: ఈటల

**సాక్షి, హైదరాబాద్:** హుజూరాబాద్ సభలో తాను చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో మంత్రి ఈటల రాజేందర్ స్పందించారు. ఈ విషయంపై కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న వార్తల గురించి వివరణ ఇస్తూ గురువారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. 'హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు కాసిపేట శ్రీనివాస్ చేరిక సందర్భంగా నేను చేసిన ప్రసంగాన్ని కొన్ని వార్తా ఛానళ్లు, సోషల్ మీడియాలోని కొన్ని వర్గాలు వక్రీకరించడం సరికాదు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ముమ్మాటికీ గులాబీ జెండానే ఎగురుతుంది. నేను పార్టీలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు గులాబీ సైనికుడినే. మా నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆరే. ఇటీవల కొన్ని పత్రికలతో పాటు, సామాజిక మాధ్యమాల్లో మా పార్టీ అంటే గిట్టనివాళ్లు, నా ఎదుగుదలను ఓర్వలేనివారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నన్ను ఒక కులానికి ప్రతినిధిగా, డబ్బులకు ఆశపడే వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హుజూరాబాద్ సభలో చిల్లరవార్తలు వద్దని చెప్పాను. తెలంగాణ ఉద్యమం ప్రారంభమయ్యే నాటికే నేను పది లక్షల కోళ్ల ఫారానికి యజమానినని చెప్పాను. కమలాపూర్ (ప్రస్తుత హుజూరాబాద్) నియోజకవర్గానికి నన్ను పంపించి, ఇక్కడ పోటీ చేయించి గెలిపించింది మా నాయకుడు కేసీఆర్ అని చెప్పడంతో పాటు.. మేము గులాబీ సైనికులమని, రాజకీయాల్లోకి సంపాదించుకోవడానికి రాలేదని వివరణ ఇచ్చాను. నేను పార్టీలో, ఉద్యమంలో చేరేనాటికే పారిశ్రామికవేత్తను అనే విషయాన్ని కూడా స్పష్టం చేశాను. ఓ పార్టీ నాయకుడు ఇటీవల పత్రికలో వచ్చిన కథనంపై స్పందించాలని వేదికపై కోరడంతో ఆ పత్రికపై నేను చేసిన కామెంట్లలో రంధ్రాన్వేషణ చేయడం సరికాదు. ఉద్యమ సమయంలో పార్టీ మారాలని వివిధ రకాల ఒత్తిళ్లు వచ్చినా లొంగిపోలేదు. తెలంగాణ ఉద్యమ పుణ్యానే నేను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. నిరాధారమైన వార్తలను ప్రసారం చేయడం ఆపడంతో పాటు, సోషల్ మీడియా కూడా నా ప్రసంగ పాఠాన్ని పూర్తిగా విని సంయమనం పాటించాలి'అని మంత్రి ఈటల పేర్కొన్నారు.

## కరెంటు సెంటిమెంట్.. కేసీఆర్‌కు కరెన్సీ

- అబద్ధాలు చెప్తున్న జెన్‌కో సీఎండీని అమరుల స్తూపం ముందు కాల్చాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తెలంగాణ ప్రజల కరెంటు సెంటిమెంటును కరెన్సీ మూటలుగా మార్చుకున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి అవసరమయ్యే విద్యుత్ కొనుగోళ్లకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోనే ఒప్పందాలు చేసుకుంటున్నామని చెప్పి వేల కోట్ల రూపాయలు దండుకుంటున్నారని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో 12 ఏళ్ల పాటు ఏటా వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసే ఒప్పందమే దీనికి నిదర్శనమన్నారు. ఈ విద్యుత్‌ను రాష్ట్రానికి సరఫరా చేసే మార్వా ప్లాంటుకు అదానీలకు చెందిన బొగ్గు సరఫరా చేస్తోందని, అదానీ కంపెనీలు బొగ్గు రవాణాలో దివాళా తీయకుండా ఉండేందుకే అధిక ధరకు ఈ ఒప్పందం చేసుకున్నారని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల భారం తెలంగాణ ప్రజల నెత్తిన పడుతోందని పేర్కొన్నారు. కానీ, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మాత్రం విద్యుత్ ఒప్పందాలన్నీ పారదర్శకమేనని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పచ్చి అబద్ధాలు చెప్తున్న ఆయనను అమరవీరుల స్తూపం ముందు నిలబెట్టి కాల్చినా తప్పులేదని రేవంత్ వ్యాఖ్యానించారు.

# టార్గెట్ ఖరీఫ్

▶ మొదటి పేజీ తరువాయి

తీర్చలేని పరిస్థితి. ఇప్పుడే జూరాలకు నీరు రాక ప్రతి ఏటా కర్ణాటకను అడుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు నీళ్లు ఎక్కడొస్తయ్? అందుకే శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను పాలమూరు–రంగారెడ్డికి వాడుకుంటున్నం' అని సీఎం అన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 15–20 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చి పాలమూరును సస్యశ్యామలం చేస్తామన్నారు. ఎన్నో శక్తులు తమను అడ్డుకునేందుకు ప్రయత్నించినా.. ఆ ఆటంకాలను ఎదుర్కొని కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసుకున్నామని.. అదే స్ఫూర్తితో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

**పనులపై అసంతృప్తి**

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని 4రిజర్వాయర్ల వద్ద జరుగుతున్న పనులను సీఎం పరిశీలించారు. ఇప్పటి వరకు జరగాల్సిన పనులెంత? అయిన పనులెన్ని? పనుల జాప్యానికి కారణాలేంటని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆశించిన మేరకు పనులు జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు పూర్తిగా చేపట్టి.. వచ్చే ఖరీఫ్ నాటికి నీరందించాలన్నారు. కరివెన ప్రాజెక్టు పనులపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పని ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారో చెప్పండి? చేతకాకపోతే పక్కకు తప్పుకోండి. పనులు చేసేందుకు చాలా మంది క్యూలో ఉన్నారు' అని అసహనం వ్యక్తం చేశారు. వచ్చే 4 నెలల్లో కరివెన పనులు పూర్తి కావాలని కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఏదుల రిజర్వాయర్ పరిశీలించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.10వేల కోట్ల రుణం మంజూరైందన్నారు. నిధులకొరత లేనందున.. ఎప్పుడేం కావాలన్నా చెప్పాలని.. ఉదయం ఇండెంట్ పెడితే సాయంత్రానికల్లా బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. 'మీరు బిల్లులకు ఆందోళన చెందాల్సిన పనిలేదు. పొద్దున బిల్లులు పెడితే సాయంత్రానికి క్లియర్‌చేసే బాధ్యత నాది. వర్క్ ఫోర్స్ పెంచుకోండి. పని షిఫ్టులు పెంచుకోండి. అధికారులు మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు. నాలుగున్నర నెలల టార్గెట్ పెట్టుకొని.. అంతకు ముందే పని పూర్తిచేయండి' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఇకపై పదిహేను రోజులకోసారి సమీక్ష నిర్వహిస్తానన్నారు. పనుల పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శించే ఇంజనీర్లపై చర్యలుంటాయని వార్నింగ్ ఇచ్చారు. అవసరమైతే పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే కాంట్రాక్టర్ల టెండర్లను రద్దు చేసి ఇతరులకు పని కల్పించాలన్నారు.

**రైతుల కోసం ఎంతైనా వెచ్చిస్తాం!**

సమైక్య పాలనలో తీవ్ర ఇబ్బందులు పడ్డ తెలంగాణ రైతుల కోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తానని సీఎం స్పష్టంచేశారు. 'ప్రస్తుతం ప్రతి రైతు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నడు. రైతు ఆర్థికంగా బలపడాలంటే మరో ఎనిమిదేళ్లు కూడా పట్టొచ్చు. తర్వాత ప్రతి రైతు బ్యాంకుఖాతాలో సొంతగా నగదు జమ కావాలి. అప్పటి వరకు కచ్చితంగా ఉచిత కరెంటందిస్తాం. అందుకోసం రూ.15వేల కోట్లయినా ఖర్చు చేస్తాం. ఇప్పటికే నీటి తీరువా రద్దు చేశాం. ఇది మా పాలసీ.. మా పార్టీ సిద్ధాంతం.. ప్రభుత్వ సిద్ధాంతం' అని సీఎం అన్నారు. ఇకపై సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్ పాలమూరు–రంగారెడ్డి పనుల పురోగతిపై ప్రతి 10 రోజులకోసారి వచ్చి సమీక్ష జరుపుతారని సీఎం తెలిపారు. ఉమ్మడి పాలమూరు–రంగారెడ్డి ఎమ్మెల్యేలు, ఎంపీలు చర్చించి తమ అభిప్రాయాలను ఆమెకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంటు సభ్యులు పి.రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు శ్వేతామహంతి, శ్రీధర్, రొనాల్డ్‌రోస్, ఈఎన్‌సీ మురళీధర్, సీఈ రమేష్, మెగా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మిషన్ భగీరథ పనుల పురోగతిపై సంబంధిత ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. అతి త్వరలో ట్యాంకుల నిర్మాణం, అంతర్గత పైపుల నిర్మాణం సంపూర్ణంగా పూర్తిచేసి తాగునీటిని అందించాలని ఆదేశించారు.



గురువారం కరివెన ప్రాజెక్టు పనులను సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, అధికారులు

## వారంలో వట్టెం పూర్తవ్వాలి

16.7 టీఎంసీ సామర్థ్యంతో నిర్మిస్తున్న వట్టెం రిజర్వాయర్ పనులను వారం రోజుల్లో మూడు షిఫ్టుల్లో పూర్తి చేయాలని పనులు దక్కించుకున్న మూడు నిర్మాణ సంస్థలకు సీఎం ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్మికులను రప్పించుకోవాలని కోరారు. రివిట్మెంట్ పనులను వచ్చే మార్చిలోపే పూర్తిచేయాలని ఆదేశించారు. రిజర్వాయర్, పంప్ హౌస్ పనులను సమాంతరంగా పూర్తిచేయాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం రిజర్వాయర్ పనులను ఏరియల్‌వ్యూ ద్వారా పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం పనులకు సంబంధించి తక్షణమే రూ.200 కోట్ల నిధులు విడుదల చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లో పనులు ఆగొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే 100% నిర్మాణం పూర్తి చేసుకున్న ఏదుల రిజర్వాయర్‌లో ఇతర మార్గాల ద్వారా నీటిని తెచ్చి నింపుకోవాలని, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీటిని నింపే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. నీటిని ఎత్తిపోసేందుకు కాళేశ్వరం మాదిరి ఇక్కడ కూడా బాహుబలి పంపు మోటార్లను వినియోగించనున్నారు. వాటిని బయటనుంచి కాకుండా వీలైనంతవరకు బీహెచ్‌ఈఎల్ కంపెనీ ద్వారానే కొనుగోలు చేయాలి అని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి మెగా కృష్ణారెడ్డికి ముఖ్యమంత్రి సూచించారు.

# ఆపరేషన్ అనంతగిరి..!

**సిరిసిల్ల:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–10లో భాగంగా రూ.2700 కోట్లతో చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు నుంచి మరో దశకు నీటి మళ్లింపునకు రంగం సిద్ధమైంది. సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అనంతగిరి (అన్నపూర్ణ) ప్రాజెక్టులోకి మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర) నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే గోదావరి జలాలు లక్ష్మీపూర్ పంపుహౌస్ ద్వారా సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు జలాశయానికి 12 రోజులుగా చేరుతున్నాయి. మధ్యమానేరులో 13 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. అనంతగిరి జలాశయానికి గోదావరి జలాలను తరలించే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందుకోసం అనంతగిరి ఊరును ఖాళీ చేయించేందుకు నోటీసులు జారీ చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### సర్జిపూల్ సిద్ధం

మధ్యమానేరు బ్యాక్ వాటర్‌ను గ్రావిటీ ద్వారా ఒబులాపూర్ నుంచి తిప్పాపూర్ మహాబావి (సర్జిపూల్)కి మళ్లించే పనులు సాగుతున్నాయి. ఆసియాలోనే అతి పెద్ద బావిని సిద్ధం చేశారు. 92 మీటర్లు లోతు, 56 మీటర్ల వెడల్పుతో సర్జిపూల్‌ను నిర్మించారు. మధ్యమానేరు నుంచి గోదావరి జలాలు 3.5 కిలోమీటర్లు గ్రావిటీ ద్వారా వచ్చి ఒబులాపూర్ సొరంగం ద్వారా తిప్పాపూర్‌లోని మహాబావికి చేరుతాయి. అక్కడ ఏర్పాటు చేసిన 106 మెగావాట్ల నాలుగు మోటార్లతో నీటిని అనంతగిరి రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. ఇందు కోసం తిప్పాపూర్‌లో 440 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అనంతగిరి రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీ నీటిని నిల్వ చేస్తారు. ఇప్పటికే నీటిపారుదలశాఖ అధికారులు తిప్పాపూర్‌లోని మోటార్లను వెటరన్‌కు సిద్ధం చేశారు. అనంతగిరి రిజర్వాయర్ ద్వారా ఇల్లంతకుంట మండలంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

**ఊరు ఖాళీ చేయాలి**

- మధ్యమా‘నీరు’తొలుత అనంతగిరికే..
- రూ.2,700 కోట్లతో కాళేశ్వరం ప్యాకేజీ–10 పనులు
- నిర్వాసితుల పునరావాసం వేగం
- పట్టాలు సిద్ధం.. ప్యాకేజీ ఖరారు
- సీఎం చేతుల మీదుగా నీటి విడుదలకు ఏర్పాట్లు


ఖాళీ చేయాల్సిన అనంతగిరి గ్రామం

### పునరావాస ప్యాకేజీ సిద్ధం

ఇల్లంతకుంట మండలం అనంతగిరి నిర్వాసితుల కోసం పునరావాస ప్యాకేజీని సిద్ధం చేశారు. ఆ ఊరిలో 837 కుటుంబాలు ఉండగా.. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను కుటుంబా లుగా గుర్తించడంతో నిర్వాసితుల జాబితా 1,135 చేరింది. తంగళ్లపల్లి మండల కేంద్రం శివారులో 62 ఎకరాలు, అనంతగిరి పోచమ్మ ఆలయం సమీపంలో మరో 70 ఎకరాలను పునరావాసం కోసం ప్రభుత్వం సేకరించింది. ఇప్పటికే 737 కుటుంబాలకు రూ.7.50 లక్షల చొప్పున పునరావాస ప్యాకేజీని చెల్లించారు. 250 గజాల స్థలంతో కూడిన ప్లాట్లను ఇచ్చేందుకు లే అవుట్‌తో కూడిన పునరావాసం సిద్ధమైంది. 922 పట్టాలను పంపిణీకి సిద్ధం చేశారు. మరో 213 కుటుంబాలతో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు సాగిస్తున్నారు. అనంతగిరి ఊరును ఖాళీ చేయిస్తేనే.. మధ్యమానేరు నీరు అన్నపూర్ణ ప్రాజెక్టులోకి మళ్లించే అవకాశం ఉంది. ఇందు కోసం కలెక్టర్ కృష్ణభాస్కర్ అనంతగిరి నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనుల్లో నిమగ్నమయ్యారు.

**నీటి విడుదలకు సీఎం కేసీఆర్**

మధ్యమానేరు నీటిని అనంతగిరి రిజర్వాయర్‌కు విడుదల చేసే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ వస్తారని భావిస్తున్నారు. ఇప్పటికే మధ్యమానేరు వద్ద హెలీప్యాడ్ సిద్ధం చేశారు. అనంతగిరి నిర్వాసితుల పునరావాసం పూర్తి అయితే.. మధ్యమానేరులోకి 16 టీఎంసీల నీరు చేరగానే అనంతగిరికి నీటి విడుదల ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మరో అద్భుతమైన జలదృశ్యం ఆవిష్కరణకు సిద్ధమైంది.

### పునరావాసానికి ఏర్పాట్లు

అనంతగిరి నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రెండు చోట్ల పునరావాస కాలనీలు ఏర్పాటు చేశాం. నిర్వాసితుల అభీష్టం మేరకు ప్లాట్లు కేటాయిస్తాం. ముందుగా అనంతగిరి వాసులు ఇళ్లు ఖాళీ చేయాల్సి ఉంటుంది. పునరావాస ప్యాకేజీకి మెజార్టీ నిర్వాసితులు అంగీకరించారు. సంతకాలు చేయని వారి విషయంలో చట్టం ప్రకారం ముందుకు వెళ్తాం.

*టి.శ్రీనివాస్‌రావు, ఆర్డీవో, సిరిసిల్ల*

### అనంతగిరి నుంచి రంగనాయక సాగర్‌కు..

అనంతగిరిలో నిల్వ చేసిన నీటిని సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు ఎత్తిపోస్తారు. రంగనాయకసాగర్ నుంచి కొండ పోచమ్మ, అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలను తరలించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. మధ్యమానేరులో 13 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ముందుగా కరీంనగర్ వద్ద ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ)కి నీటిని విడుదల చేశారు. కానీ అనంతగిరి ప్రాజెక్టును ముందుగా నీటితో నింపాలనే లక్ష్యంతో ఎల్‌ఎండీకి నీటి విడుదలను నిలిపి వేశారు. సిద్దిపేట జిల్లాకు గోదావరి జలాలను ముందుగా తరలించాలని ప్రభుత్వం భావిస్తుంది.



# మందుపాతర్ల పేల్చివేత

**చర్ల:** మావోయిస్టులు మరోమారు విధ్వంసానికి పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తిప్పాపురం శివారులో గురువారం సాయంత్రం ప్రధాన రహదారిపై ప్రజల రాకపోకలు సాగుతుండగానే అటవీ ప్రాంతం నుంచి వచ్చిన 10 మంది మావోయిస్టులు రోడ్డుపై గుంత తవ్వి మందుపాతర పెట్టి పేల్చారు. పేలుడు ధాటికి వచ్చిన భారీ శబ్దంతో ఇరువైపులా గ్రామాల్లోని గిరిజనులు పరుగులు తీశారు. మావోయిస్టులు కవ్వింపు చర్యకు పాల్పడినట్లుగా కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


తెలంగాణ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.1397/Non-Plan/EE(R)/DEE-6/AEE-2/2019-20 తేదీ: 27.08.2019
ఖమ్మం సర్కిల్‌లో నాన్-ప్లాన్ క్రింద 1 నం. CC డ్రెయిన్ పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే https://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేదీ: 11.09.2019న లేదా ఆలోగా మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అంటే https://tender.telangana.gov.inలో చూడవచ్చును.
DIPR RO.No.1023-DP/CL/Advt/1/2019-20, Dt: 29.08.2019 సం/- ఇంజినీర్ ఇన్ చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరపున

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR సర్కిల్, ఖమ్మం**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
టెండరు ప్రకటన NIT No.04 to 28/2019-20, తేది: 29.08.2019. దిగువ తెలిపిన పనుల కోసం దిగువ సంతకందారుచే నమోదిత కాంట్రాక్టర్లు (GOMs.No.66, I&CAD (రిఫార్మ్స్) శాఖ తేది: 20.04.2015 ప్రకారం అర్హత పరిగణించబడుతుంది. అయితే ఈ పనులు SC/ST/ వడ్డెర/నగర కాంట్రాక్టర్స్ సొసైటీలకు కేటాయించబడినవి) **పని పేరు (28):** 13 పనులను సీతంపేట బంజర్, సుజాత నగర్ G.P. లో నిర్వహించాలి. 13 పనులను చుంచుపల్లి మండలంలోని 3వ ఇన్‌క్లైన్ G.P లో నిర్వహించాలి మరియు పెనుబల్లి G.P, ధనాబాద్ G.P, గౌతంపూర్ G.P, పెనగడప G.P, రామ్‌పురం G.P. లో మరికొన్ని పనులు మరియు PR సర్కిల్ ఖమ్మంలో మరికొన్ని గ్రామ పంచాయతీలలో పనులు నిర్వహించాలి. **మొత్తం ECV: రూ.669.40 లక్షలు.** పై పనికి టెండరు నిబంధనలు, SBD & షెడ్యూలు 05.09.2019 నుంచి ఇ-మార్కెట్ ప్లేస్ అంటే https://tender.telangana.gov.in/login.html లో లభిస్తాయి. ఆన్‌లైన్‌లో టెండరు దాఖలుకు ఆఖరు తేదీ: 13.09.2019.
DIPR RO.No.1025-DP/CL/Advt/1/2019-20, Dt: 29.08.2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R. సర్కిల్, ఖమ్మం

**Andhra Pradesh Airports Development Corporation Limited (APADCL)**
(A Government of Andhra Pradesh Undertaking)
Expression of Interest
Notice No.APADCL/EOI/2019/Kurnool/02 Dated:28.08.2019
APADCL is inviting Applications from the interested parties for setting up "Aero sports" &/ or "Flying Training Academy" activities at Kurnool Airport on long term basis.
Interested Aero sports Operators and/or Flying Training Academies may check EOI details on **www.apadcl.com/tenders** from 30/08/2019 onwards and submit their proposal on or before **09th Sep 2019.**
**Sd/- Managing Director & C.E.O**
DIPR RO.No.118PP/CL/Advt/1/1/2019-20, Dt.29.8.2019

**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED**
Regd. Office: 10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520007.
Tender No: PDS 1/35/Sugar Tender/Oct to Dec-19 Dated: 28.08.2019
**TENDER NOTICE**
EMPANELMENT AND APPOINTMENT OF SUPPLIERS FOR SUPPLY OF 22717.977 MTS. OF ISS GRADE S-30/S-31 CANE SUGAR IN 1/2 Kg PACKET FORM WITH SECONDARY PACKING IN 50 KG NEW POLYPROPYLENE (PP) BAGS UNDER PDS FOR THE MONTHS FROM OCTOBER 2019 TO DECEMBER 2019 THROUGH NCDEX E MARKETS LTD
All interested Sugar Manufacturers/Traders in All Over India are invited for registration as suppliers eligible to participate in the e reverse auction to be conducted by NCDEX e Auction platform on behalf of APSCSC Ltd for supply of sugar to the MLS Points of (13) Districts in Andhra Pradesh State.
For Registration, interested Sugar manufacturers may visit www.apscsc.gov.in www.apscsc.ap.gov.in & www.neml.in for application form and detailed terms & conditions.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to 5.00pm of 03-09-2019. The duly filled in application form should be submitted to: Customer Service Group, NCDEX e-Markets Limited, Ackruti Corporate Park, 1st Floor, Near GE Garden, LBS Marg, Kanjurmarg(West), Mumbai-400078 Tel:9642332994 / 8309214263 or 022-66473153/54. Email: askus@neml.in.
The tentative date of online e-auction through NCDEX e Markets Ltd platform would be 04-09-2019 at 10.00 am onwards for 22717.977 Mts. of Sugar in ½ Kg packet form with secondary packing in 50 Kg PP bags. Delivery should be completed within 10 working days at all MLS Points of (13) districts in AP State. Auction will be held District wise. The details are available in the RFP on the website www.apscsc.gov.in / www.apscsc.ap.gov.in
Sd/- VC & MANAGING DIRECTOR

**ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డ్**
ఇందాద్ ఘర్ వక్ఫ్ కాంప్లెక్స్, 4వ అంతస్తు, కాళేశ్వరరావు మార్కెట్ ఎదురుగా, విజయవాడ
F.No.05/KAS/AUC/NLR/2016-DM ప్రకటన తేది: 29.08.2019
SPSR నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలం, కస్మూర్ గ్రామం వద్ద గల దర్గా హజ్రత్ సయ్యద్ కరీముల్లా షా ఖాద్రి (Rh)కు అర్పించే ఐటమ్‌ల వేలానికి సంబంధించి ప్రకటిత అర్పించబడే ఐటమ్‌లను అందజేసే తేదీ నుండి వర్తింపుతో వ్యవధి కోసం దిగువ ఇచ్చిన రెండు వివిధ రకాల ఐటమ్‌ల కోసం సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.
**టెండరు నం.1**
1) దర్గా హజ్రత్ సయ్యద్ కరీముల్లా షా ఖాద్రి (Rh) ఘెలక్, 2) దర్గా హజ్రత్ ఖాజా బందేనవాజ్ చిల్లా ఘెలక్, 3) మిలాద్‌ఖానా ఘెలక్, 4) సందల్‌ఖానా ఘెలక్, 5) ఖత్మే ఖురాన్, 6) మిలాద్ పువ్వులు మరియు అలంకరణ, 7) సపోట, మామిడి మరియు చింతపండు చెట్లు, 8) లడ్డు (ప్రసాదం) అమ్మకం, 9) చెప్పుల స్టాండ్లు, 10) డార్మిటరీ హాల్స్ (బ్లాక్ 1 మరియు 2), 11) ఫోటోస్టూడియో, 12) సులభ్ కాంప్లెక్స్, 13) బందిష్ నారియల్, నీంబు మరియు తావీజ్, 14) చాదర్ (గలాఫ్), 15) కందూరీ (కాళ్ళు మరియు తలలు), 16) వాహన పూజ (వాహన సందల్), 17) దర్గా ఆవరణలో కొబ్బరికాయలు మరియు కొబ్బరి చిప్పలు (ఫాతేహ ఐటమ్స్) అమ్మకం.
**బయానా మొత్తం: రూ.10,00,000/-** (రూపాయలు పదిలక్షలు మాత్రమే)
**పాల్గొనుట:** టెండరు ఫారంలోని నియమ నిబంధనల ప్రకారం ఎవరేని వ్యక్తి/ ఏదేని సంస్థ దరఖాస్తు చేయవచ్చును.
**టెండరు నం.2**
ఒక ఐటం మాత్రమే - హెయిర్ కటింగ్ (తలనీలాలు)
**బయానా మొత్తం: రూ.1,00,000/-** (రూపాయలు ఒక లక్ష మాత్రమే)
**పాల్గొనుట: కస్మూర్ (V) నాయీబ్రాహ్మణులకు మాత్రమే రిజర్వు చేయబడింది.**
పైన నిర్దేశించిన బయానాతో పాటు టెండరును చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆం.ప్ర. స్టేట్ వక్ఫ్ బోర్డ్, విజయవాడ పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో **04-09-2019న ఉ.11.00 గం.ల నుండి మ.3.00 గం.వరకు** బిడ్డర్లు దాఖలు చేయవలెను. సీల్డ్ టెండర్లు **04-09-2019న సా.4..00 గం.లకు ఆం.ప్ర. స్టేట్ వక్ఫ్ బోర్డ్, విజయవాడ వద్ద తెరువబడును.**
గెలుపొందిన బిడ్డరు టెండరు మొత్తంతోపాటు 1% టెండరు ఖర్చులను చెల్లించాలి. నియమ నిబంధనలతో టెండరు ఫారాన్ని ఆం.ప్ర. స్టేట్ వక్ఫ్ బోర్డ్ కార్యాలయం నుండి బోర్డ్ ట్రెజరీలో టెండరు నం.1 మరియు టెండరు నం.2 కోసం **రూ.1,000/- మరియు రూ.300/-** చెల్లింపుపై పొందవచ్చును. కాగోరు టెండరుదారు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్/ ఓటర్ ID మొ॥వాటి కాపీలతోపాటు (2) పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను దాఖలు చేయాలి. టెండరుదారులు టెండరు నియమనిబంధనలను నిజాయితీగా అనుసరించవలెను.
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డ్


# ఆ ఎన్‌కౌంటర్లు బూటకం

- టీఆర్‌ఎస్, బీజేపీ నాయకులకు శిక్షలు తప్పవు
- మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ లేఖ

**సాక్షి, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు లింగన్నను, మణుగూరు మండలం బుడుగుల వద్ద మావోయిస్టు సభ్యుడు జాడి వీరస్వామిని పట్టుకుని కాల్చి చంపి, ఇవి బూటకపు ఎన్‌కౌంటర్లు అని సీపీఐ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం లేఖను విడుదల చేశారు. అమాయక ప్రజలను అరెస్టు చేస్తూ, చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఆదివాసీ గిరిజనులను భూముల నుంచి గెంటేస్తూ జైలులో పెడుతున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ , బీజేపీ ప్రభుత్వాలు పౌరహక్కులను కాలరాస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. కూంబింగ్‌లు, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేయడాన్ని నిలిపివేయకపోతే టీఆర్‌ఎస్, బీజేపీ నాయకులకు ప్రజల చేతిలో శిక్షలు తప్పవని జగన్ హెచ్చరించారు.

# గిరిజన గ్రామాల్లో ‘తండా బాట’

## వినూత్న కార్యక్రమానికి సంగారెడ్డి కలెక్టర్ శ్రీకారం


తండాబాటను ప్రారంభిస్తున్న కలెక్టర్

**సంగారెడ్డి రూరల్:** తండాలను సమగ్రమంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు ‘తండా బాట’అనే మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్టుగా కంది మండలం ఎర్దనూర్ తండాను ఇందుకోసం ఎంపిక చేశారు. గురువారం ఈ తండా నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి గిరిజనులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని తండాలను సమగ్రంగా అభివృద్ధి చేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతోనే ‘తండా బాట’కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన తండాను వారం రోజుల ముందుగానే అధికారులు సందర్శించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తారని చెప్పారు. అనంతరం సదరు తండాను తాను సందర్శించి మౌలిక సౌకర్యాలను పరిశీలించి వాటిని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# గుట్టుగా అద్దె గర్భం దందా..

- సూర్యాపేటకు ఎగబాకిన సరోగసి
- అమాయక మహిళలనే లక్ష్యం చేసుకుని వల
- భర్త ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఉదంతం

**సూర్యాపేట:** మాయమాటలు చెప్పి.. డబ్బుల ఆశ చూపి నిరుపేద, అమాయక మహిళలే లక్ష్యంగా అద్దె గర్భం (సరోగసి) దందాను కొందరు గుట్టుగా సాగిస్తున్నారు. ఈ దందా హైదరాబాద్, విజయవాడ మహానగరాల్లో ఉండగా.. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఎగబాకింది. జూలై నెలలో ఓ మహిళ మిస్సింగ్ కేసు విచారణలో ఈ ఉదంతం వెలుగు చూసింది. దంపతుల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని ఇద్దరు మహిళలు ఓ మహిళను చెన్నై నగరానికి తరలించగా.. బాధితురాలి భర్త రాజు ఫిర్యాదుతో పోలీసులు ఎట్టకేలకు విచారించి సరోగసి గుట్టును రట్టు చేశారు.

**భర్త ఫిర్యాదుతో వెలుగులోకి..**

జూలై నెలలో శ్రీలత కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతకినా ఫలితం దక్కలేదు. దీంతో చేసేదేమి లేక ఆగస్టు 5న భర్త రాజు శ్రీలత కనిపించడం లేదంటూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ డేటా ఆధారంగా శ్రీలత చెన్నైలో ఉన్నట్లుగా గుర్తించి పోలీసులు పేట పోలీస్ స్టేషన్‌కు తరలించి శ్రీలతతో పాటు కుమారి, వాణిలను అదుపులోకి తీసుకున్నారు.

### రూ.4 లక్షల డీల్..

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌కు చెందిన శ్రీలత కొంతకాలం నుంచి భర్తతో విభేదాలు ఏర్పడి దూరంగా ఉంటూ వస్తోంది. ఈ క్రమంలో డబ్బులు ఎరచూపి వరుసకు వదిన అయిన వాణి సరోగసి ద్వారా పాపను వేరేవాళ్లకు కని ఇస్తే రూ.4 లక్షలు ఇప్పిస్తానని చెప్పడంతో శ్రీలత దీనికి అంగీకరించింది. వెంటనే వాణి విజయవాడలో తన స్నేహితురాలైన కుమారికి విషయాన్ని వివరించి జూలైలో విజయవాడకు పంపింది. అక్కడి నుంచి శ్రీలతను కుమారి చెన్నైకు తరలించింది. చెన్నై సరోగసి కేంద్రంలో ఎవరైనా ఏమైనా అడిగినా.. సరోగసి అంటే ఇష్టమని.. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టాలని శ్రీలతకు చెప్పి పంపింది. ఇలా చేస్తే నేరుగా నీ అకౌంట్‌లో రూ.4 లక్షలు జమ అవుతాయని పేర్కొనడంతో వారు చెప్పిన విధంగానే చేసింది.

### ఉలిక్కిపడిన నల్లగొండ

ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో సరోగసి దందా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. దీంతో అదే తరహాలో సూర్యాపేటను కేంద్రంగా చేసుకొని కొందరు ముఠా సభ్యులు ఇక్కడికి మకాం మార్చి దందాను నిర్వహిస్తుండటంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులు ఉలిక్కి పడుతున్నారు.



### కేసు నమోదు

సరోగసి ద్వారా పిల్లలను కనివ్వాలని మాయమాటలు చెప్పిన వాణి, కుమారిలపై బాధితురాలు శ్రీలత గురువారం పేట పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో కుమారి, వాణిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి మరిన్ని వివరాలను వెల్లడిస్తామన్నారు. ఇంకా ఎవరైనా బాధితులున్నారోనన్న కోణంలో దర్యాప్తు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఎవరూ కూడా సరోగసి ద్వారా పిల్లలను కనివ్వాలని వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ప్రాణాలు కూడా తీసే వారు ఉంటారని.. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


సాక్షి ఉద్యోగ అవకాశాలు

**విలేకరులు కావలెను**
రాష్ట్రవ్యాప్తంగా ప్రసారం కానున్న మా B.K.చానల్ కు నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, జిల్లా కో ఆర్డినేటర్లు స్టేట్‌బ్యూరో, యాంకర్స్ అన్ని జిల్లా ఆఫీసులలో పనిచేయుటకు రిసెప్షనిస్టులు కావలెను.
ఆసక్తిగల అభ్యర్థులు RESUME ఈ మెయిల్ చేయగలరు.
Email: job.bkchannel@gmail.com
Ph : 9963838083, 7075389322
BALAKRISHNA COMMUNICATIONS PVT.LTD.

**WANTED PERSONNEL**
We require the following personnel to work at below mentioned branches of Kalyani Group at HYD, KMM, VIZAG, KKD, RJY, ELR, VJA, GNT, ONG, NLR & TPT.
**DGM, AGM, RM & BM**
PG / MBA with proven competence in administration, business promotion credit control, Accounts, Exp. 10 yrs in mktg/Admin., Age: 35-45 yrs
**HR Manager (For Gnt & Hyd)**
MHRM / MBA (HR), 10 yrs Exp. with Admin Skills. Age : 33 to 45 yrs
**Business Managers / Executives**
PG/Graduates with 6 yrs exp. in Mktg., two wheeler is a must. Age: 28-35 yrs
**Accounts Managers / Accountants**
B.Com / M.Com with 10 yrs exp., well-versed in Computer Accounting Procedures
**Office Asst.** B.Com, Computer Knowledge with 5 yrs exp.
**Personal Secretary to M.D.**
Post Graduation in English / Telugu, Clarity of Vision and work efficiency, 10 yrs exp., Computer knowledge is a must. Age: 32 to 38 yrs
**Copywriters cum Proof Readers**
MA Telugu / English, Preference to Journalism background, and similar experience. Age: 30-45 yrs
**Art Directors - Hyd, Gnt, VJA & VZG**
Qualified professionals with good designing skills - from conceptualization to execution - and previous ad agency exp. on Mac Platform. Age: 33-45 yrs
**Graphic Designers / DTP Operators**
Inter / Degree ability to handle Indesign, Photoshop, Illustrator & QuarkXpress on Mac Platform, Telugu Typing is a must., 8 yrs exp., Age: 28-35 yrs
Interested Candidates may send their Resume along with Photo & Certificates to hoadvtjobs@gmail.com
KALYANI ADS www.kalyaniads.com ✆ 98489 13116


## ఖైరతాబాద్ వినాయకుడికి
# 84 అడుగుల కండువా



**భూదాన్ పోచంపల్లి:** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, బాలాపూర్ గణనాథులకు అలంకరించడానికి యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముకుల హ్యాండ్లూమ్ పార్క్‌లో భారీ కండువాలను తయారు చేశారు. ఖైరతాబాద్ వినాయకుడికి 84 అడుగులు, బాలాపూర్ గణనాథుడికి 45 అడుగుల భారీ కండువాలను రూపొందించారు. పలువురు చేనేత కళాకారులు 3 నెలల పాటు ఎంతో నిష్టతో మగ్గంపై కండువాలను రూపొందించారు. కాషాయం రంగు కలిగిన కండువాలో శివలింగం, ఓంకారం, ఉండ్రాళ్లు, స్వస్తిక్, విల్లు, నాగుపాము, గణపతి రూపం, ఓం, కలశం, శంఖు చక్రాలతో ప్రత్యేక డిజైన్లను పొందుపర్చారు. గురువారం హ్యాండ్లూమ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ కండువాను ప్రదర్శించారు. కార్యక్రమంలో పార్క్ చైర్మన్ కడవేరు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐరన్ మాత్రలు వికటించి..
# 57 మందికి అస్వస్థత


విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్

**ఆదిలాబాద్‌రూరల్:** ఐరన్ మాత్రలు వికటించి.. 57 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన ఆదిలాబాద్ అనుకుంట మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం వెలుగు చూసింది. మండల వైద్యాధికారి రోజారాణి విద్యార్థులకు పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 400 మంది విద్యార్థినులు చదువకుంటున్నారని, గురువారం అల్పాహారం చేసి.. ఐరన్ మాత్రలు వేసుకున్నారని, మధ్యాహ్నం కొందరు వాంతులు చేసుకున్నారని, తల తిప్పుతున్నట్లు అనిపిస్తోందని చెప్పగా.. వెంటనే ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించామన్నారు. 57మంది విద్యార్థినుల్లో 40 మందికి తీవ్ర అస్వస్థత ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, గురుకుల పాఠశాల రీజినల్ కోఆర్డినేటర్ గోపీచంద్ పరిస్థితిని సమీక్షించారు.

# నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించను

- వైద్యులకు ఎర్రబెల్లి హెచ్చరిక
- ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** ‘మీరు వార్నింగే అనుకోండి.. నా రిక్వెస్టే అనుకోండి.. ఎలా అర్థం చేసుకున్నా ఫర్వాలేదు. కానీ ప్రజావైద్యంపై నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదు’అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిని గురువారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఇతర అధికారులతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఐదుగురు సీనియర్ డాక్టర్లు అందుబాటులో లేరు. ఓపీ విభాగంలో వైద్యుల లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు విభాగాల్లోకి వెళ్లి హాజరు కాని వైద్యులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి .. ఎంజీఎంకు వచ్చిన పేషెంట్లతో కూడా మాట్లాడారు. పలు విభాగాల్లో సేవలు సరిగా లేపోవడంపై సూపరింటెండెంట్ శ్రీనివాస్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.


ఎంజీఎంలో వైద్య సేవలు మెరుగుపర్చాలంటూ సూపరింటెండెంట్‌కు నమస్కరిస్తున్న ఎర్రబెల్లి

### ఐఐటీలో కొత్త ఆవిష్కరణలు

**సంగారెడ్డి అర్బన్:** నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేయడానికి పారిశ్రామికంగా ఉత్పత్తి అయిన వ్యర్థ ఫ్లై యాష్ (బూడిద)ను ఉపయోగిస్తున్నట్లు ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు, డాక్టర్ ముద్రి ఖండేల్వాల్, డాక్టర్ అతుల్ సురేశ్ దేశ్‌పాండే అన్నారు. ఇలాంటి సూపర్ హైడ్రోఫోబిక్ నిర్మాణాలు యాంటీ ఫౌలింగ్ పెయింట్స్, యాంటెన్నా కోసం యాంటీ స్టికింగ్ ఉపరితలాలు, ఆటోమొబైల్స్ కోసం స్వీయ–శుభ్రపరిచే పూతలు, స్టెయిన్–రెసిస్టెంట్ టెక్స్‌టైల్స్, యాంటీ–సాయిలింగ్ ఆర్కిటెక్చరల్ పూతలు, పారిశ్రామిక వ్యర్థ ఉత్పత్తి నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేయడానికి ముఖ్యమైన అనువర్తనాలను కలిగి ఉన్నట్లు తెలిపారు. లోటస్ ఆకులు, గులాబీ రేకుల లక్షణాలను అనుకరించే నీటి వికర్షక నిర్మాణాలను అభివృద్ధి చేయడానికి పారిశ్రామిక వ్యర్థ ఉత్పత్తి ఫ్లై యాష్‌ను ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.


ITM UNIVERSITY GWALIOR • MP • INDIA "CELEBRATING DREAMS"
STATE RANK 1st AMONGST TOP 20 IN INDIA FOR LAST 5 YEARS
1st PRIVATE UNIVERSITY IN MADHYA PRADESH & 3rd PRIVATE UNIVERSITY IN THE COUNTRY ACCREDITED BY ICAR (INDIAN COUNCIL OF AGRICULTURAL RESEARCH)
Our representative is available for SPOT COUNSELING
Mob.: 9131033596, 8125822251, 9826297006
Hyderabad Office : Plot No 530, Vivekanand Nagar, Near Reliance Fresh, Kukatpally.
B.Sc. • Agriculture
M.Sc. • Agronomy • Horticulture • Genetic Plant Breeding
MBA • Agri Business
Scholarships upto 100%*
B.Tech.(Hons.) • Computer Science • Civil Engineering • Electronics & Communication Engineering • Mechanical Engineering
B.Tech. Agriculture
Optometry B. Optometry
Architecture B. Arch.
Sciences B.Sc./B.Sc.(Hons.) Biotech./Biomedical/ Food Tech./Microbiology/PCM/CS/ M.Sc. Medical Biotech./Biotech./ Food Tech./Microbiology
65,726* placement opportunities provided to students | 82% of total eligible students placed so far | Minimum 5 placement opportunities to all eligible students | 412* major industries & mnc corporate recruiters
Admissions through registered office of ITM University will be valid.
ITM University Gwalior does not authorise any third party to give Admission in Agriculture courses.
Applicants may also apply online at http://onlineapply.itmuniversity.ac.in
CAMPUS: AH-43 Bypass Turari, Jhansi Road, Gwalior (M.P.) - 474001 | www.itmuniversity.ac.in

## క్లుప్తంగా...

### సీఎంకు కేబినెట్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయం నిర్మాణంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గురువారం ఉదయం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ప్రగతిభవన్‌లో కలిసి నివేదిక అందించింది. అంతకుముందు కొత్త సచివాలయం ఏర్పాటుపై వివిధ శాఖల ఈఎన్‌సీలు మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికలు ఇచ్చారు. వాటిని అనుసరించి మంత్రివర్గ ఉపసంఘం తమ అభిప్రాయాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేసింది. సీఎంను కలిసిన వారిలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు.

### 'ఐదెకరాలు దాటితే రైతుబంధు ఇవ్వరా?'



సాక్షి, హైదరాబాద్: ఐదెకరాల కంటే ఎక్కువ భూమున్న వారికి రైతుబంధు ఇవ్వకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుని ఉంటే దాన్ని బహిరంగపర్చాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. జూన్‌లోనే జమకావాల్సిన రైతుబంధు నిధుల్లో ఐదెకరాలు దాటిన రైతులెవరికీ ఒక్క రూపాయి కూడా రాలేదని ఆయన తెలిపారు. మిగిలిన వారిలో కూడా దాదాపు 60% మంది రైతులకు రైతుబంధు సాయం అందలేదన్నారు. వెంటనే వారికి రైతుబంధు నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం కేసీఆర్‌కు ఉత్తమ్ గురువారం బహిరంగ లేఖ రాశారు.

### కాళ్ల కిందకు నీళ్లొస్తాయని కాంగ్రెస్ భయం: కర్నె



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే రాజకీయంగా తమ కాళ్ల కిందకు నీళ్ల వస్తాయనే భయం కాంగ్రెస్ నేతలను వెంటాడుతోందని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం తెలంగాణ భవనలో మీడియాతో మాట్లాడారు. ఓ వైపు ఉత్తర తెలంగాణతో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు ప్రయోజనం చేకూర్చే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తవుతున్నాయని, మరోవైపు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేసే దిశగా సీఎం కేసీఆర్ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే తమకు రాజకీయంగా మనుగడ ఉండదనే భయంతోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు సీఎం, టీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు.

### 'డీపీఆర్ ఇస్తే బాగోతం బయటపడుతుంది'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అడగలేదని స్వయంగా కేంద్ర జలవనరుల మంత్రి లోక్‌సభలో చెప్పారని, జాతీయ హోదా కోసం ప్రాజెక్టు డీపీఆర్‌లు కేంద్రానికి ఇస్తే ముడుపుల బాగోతం బయటపడుతుందనే అడగటం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జాతీయ హోదా అడిగామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆయన టీఆర్‌ఎస్ నేతగా కాకుండా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ తమ్మిడిహెట్టి యాత్ర ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉందని వినోద్ వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టే సాగునీటి ప్రాజెక్టు కాదని, టూరిజం ప్రాజెక్టు అని ఎద్దేవా చేశారు.

### గాంధీభవన్‌లో సమాచార కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యలు, రాజకీయ విధానాలపై తమ వాణిని వినిపించేందుకు నాయకులకు అవసరమయ్యే సమాచారాన్ని అందించడం కోసం గాంధీభవన్‌లో సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సమాచార కేంద్రం బాధ్యతలు టీపీసీసీ మీడియా కో–ఆర్డినేటర్ బొరెడ్డి అయోధ్యరెడ్డికి అప్పగించాలని గురువారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ అధికార ప్రతినిధుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

### 'ఆర్‌జీఎన్‌ఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి'



సాక్షి, హైదరాబాద్: దళిత పరిశోధన విద్యార్థులకు రాజీవ్‌గాంధీ జాతీయ ఫెలోషిప్ (ఆర్‌జీఎన్‌ఎఫ్) బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట దళిత పరిశోధన విద్యార్థులు చేపట్టిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత మూడేళ్లుగా ఎస్సీ పరిశోధన విద్యార్థులకు రాజీవ్‌గాంధీ జాతీయ ఫెలోషిప్ నిధులు విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. చేతిలో డబ్బులు లేకుంటే పేద విద్యార్థులు పరిశోధనలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

# పప్పులు ఉడకడంలేదు!



- రూ. 100కి చేరిన కిలో కందిపప్పు
- గతేడాదితో పోలిస్తే రూ. 30 అధికం
- పెసర, మినపపప్పు ధరలూ పైపైకి
- రాష్ట్రంలో సాగు తగ్గడం, మహారాష్ట్రలో భారీ వర్షాలే కారణం
- నిల్వలపై ఆంక్షలు పెడితేనే ధరలు దిగొచ్చేది

**10.37 లక్షల ఎకరాలు** – రాష్ట్రంలో పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం
**9.17 లక్షల ఎకరాలు** – ప్రస్తుత ఏడాదిలో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం
**7.30 లక్షల ఎకరాలు** – కంది సాధారణ సాగు విస్తీర్ణం
**6.20 లక్షల ఎకరాలు** – ప్రస్తుత ఏడాదిలో కంది సాగు విస్తీర్ణం
**2.30 లక్షల ఎకరాలు** – పెసర సాగు సాధారణ విస్తీర్ణం
**1.90 లక్షల ఎకరాలు** – పెసర ప్రస్తుత సాగు విస్తీర్ణం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో పప్పుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో సాగు తగ్గడం, పొరుగు రాష్ట్రాల్లో భారీ వరదలతో దిగుమతులు తగ్గడం, ద్రవ్యోల్బణం కారణంగా ధరలు చుక్కలనంటుతున్నాయి. ముఖ్యంగా కందిపప్పు ధర రూ. 100 మార్కును చేరగా పెసరపప్పు, మినపపప్పు సైతం సెంచరీకి చేరువయ్యాయి. గత 4–5 రోజుల్లోనే మేలు రకం కందిపప్పు ధర రూ. 10 మేర పెరిగింది. గతేడాదితో పోలిస్తే రూ. 30 మేర అధికంగా ఉంది. ధరలు మరింత పెరిగే అవకాశాల నేపథ్యంలో నియంత్రణ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించాల్సి ఉంది.

**ధరలు పైపైకి..**

రాష్ట్రంలో మొత్తంగా పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాల మేర ఉండగా ప్రస్తుత ఏడాదిలో 9.17 లక్షల ఎకరాల మేర ఉంది. ఇందులో కంది సాగు విస్తీర్ణం 7.30 లక్షల ఎకరాలు ఉండగా 6.20 లక్షల ఎకరాల మేర సాగు జరిగింది. సాగు విస్తీర్ణం తగ్గడం, చాలా చోట్ల సాగు ఆలస్యం కావడంతో దిగుబడులు తగ్గనున్నాయి. దీనికితోడు కందిపప్పు దిగుబడిలో ముందుండే మహారాష్ట్రలోనూ ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా సాగు తగ్గింది. దీంతో అక్కడి నుంచి దిగుమతులు తగ్గాయి. అలాగే మయన్మార్ నుంచి కందిపప్పు దిగుమతులు సైతం భారీగా తగ్గిపోయాయి. దీంతో గతేడాది ఇదే సమయానికి కంది గ్రేడ్–1 రకం కిలో రూ. 65–70 ఉండగా అది ఈ ఏడాది ఏకంగా రూ. 95–105 మధ్య ఉంది. ఇక గ్రేడ్–2 కంది ధర గతేడాది రూ. 60–65 మధ్య ఉండగా ప్రస్తుతం రూ. 85–90 వరకు ఉంది. పౌర సరఫరాల అధికారిక గణాంకాల ప్రకారమే ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కిలో కంది రూ. 95 మార్కును దాటింది. ఇక పెసర సాగు సాధారణ విస్తీర్ణం 2.30 లక్షల ఎకరాలుకాగా ప్రస్తుతం 1.90 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. దీంతో పెసర ధరలు గతేడాది ఇదే సమయానికి కిలో రూ.75 పలకగా ఈ ఏడాది ప్రస్తుతం రూ. 90–95 మేర పలుకుతున్నాయి. మినపపప్పు ధర సైతం రూ.100కి దగ్గరగా ఉంది. శనగపప్పు ధర రూ. 60–75 నుంచి రూ. 80కి పెరిగింది.

**నిల్వలపై ఆంక్షలు, నిఘాయే పరిష్కారం..**

గతంలో పప్పుల ధరలు భారీగా పెరిగినప్పుడు వాటి నిల్వలపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఇవే ఆంక్షలను రాష్ట్రాలు సైతం పాటించాలని ఆదేశించింది. రాష్ట్రంలో పప్పుల ధరలు మరింతగా పెరిగే అవకాశాన్ని, డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలున్న దృష్ట్యా పప్పుల నిల్వలపై పరిమితిని స్పష్టంగా నిర్దేశించింది. గతంలో హైదరాబాద్‌లో శనగపప్పు మినహా అన్ని రకాల పప్పులను హోల్‌సేల్ వ్యాపారులైతే 4 వేల క్వింటాళ్లు, రిటైల్ వ్యాపారులు 125 క్వింటాళ్లను మించి నిల్వ చేయరాదని పేర్కొంది. అలాగే శనగపప్పును హోల్‌సేలర్ వెయ్యి క్వింటాళ్లు, రిటైలర్ 30 క్వింటాళ్లను మించరాదని తెలిపింది. మిగతా ప్రాంతాల్లో శనగపప్పు హోల్‌సేలర్ 500 క్వింటాళ్లు, రిటైలర్ 20 క్వింటాళ్లు.. ఇతర పప్పులైతే హోల్‌సేల్ వ్యాపారి 2,500 క్వింటాళ్లు, రిటైలర్ 100 క్వింటాళ్లను మించి నిల్వ ఉంచరాదని ప్రభుత్వం నిర్దేశించింది. పరిమితికి మించి పప్పులు నిల్వ చేసిన వ్యాపారులపై విజిలెన్స్ దాడులు చేసింది. ఈ పరిమితులతో పప్పుల ధరలు కొంతమేర దిగొచ్చాయి. ప్రస్తుతం తగ్గిన సాగు, దిగుమతుల కారణంగా నిల్వలు పెంచే అవకాశాల దృష్ట్యా పరిమితులు విధించడంతోపాటు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

**కందిపప్పు ధరలో వ్యత్యాసం ఇలా...**

| రకం | గతేడాది | ఈ ఏడాది |
|---|---|---|
| గ్రేడ్–1 | 65–70 | 95–105 |
| గ్రేడ్–2 | 60–65 | 85–90 |

| | గతేడాది | ఈ ఏడాది |
|---|---|---|
| పెసరపప్పు | 75 | 90–95 |
| మినపపప్పు | – | 98 |
| శనగపప్పు | 60 | 70–75 |

### 10 లక్షల టన్నుల పప్పుధాన్యాల దిగుమతికి సిద్ధం: కేంద్రం

ద్రవ్యోల్బణం నేపథ్యంలో పప్పు ధాన్యాల ధరలు పెరుగుతాయన్న అంచనాలతో ధరల నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండ్రోజుల కిందట పప్పుధాన్యాల నిల్వలపై సమీక్షించిన కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ధరలు అదుపులో ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2018–19లో మొత్తంగా 317 లక్షల టన్నుల పప్పుధాన్యాలను కేంద్ర సంస్థల ద్వారా సేకరించగా ఇందులో 280 లక్షల టన్నుల వినియోగం జరిగిందని, మరో 37 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని పాశ్వాన్ తెలిపారు. ఈ ఏడాది మరో 260 లక్షల టన్నుల మేర పప్పుధాన్యాల దిగుబడి అంచనా ఉందని, ఇది సరిపోని పక్షంలో మరో 10 లక్షల టన్నులను దిగుమతి చేసుకుంటామని చెప్పారు. దీంతో మొత్తంగా 307 లక్షల టన్నులు దేశంలో అందుబాటులో ఉంటుందని, ఇందులో 290 లక్షల టన్నుల వినియోగం జరుగుతుందని అంచనా వేశారు.



ప్రగతిభవన్‌లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక విధివిధానాలపై సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

# గ్రామాల సమగ్రాభివృద్ధికి శ్రీకారం

**అక్టోబర్ 5 లేదా 6 నుంచి కార్యాచరణ ప్రణాళిక: సీఎం కేసీఆర్**

సాక్షి, హైదరాబాద్: గ్రామాల పచ్చదనం, పరిశుభ్రత మెరుగుపరిచేందుకు, సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు ఉద్దేశించిన కార్యాచరణ ప్రణాళిక అక్టోబర్ 5 లేదా 6వ తేదీ నుండి మొదలయ్యే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ లోగానే కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. కార్యాచరణ అమలు పటిష్టంగా, పకడ్బందీగా చేయడానికి సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, ఇతరులను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఈ ప్రణాళిక అమలులో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీ తన వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకొని దానికి గ్రామ సభ ఆమోదం పొందాలని సీఎం పేర్కొన్నారు. గ్రామంలో ఖర్చు పెట్టే ప్రతీ పైసా గ్రామసభ ఆమోదంతోనే జరగాలని కేసీఆర్ స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలకు కార్యాచరణ పథకం అమలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి ప్రతినెలా రూ.339 కోట్లు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం ఎనిమిది నెలలపాటు ఈ నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. గురువారం ప్రగతి భవన్‌లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక విధివిధానాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. శుక్రవారం మరోమారు సమీక్ష జరిపి పూర్తి స్థాయి అవగాహనకు వచ్చిన తరువాత తుది నిర్ణయం ప్రకటిస్తామని, కార్యాచరణ ప్రణాళికలో ఏయే అంశాలు ఉండాలో శుక్రవారం నిర్ణయిస్తామన్నారు. శుక్రవారం జరగనున్న సమీక్షా సమావేశానికి అధికారులు, అనధికారులతో పాటు కామారెడ్డి, సిద్దిపేట, వరంగల్ అర్బన్ జిల్లాల కలెక్టర్లను కూడా ఆహ్వానించాలని సీఎం చెప్పారు. వారితో పాటు ఆ జిల్లాలకు చెందిన ఇద్దరు ఎంపీడీవోలను, ఒక డీఎఫ్‌వోను, ఒక డీపీవోను, ఎస్ఈ విద్యుత్ శాఖ, సీపీవోను కలెక్టర్లు వెంట తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీలు మందా జగన్నాథం, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేరుగా కార్యకర్తలతో!

- వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ రాష్ట్రవ్యాప్త పర్యటన
- వచ్చే నెల నుంచి టీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశాలు
- మునిసిపల్ ఎన్నికలు జరిగే నియోజకవర్గాలకు తొలి ప్రాధాన్యత
- పార్టీపై పూర్తిస్థాయి పట్టు సాధించడమే లక్ష్యంగా..
- ఒక్కో మీటింగ్‌కు ఐదువేలకు పైగా క్రియాశీల కార్యకర్తలు
- ప్రధాన కార్యదర్శులకు శ్రేణులను సమన్వయం చేసే బాధ్యత



సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో పార్టీ శ్రేణులతో మమేకమ్యేందుకు కేటీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో.. వచ్చేనెల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మునిసిపల్ ఎన్నికలు జరిగే నియోజకవర్గాలకు తన పర్యటనలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మునిసిపల్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంతోపాటు పార్టీ ద్వితీయశ్రేణి నేతలు, క్రియాశీల కార్యకర్తలను నేరుగా కలిసేందుకు ఈ పర్యటన ఉపయోగపడేలా షెడ్యూలు రెడీ చేసుకుంటున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం.. డిసెంబరులో టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ నియమితులైన సంగతి తెలిసిందే. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కేటీఆర్ ఈ ఏడాది వేసవిలో జరిగిన లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలంగా పనిచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ పీఠాలన్నీ టీఆర్‌ఎస్ ఖాతాలో చేరగా, జెడ్పీ చైర్మన్ల ఎంపిక వంటి అంశాల్లో కేటీఆర్ అంతా తానై వ్యవహరించారు. త్వరలో జరిగే మునిసిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ ఏకపక్ష విజయం సాధించేలా ఇప్పటికే పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఈ సన్నాహకాల్లో భాగంగా పార్టీ ప్రధాన కార్యదర్శులతో బుధవారం తెలంగాణ భవన్‌లో 6గంటల పాటు సుదీర్ఘంగా కేటీఆర్ సమావేశమయ్యారు. వచ్చే నెల 4న పార్టీ ప్రధాన కార్యదర్శులతో మరోమారు సమావేశమై.. అసెంబ్లీ నియోజకవర్గాల పర్యటన షెడ్యూలుకు తుదిరూపు ఇచ్చే అవకాశం ఉంది.

**సంస్థాగత కమిటీల నిర్మాణం తర్వాతే!**

రెండేళ్ల పాటు అమల్లో ఉండేలా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ జూన్ 27న ప్రారంభించారు. సుమారు 2నెలల పాటు సాగిన కార్యక్రమంలో 60 లక్షల మంది పార్టీ సభ్యులుగా నమోదయ్యారు. ఇందులో 20 లక్షల మంది క్రియాశీల సభ్యులు ఉండగా, సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ, మండల, పట్టణ కమిటీల నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోంది. మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డు, డివిజన్ కమిటీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కేటీఆర్ ఆదేశించారు. రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీల్లో టీఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీల బలాలను అంచనా వేసే బాధ్యతను పార్టీ ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలోని కమిటీలకు అప్పగించారు. సభ్యత్వ నమోదు విజయోత్సవ సభ పేరిట ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు కూడా.

**ఒక్కో మీటింగ్‌కు 5 వేల మంది**

నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సమావేశాలకు పార్టీలో క్రియాశీల సభ్యులుగా నమోదైన వారిని ఆహ్వానిస్తారు. ఒక్కో నియోజకవర్గంలో 5–7వేల క్రియాశీల కార్యకర్తలుండాలని అంచనా వేశారు. నియోజకవర్గస్థాయి సమావేశాలకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు డీసీసీబీ, డీసీఎంఎస్, జెడ్పీ చైర్మన్లను కూడా ఆహ్వానిస్తారు. నియోజకవర్గ పరిధిలోని మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులను కూడా పిలవాలని నిర్ణయించారు. ఈ సమావేశాల సందర్భంగా పార్టీ నేతల మధ్య సమన్వయలోపం లేకుండా చూసే బాధ్యతను ప్రధాన కార్యదర్శులకు అప్పగించనున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో క్షేత్రస్థాయి పర్యటన ద్వారా పార్టీ యంత్రాంగంపై పట్టు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఫేస్‌బుక్ మర్డర్

▶ మొదటి పేజీ తరువాయి

రోడ్డుపైకి వచ్చింది. ఆ తర్వాత ఆమె ఇంటికి తిరిగి వెళ్లలేదు. దాదాపు గంటపాటు ఎదురుచూసిన తల్లి సురేఖ.. కూతురు ఇంటికి రాలేదంటూ భర్త రవిశంకర్‌కు ఫోన్ చేసింది. రవిశంకర్ వెంటనే ఇంటికొచ్చి చుట్టుపక్కల వారిని శ్రీహర్షిణి గురించి అడిగారు. ఆమెకు ఫోన్ చేస్తే రింగ్ అయింది కానీ ఎత్తలేదు. రాత్రి 7 గంటల తరువాత ఫోన్ కూడా స్విచాఫ్ అయింది. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనతో జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి వెంటనే దర్యాప్తు చేపట్టారు.

**కారులో ఎక్కి వెళ్లిందన్న సమాచారంతో..**

హౌసింగ్‌బోర్డు సమీపంలో ఓ కారులో శ్రీహర్షిణి ఎక్కి వెళ్లిందని.. తెలిసిన వారైనందునే ఆ కారులో వెళ్లి ఉంటుందని భావించినట్లు కొందరు స్థానికులు పోలీసులకు చెప్పారు. ఆ కారు గుర్తులు అడిగి తెలుసుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. బాలానగర్ సమీపంలోని టోల్‌ప్లాజా దగ్గర జడ్చర్ల వైపు వచ్చి కేవలం అరగంటలోపే మళ్లీ హైదరాబాద్ వైపు ఆ కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. కారు నంబరును సేకరించి రవాణా శాఖ అధికారుల సహకారంతో కారు యజమాని చిరునామాను సేకరించి దర్యాప్తును వేగవంతం చేశారు.

**నిందితుడి పట్టివేత**

ఈ మేరకు కారు యజమాని తన కారును తీసుకెళ్లిన యువకుడి సమాచారం పోలీసులకు ఇవ్వడంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ శివారులోని హయత్‌నగర్ మండలం కోహెడకి చెందిన ఏనుగు నవీన్‌రెడ్డి (28)ని పోలీసులు అరెస్ట్ చేసి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు హైదరాబాద్‌లోని వీల్ అలైన్‌మెంట్ దుకాణంలో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు నవీన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన సమాచారంతోనే శ్రీహర్షిణి హత్య వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమ స్టైల్లో విచారించగా.. గురువారం తెల్లవారుజామున శ్రీహర్షిణిని చంపేసినట్లు చెప్పాడు. ఈ సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, బంధువులు శ్రీహర్షిణి మృతదేహాన్ని గుర్తించారు. జడ్చర్ల శివారులోని శంకరాయపల్లితండాకు వెళ్లే రహదారికి కొద్దిదూరంలో ఉన్న గుట్ట పక్కన గడ్డిపొదల మాటున మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నిందితుడు నవీన్‌రెడ్డి (ఫైల్)

**ఉరిశిక్ష విధించాలి**

విద్యార్థినిని దారుణంగా హత్యచేసిన నిందితుడికి ఉరిశిక్ష విధించాలని విద్యార్థి, మహిళా సంఘాలు, యువకులు, రాజకీయ నాయకులు ఆందోళనకు దిగారు. జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు ఎదుట జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వరంగల్‌లో ఇలాంటి ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో ఆ కేసులో నిందితుడికి ఎలాంటి శిక్ష అమలు చేశారో అదే ఉరిశిక్షను ఇక్కడి హంతకుడు నవీన్‌రెడ్డికి విధించాలని వారు డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిందంటే!**

పెద్దగా చదువుకోని నవీన్‌రెడ్డి ఫేస్‌బుక్‌లో జడ్చర్లకు చెందిన శ్రీహర్షిణితో మూడు నెలలుగా ఫ్రెండ్‌షిప్ చేస్తున్నాడు. వీరి స్నేహం కాస్త ముదరడంతో తరచూ వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా చాటింగ్ చేసుకునేవారని సమాచారం. కొంత చనువు ఏర్పడటంతో నవీన్‌రెడ్డి మంగళవారం కారులో జడ్చర్లకు వచ్చి శ్రీహర్షిణిని కలిశాడు. హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలోనే ప్రధాన రహదారిపైకి వచ్చిన శ్రీ హర్షిణిని నవీన్‌రెడ్డి కారులో ఎక్కించుకుని శంకరాయపల్లి తండా రహదారి వైపు వెళ్లారు. అక్కడ నిర్జన ప్రదేశంలో వారు కాసేపు మాట్లాడిన తరువాత శారీరకంగా తనతో కలవాలని నవీన్‌రెడ్డి శ్రీహర్షిణిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో తనకు ఇష్టంలేదని, తనను వదిలేయాలని శ్రీహర్షిణి చెప్పింది. వెంటనే అక్కడి నుంచి పరిగెత్తే క్రమంలో నవీన్‌రెడ్డి శ్రీహర్షిణి డ్రెస్సును పట్టి లాగడంతో దుస్తులు చిరిగిపోయాయి. ఈ క్రమంలో శ్రీహర్షిణిని గట్టిగా వెనక్కి నెట్టడంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే పక్కనే ఉన్న బండరాయిని తలపై పడేసిన నవీన్‌రెడ్డి వెంటనే కారులో హైదరాబాద్‌కి వెళ్లిపోయాడు.

# విద్యార్థుల భవితకు పది సూత్రాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అలవాటు చేయాల్సిన పది రాజీలేని సూత్రాలను విద్యాశాఖ ప్రకటించింది. కచ్చితంగా వాటిని అలవరచుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది. విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు.

**ఇవీ విద్యార్థులు పాటించాల్సిన టెన్ కమాండ్‌మెంట్స్**



- ఎన్ని పనులున్నా ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే అమ్మా నాన్నలు లేపకున్నా నిద్ర లేస్తాను.
- నా సామర్థ్యాన్ని నిరంతరం తెలుసుకుంటూ దానిని మరింత పెంచుకోవడం కోసం ప్రయత్నిస్తాను.
- శారీరక పరిశుభ్రత కోసం ప్రతిరోజూ స్నానం చేస్తాను.
- ఎన్ని పనులున్నా ఏరోజు పాఠాలను ఆ రోజే చదువుకుంటాను.
- నా లక్ష్య సాధన కోసం వంద శాతం ప్రయత్నిస్తాను.
- ఫలితం కోసం ఎదురుచూడను. బాధ పడను. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తాను.
- లక్ష పనులున్నా ప్రతిరోజూ వేళకు బడికి వెళ్తాను.
- నా భవిష్యత్తును నిర్మించుకోవడం నా బాధ్యత అని నమ్మి దాని కోసం శ్రమిస్తాను.
- నేను చదువుతోపాటు ఆటలు, పాటలు, కళలు మొదలైన వాటిలో పురోగమించడానికి కృషి చేస్తాను.
- తోటి వారితో కలిసిమెలిసి ఉండటం ద్వారా నేను అభివృద్ధి చెందుతాను. ఇతరుల అభివృద్ధికి తోడ్పడతాను.

# అణు క్షిపణిని పరీక్షించిన పాక్




**బాలిస్టిక్ క్షిపణి 'ఘజ్నవి' ప్రయోగం • పరిధిలోకి భారతదేశ భూభాగాలు**

**ఇస్లామాబాద్:** జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించిన తర్వాత భారతదేశంపై కయ్యానికి కాలు దువ్వుతున్న దాయాది దేశం పాకిస్తాన్ తాజాగా అణు బాలిస్టిక్ క్షిపణి 'ఘజ్నవి'ని విజయవంతంగా పరీక్షించింది. ఇప్పటికే కరాచీలోని మూడు గగనతల మార్గాలను మూసివేసి, నిత్యం భారత్‌పై అక్కసును వెళ్లగక్కుతున్న పాక్ ఇప్పుడు ఏకంగా అణు క్షిపణిని పరీక్షించడం గమనార్హం. అణు వార్‌హెడ్లను (అత్యధిక తీవ్రత కలిగిన పేలుడు పదార్థాలు) మోసుకెళ్లే సామర్థ్యమున్న ఈ క్షిపణి 290 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదని ఆర్మీ తెలిపింది. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే దీనిద్వారా భారత దేశంలోని కొంత భూభాగాన్ని సైతం లక్ష్యంగా చేసుకోవచ్చు. స్కడ్ టైప్ బాలిస్టిక్ మిస్సైల్‌ను అభివృద్ధి చేసి ఘజ్నవిని రూపొందించినట్లు నిపుణులు భావిస్తున్నారు. ఘజ్నవి వీడియోను పాకిస్తాన్ మిలిటరీ మీడియా అధికార ప్రతినిధి మేజర్ జనరల్ అసిఫ్ గఫూర్ గురువారం ట్విట్టర్ ద్వారా బయటపెట్టారు. బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తల బృందాన్ని పాకిస్తాన్ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ, ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ అభినందించారని అసిఫ్ గఫూర్ తెలిపారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో 'నాజర్', మే నెలలో 'షహీన్-2' అనే బాలిస్టిక్ మిస్సైళ్లను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్ విషయంలో ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం నిర్వీర్యం చేయడంపై పాకిస్తాన్ భగ్గుమంటోంది. కశ్మీర్‌పై ఎంతదాకా అయినా వెళ్తామని, అణు యుద్ధానికైనా సిద్ధమని పాక్ ప్రధాని ఇమ్రాన్ గతంలోనే చెప్పారు.

**పసిమొగ్గలను చిదిమేశారు**



ప్రభుత్వ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన తన పిల్లలను చూసి బోరున విలపిస్తున్న ఓ తండ్రి. సిరియాలోని వేర్పాటువాదుల అధీనంలోని మారత్-అల్-నుమన్ పట్టణంపై సిరియా సైన్యం వైమానిక దాడి చేయగా ఇతని ముగ్గురు పిల్లలు, బంధువుల పాప ప్రాణాలు కోల్పోయారు

## క్లుప్తంగా..

### నవాజ్‌ను దించేందుకు పాక్ నిఘా వర్గాల కుట్ర



**వాషింగ్టన్:** ప్రధాని నవాజ్ షరీఫ్‌ను గద్దె దించేందుకు, ఇమ్రాన్‌ను అధికారంలోకి తెచ్చేందుకు 2018 ఎన్నికలతోపాటు అంతకు ముందు పాకిస్తాన్ నిఘా సంస్థలు తెరచాటు కుట్రలు సాగించినట్లు అమెరికా ప్రభుత్వ నివేదిక ఒకటి వెల్లడించింది. ఎలాంటి రాజకీయ అనుభవం లేని ఇమ్రాన్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు 'సైన్యం-న్యాయ వ్యవస్థల సన్నిహిత సంబంధాలు' పనిచేశాయని కంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్(సీఆర్ఎస్) కాంగ్రెస్ సభ్యుల కోసం రూపొందించిన ఆ నివేదిక తెలిపింది. 'నిఘా వ్యవస్థలు జోక్యం చేసుకుంటూ షరీఫ్‌ను తొలగించేందుకు, ఆయన పార్టీని బలహీన పరచడమే లక్ష్యంగా తెర వెనుక కుట్రలు సాగించాయన్నది ఆ నివేదిక పేర్కొంది. ఇమ్రాన్ ఆర్థిక సంక్షోభం కారణంగా ఏమీ చేయలేకపోయారని తెలిపింది. పాక్ విదేశాంగ, రక్షణ విధానాల్లో సైన్యం పెత్తనం కొనసాగుతోందని తెలిపింది.

### ఇమ్రాన్‌కు 'కరెంట్' షాక్



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఆ దేశ విద్యుత్ సరఫరా సంస్థ షాక్ ఇచ్చింది. ఇస్లామాబాద్‌లోని పీఎంవో కార్యాలయానికి సంబంధించి పేరుకుపోయిన విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే వెంటనే కరెంట్ సరఫరా నిలిపేస్తామని హెచ్చరించింది. పీఎంవో సెక్రటేరియెట్‌కు ఇస్లామాబాద్ ఎలక్ట్రిక్ సప్లై కంపెనీ (ఇస్కో) ఈ మేరకు నోటీసులిచ్చింది. పీఎంవో కార్యాలయం రూ.41 లక్షల బిల్లు చెల్లించకుండా బకాయి పడిందని.. అంతేగాక గత నెలలో చెల్లించాల్సిన రూ.35 లక్షల బకాయిలు అలానే ఉన్నాయని పేర్కొంది. అక్కడ వరుసగా రెండు నెలల కరెంట్ బిల్లులు చెల్లించని పక్షంలో హెచ్చరికలు జారీ చేసి విద్యుత్ సరఫరా నిలిపేయొచ్చు.



### రైళ్లు ఢీ కొట్టకుండా..

**త్వరలో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ**

**న్యూఢిల్లీ:** రైళ్లు ఒకదానితో మరోటి ఢీకొట్టడం లాంటి ప్రమాదాలను పూర్తిగా నిరోధించడమే లక్ష్యంగా అధునాతన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తెస్తామని రైల్వే బోర్డ్ చైర్మన్ వీకే యాదవ్ ప్రకటించారు. రైళ్ల రూట్ల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే ఉద్దేశంతో ముంబై-అహ్మదాబాద్ రూట్ సహా మరో 10 హైస్పీడ్ రైల్ కారిడార్లను ఎంపిక చేశామని యాదవ్ తెలిపారు. 'ప్రస్తుతం మనకు అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ లేదు. వచ్చే కొద్ది సంవత్సరాల్లో పూర్తి స్థాయిలో నూతన సిగ్నలింగ్ వ్యవస్థను తీసుకొస్తాం'అని చెప్పారు. 'తొలిసారిగా ఢిల్లీ-లక్నో మార్గంలో తేజస్ రైలు నిర్వహణ బాధ్యతలను ఐఆర్‌సీటీసీకి అప్పగిస్తున్నాం. ఈ రూట్‌తోపాటే ముంబై-అహ్మదాబాద్ సాధారణ రైలు రూట్ నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్తాం'అని యాదవ్ పేర్కొన్నారు.

### శ్రీనగర్‌లో పౌరుడిని చంపిన ఉగ్రవాదులు

**శ్రీనగర్:** శ్రీనగర్‌కు చెందిన ఓ దుకాణదారుడిని ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. నగర శివార్లలోని పరిమ్‌పొరాలో దుకాణం యజమాని గులామ్ మొహమ్మద్ వద్దకు గురువారం రాత్రి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. అప్పుడే దుకాణం మూసివేస్తున్న అతనిపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించి, వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో నేలకొరిగిన మొహమ్మద్ అక్కడికక్కడే చనిపోయాడని అధికారులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఈ ప్రాంతంలో భద్రతను మరింత పెంచారు. దుండగుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# భారత్‌లోకి ఉగ్ర మూకలు?

**చొరబడే అవకాశముందన్న నిఘా వర్గాలు • గుజరాత్ తీరంలో హై అలర్ట్**

**కాండ్లా, ముంద్రా పోర్టుల్లో భద్రత కట్టుదిట్టం • కోయంబత్తూర్‌లో ఎన్ఐఏ సోదాలు**

**భుజ్(గుజరాత్)/కోయంబత్తూరు:** కశ్మీర్‌కు స్వతంత్రప్రతిపత్తి రద్దు అనంతరం పాకిస్తాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ఆ దేశం నుంచి ఉగ్రవాదులు దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించే అవకాశాలున్నాయన్న నిఘా వర్గాల హెచ్చరికలతో గుజరాత్ తీరం కచ్ జిల్లాలోని కాండ్లా, ముంద్రా పోర్టులతో పాటు కీలక సంస్థల వద్ద హై అలర్ట్ ప్రకటించారు. ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) కేరళ-తమిళనాడు మాడ్యూల్ కార్యకలాపాలపై మరిన్ని వివరాలు రాబట్టేందుకు కోయంబత్తూర్‌లో ఎన్ఐఏ తనిఖీలు చేపట్టింది. పాక్ కమాండోలు సముద్రం మీదుగా భారత్‌లోకి ప్రవేశించి మత విద్వేషాలు సృష్టించడంతోపాటు నీటిలో ఉండి దాడులకు తెగబడే అవకాశాలున్నాయంటూ భారత నేవీ హెచ్చరికలు పంపిన నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. కచ్ తీరంలో అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న ముంద్రా పోర్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. దేశంలోని అతిపెద్ద పోర్టుల్లో ఇది ఒకటి కాగా, ప్రభుత్వరంగ కాండ్లా నౌకాశ్రయం ద్వారా పెద్ద మొత్తంలో సరుకు రవాణా జరుగుతుంది. అరేబియా సముద్ర తీరంలోని ఈ రెండు పోర్టులు పాకిస్తాన్‌కు చేరువలో ఉన్నాయి. ఇక్కడికి సమీపంలో జామ్‌నగర్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద రిలయన్స్ చమురుశుద్ధి కర్మాగారం, వడినార్ వద్ద రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్ ఆయిల్ రిఫైనరీలున్నాయి. ఉగ్రవాదుల చొరబాటుకు అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో కచ్ జిల్లాలోని కాండ్లా పోర్టుతోపాటు కీలక సంస్థల వద్ద భద్రతను భారీగా పెంచాం' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బోర్డర్ రేంజ్) డీబీ వఘేలా తెలిపారు. పోలీసులు, మెరైన్ బలగాలు, ఇతర భద్రతా సంస్థలు ఈ ప్రాంతంలో గస్తీని ముమ్మరం చేశాయి. తీరప్రాంత భద్రతా చర్యలను పటిష్టం చేశామని, ఉగ్రవాదులు పాల్పడే ఎలాంటి దుస్సాహసాన్నయినా తిప్పికొట్టేందుకు బలగాలను అప్రమత్తం చేశామని డిప్యూటీ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ మురళీధర్ పవార్ తెలిపారు.

**ఐఎస్ లింకులపై ఎన్ఐఏ తనిఖీలు**

ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్ కేరళ-తమిళనాడు మాడ్యూల్ కార్యకలాపాలపై కూపీ లాగుతున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గురువారం కోయంబత్తూరులో విస్తృతంగా సోదాలు చేపట్టింది. ఎర్నాకులంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జారీ చేసిన వారంట్ల మేరకు నిందితుల సంబంధీకులకు చెందిన ఐదు ప్రాంతాల్లో తనిఖీలు చేశాం. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, 5 సెల్‌ఫోన్లు, 4 సిమ్ కార్డులు, 1 మెమరీ కార్డు, 8 సీడీలు/డీవీడీలు, అభ్యంతరకర పత్రాలు లభించాయి. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాం' అని ఎన్ఐఏ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐఎస్ కార్యాకలాపాలకు సంబంధించిన సమాచారంపై కొందరిని ప్రశ్నించామని తెలిపింది. కాగా, గత వారం రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడిన లష్కర్-ఇ- తైబా ఉగ్ర సంస్థ సభ్యులతో వీరికి సంబంధాలున్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పెడదారి పట్టిన యువతను సోషల్ మీడియా ద్వారా కొందరు వ్యక్తులు ఐఎస్ ఉగ్ర సంస్థలోకి ఆకర్షించి కేరళ, తమిళనాడుల్లో దాడులకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎన్ఐఏ మేలో కేసులు నమోదు చేసింది.



హై అలర్ట్ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

### చిదంబరం కేసులో 5న సుప్రీం తీర్పు



**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా మనీల్యాండరింగ్ కేసుకు సంబంధించి కేంద్ర మాజీ మంత్రి చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌పై సెప్టెంబర్ 5న తీర్పు వెలువరిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. చిదంబరాన్ని ఈడీ అరెస్టు చేయకుండా కల్పించిన తాత్కాలిక రక్షణ గడువును వచ్చే గురువారం వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. వచ్చే సోమవారం వరకు చిదంబరానికి సీబీఐ కస్టడీ కొనసాగుతుందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీల్డ్ కవర్‌లో తమ ముందుంచాలని ఈడీని ఆదేశించింది.

**చిదంబరం అరెస్టు శుభవార్తే: ఇంద్రాణి**

చిదంబరం అరెస్టుపై ఐఎన్ఎక్స్ మీడియా మాజీ ప్రమోటర్ ఇంద్రాణి ముఖర్జియా స్పందించారు. ఐఎన్ఎక్స్ కేసులో చిదంబరం అరెస్టు కావడం శుభవార్తే అని వ్యాఖ్యానించారు. తన కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలుగా ఉన్న ఇంద్రాణిని గురువారం సీబీఐ ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఐఎన్ఎక్స్ కేసులో చిదంబరాన్ని అన్ని వైపుల నుంచి కట్టడి చేశారని అన్నారు. ఇదే కేసులో కార్తీ చిదంబరానికి మంజూరు చేసిన బెయిల్‌ను కూడా రద్దు చేయాలని వ్యాఖ్యానించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఇంద్రాణి అప్రూవర్‌గా మారడం తెల్సిందే.



కార్యక్రమంలో పాల్గొన్న గౌతం గంభీర్, శిల్పాశెట్టి తదితరులకు మోదీ అభివాదం

# పెట్టుబడి 0%.. ఫలితాలు 100%

- ఉద్యమంలా ఆరోగ్య పరిరక్షణ: మోదీ
- 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ప్రారంభం

**న్యూఢిల్లీ:** దేశంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ సూచించారు. ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచడంలో భాగంగా ప్రభుత్వం 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్'ను మొదలు పెట్టింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం దీనిని ప్రారంభించాక మోదీ మాట్లాడారు. 'ఫిట్‌నెస్ అనేది సున్నా శాతం పెట్టుబడి పెడితే వంద శాతం ఫలితాలు ఇచ్చేది. కొన్ని దశాబ్దాల క్రితం ఒక సాధారణ వ్యక్తి కూడా కనీసం 8-10 కిలోమీటర్లు నడవటమో, పరుగెత్తడమో చేసేవాడు. టెక్నాలజీ పెరిగాక ఇది తగ్గిపోయింది. ఫిట్‌నెస్ అనేది కేవలం ఒక మాటగా మిగిలిపోకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించేందుకు విప్లవంలా సాగాలి'అని మోదీ వ్యాఖ్యానించారు. 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్'ను నిరంతరాయంగా కొనసాగించేందుకు కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో 28 మంది సభ్యుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

### 86వేల కోట్ల ఏడీబీ రుణం

భారత్‌కు సుమారు రూ.86 వేల కోట్ల రుణం అందించేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) అంగీకారం తెలిపింది. వచ్చే మూడేళ్లలో పైపుల ద్వారా అందరికీ నీటి సరఫరా, రహదారి భద్రతకు సంబంధించి చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ఈ నిధులను ప్రభుత్వం వినియోగించనుంది. ఏడీబీ ప్రెసిడెంట్ టకెహికో నకావో గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా మార్పు చెందేందుకు తమ సాయం దోహదపడుతుందని నకావో అన్నారు.

## ఇంజనీరింగ్ 75,000 | లా పట్టా 2,00,000

- నకిలీ సర్టిఫికెట్ల దందా గుట్టురట్టు
- విచారణకు ఆదేశించిన మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ



**ముంబై:** కాలేజీకి వెళ్లే అవసరం లేదు..పరీక్షలు రాయాల్సిన పని అంతకన్నా లేదు.. రూ.75వేలు పెడితే ఇంజనీరింగ్ డిగ్రీ, రూ.2 లక్షలు మనవి కావనుకుంటే లా డిగ్రీ చేతికి అందుతుంది. ఒక్క 45 రోజులు ఓపిక పడితే ఏకంగా ఒరిజినల్ సర్టిఫికెట్లు చేతికి వచ్చేస్తాయి. న్యూస్18 రహస్య ఆపరేషన్‌లో ఈ చీకటి దందా వెలుగు చూసింది. 2016లో పూర్తి చేసినట్లుగా బీఏ డిగ్రీ పట్టా ఇచ్చేందుకు న్యూస్18 మీడియా వ్యక్తులతో నవీ ముంబైలోని కోపర్‌ఖైరానీ ప్రాంతానికి చెందిన కీ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీకి చెందిన ఏజెంట్ స్వప్నిల్ గైక్వాడ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ డిగ్రీని యూజీసీ, ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ప్రముఖ వర్సిటీలు యశ్వంత్‌రావ్ చవాన్ యూనివర్సిటీ నుంచి గానీ సోలాపూర్ యూనివర్సిటీ నుంచి గానీ ఇస్తానన్నాడు. ఇందుకు 45 రోజుల సమయం పడుతుందని, 30 రోజుల తర్వాత డిగ్రీపట్టా జిరాక్స్ ప్రతులు, మరో 15 రోజుల తర్వాత ఒరిజినల్ పత్రాలను అందజేసేందుకు అంగీకరించాడు. 'వర్సిటీకి గానీ, క్లాసులకు గానీ వెళ్లాల్సిన అవసరం లేదు. 2016లో డిగ్రీ పూర్తి చేసినట్లుగానే సంబంధిత పత్రాల్లో ఉంటుంది. వర్సిటీ రికార్డుల్లో కూడా ఇవి జత పరిచి ఉంటాయి. ఇవి ఎక్కడా తనిఖీల్లో పట్టుబడేందుకు అవకాశం లేదు' అని అతడు భరోసా ఇచ్చాడు. ఇంజనీరింగ్, ఎల్ఎల్‌బీతోపాటు వివిధ వర్సిటీల్లో పీహెచ్‌డీ చేసినట్లుగా కూడా సర్టిఫికెట్లు ఇస్తాం కానీ, ఫీజులు వేర్వేరుగా ఉంటాయన్నాడు. మూడేళ్ల ఇంజనీరింగ్ పట్టాకైతే రూ.75 వేలు, ఇందులో సగం ముందుగా, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చాక మిగతా సొమ్ము ఇవ్వాల్సి ఉంటుంది. పీహెచ్‌డీ డిగ్రీలైతే ఆంధ్రా వర్సిటీ నుంచి ఇస్తామని చెప్పాడు. థీసిస్, సినాప్సిస్ కూడా అందజేస్తానన్నాడు. యూపీలోని ఓ వర్సిటీ నుంచి పొందినట్లుగా ఉండే లా డిగ్రీకి రూ.2 లక్షలు ఖర్చవుతుందని గైక్వాడ్ చెప్పాడు. వర్సిటీల సంఖ్య పెరగడంతో తమ మార్కెట్ కూడా పెరిగిందని గైక్వాడ్ అన్నాడు. ప్రతి వర్సిటీకి టార్గెట్లున్నాయి. వాటి లక్ష్యం నెరవేరేందుకు మాలాంటి వారిని అవి ఆశ్రయిస్తున్నాయి. వర్సిటీలకు అడ్మిషన్లు కావాలి, మాకేమో డబ్బులు కావాలి' అని తెలిపాడు. ఈ అంశంపై ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి పోఖ్రియాల్ ప్రకటించారు.

# కశ్మీర్‌పై మీ ఏడుపు ఆపండి

- ఆర్టికల్ 370 రద్దు భారతదేశ అంతర్గత విషయం
- పాకిస్తాన్‌కు స్పష్టం చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**లేహ్:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగించడం పూర్తిగా భారతదేశ అంతర్గత విషయమని, ఈ విషయంలో పాకిస్తాన్‌కు సంబంధం లేదని, కశ్మీర్‌పై ఆ దేశం ఏడుపు ఆపాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాకిస్తాన్‌కు సూచించారు. కశ్మీర్ అంశంపై పాకిస్తాన్‌కు ఒక విధానమంటూ లేదని, ఆ విషయంలో ఆ దేశం చేస్తున్న యాగీకి అంతర్జాతీయంగా ఏ దేశమూ మద్దతు ప్రకటించలేదని రక్షణ మంత్రి చెప్పారు. 'నేను పాకిస్తాన్‌ను ప్రశ్నిస్తున్నా.. మీకేం సంబంధం ఉందని కశ్మీర్ విషయంలో రోదిస్తున్నారు? నిజానికి పాకిస్తాన్ ఇండియా నుంచి విడిపోయిన ప్రాంతమే. మీకు నిజంగా ఆసక్తి ఉంటే, గిల్గిత్, బలూచిస్తాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలపై, అక్కడ మైనారిటీలపై జరుగుతున్న దాడులపై రోదించండి'అని పాకిస్తాన్‌ని తీవ్రంగా విమర్శించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై అంతర్జాతీయంగా మద్దతు సంపాదించాలని పాకిస్తాన్ చేసిన కుటిల ప్రయత్నాలను ఏ దేశమూ సమర్థించలేదని ఆయన అన్నారు. గురువారం ఇక్కడ డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన 'కిసాన్-జవాన్ విజ్ఞాన్ మేళా'సదస్సులో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్న పొరుగు దేశంతో చర్చలు అసాధ్యమని ఆయన చెప్పారు. భారత్ పాకిస్తాన్‌తో సత్సంబంధాలనే కోరుకుంటోంది. అయితే పాకిస్తాన్ మొదట ఉగ్రవాదులను భారత్‌లోకి చొప్పించడం మానుకోవాలి. కశ్మీర్‌పై మాట్లాడేముందు వారు పీవోకే, బలూచిస్తాన్‌పై మాట్లాడాలి అని రాజ్‌నాథ్ అన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్, బలూచిస్తాన్ భారత దేశంలో భాగమేనంటూ 1994లో భారత పార్లమెంట్‌లో చేసిన తీర్మానాన్ని ప్రస్తావించారు.



డీఆర్‌డీవో మేళాలో పాల్గొన్న రాజ్‌నాథ్

# సేఫ్‌లో టోక్యో టాప్



- ముంబైకి 45వ ర్యాంకు
- ఢిల్లీకి 52వ ర్యాంక్
- సురక్షిత నగరాల జాబితాను విడుదల చేసిన ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోని సురక్షితమైన నగరాలు-2019 జాబితాలో ఆసియా-పసిఫిక్ ప్రాంతం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టాప్-10లో ఆరు ర్యాంకులను ఈ ప్రాంతంలోని నగరాలే చేజిక్కించుకున్నాయి. జపాన్ రాజధాని టోక్యో తన మొదటి స్థానాన్ని మూడోసారీ పదిలం చేసుకోగా.. సింగపూర్, ఒసాకాలు సైతం తమ పూర్వపు ర్యాంకులను దక్కించుకున్నాయి. అయితే ఈసారి అగ్రరాజ్యం అమెరికా ఆశ్చర్యాన్ని కలిగిస్తూ.. తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చింది. 2017లో 23 స్థానంతో సరిపెట్టుకున్న అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ ఈసారి 7వ ర్యాంకును సాధించుకుంది. ముంబై 45వ స్థానంలో.. ఢిల్లీ 52వ స్థానంలో నిలిచాయి. ప్రపంచంలోని సురక్షితమైన నగరాల జాబితా-2019కి సంబంధించిన నివేదికను ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ గురువారం విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా 5 ఖండాలకు చెందిన నగరాల్లోని పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని టాప్-60 సిటీలతో ఈ నివేదికను ప్రచురించింది. దీనిలో భాగంగా ఆయా నగరాల్లోని సైబర్ భద్రత, వైద్య సదుపాయాలు, వ్యక్తిగత భద్రత, మౌలిక వసతులు వంటి అంశాల మేరకు ర్యాంకులను ప్రకటించింది. దీని ప్రకారం.. నిరసనకారుల ఆందోళనలతో అట్టుడికిపోతున్న హాంకాంగ్ 2017లోని తన 9వ ర్యాంకుని కోల్పోయి.. 20వ స్థానానికి పడిపోయింది. ఇక ఆసియా-పసిఫిక్ ప్రాంతం డిజిటల్ సెక్యూరిటీలో చాలా మెరుగవ్వాల్సి ఉందని చెప్పారు. ఆసియా నుంచి ఢాకా(బంగ్లాదేశ్), కరాచీ(పాకిస్తాన్), యంగూన్(మయన్మార్)లు వరుసగా 56, 57, 58 ర్యాంకుల్లో ఉన్నాయి.

**తొలి పది సురక్షిత నగరాలివే**

| | | |
|---|---|---|
| 1 | టోక్యో | జపాన్ |
| 2 | సింగపూర్ | సింగపూర్ |
| 3 | ఒసాకా | జపాన్ |
| 4 | ఆమ్‌స్టర్‌డ్యామ్ | నెదర్లాండ్స్ |
| 5 | సిడ్నీ | ఆస్ట్రేలియా |
| 6 | టొరంటో | కెనడా |
| 7 | వాషింగ్టన్ | అమెరికా |
| 8 | కోపెన్‌హ్యాగన్ | డెన్మార్క్ |
| 9 | సియోల్ | దక్షిణ కొరియా |
| 10 | మెల్‌బోర్న్ | ఆస్ట్రేలియా |

### బీజేపీ @ 18 కోట్లు



**న్యూఢిల్లీ:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సభ్యత్వం 7 కోట్లు పెరిగి, మొత్తం సభ్యుల సంఖ్య 18 కోట్లకు చేరనుంది. గురువారం ఢిల్లీలో బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఈ వివరాలు వెల్లడించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని, 7 కోట్ల మంది వివరాలు సేకరిస్తున్నామని, అది పూర్తయితే పార్టీ సభ్యుల సంఖ్య 18 కోట్లకు చేరుతుందని వివరించారు. తాజాగా బీజేపీ సిద్ధాంతకర్త శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ ఏడాది జూలై 6న ప్రధాని నరేంద్ర మోదీ, ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలు వారణాసిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వ కార్యక్రమం ఆగస్టు 20వ తేదీన ముగియడంతో సెప్టెంబర్‌లో సంస్థాగత ఎన్నికలు ప్రారంభించనున్నారు.

సాక్షి

శుక్రవారం, ఆగస్టు, 30

# 'ఫిట్ ఇండియా' ఛాలెంజ్!

'విజయానికి ఎలివేటర్లుండవు.. మెట్లు ఎక్కాల్సిందే..', 'శారీరక దారుఢ్యం బాగుంటేనే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తాం.' 'శరీరం ధృఢంగా ఉంటేనే మన మనసూ ధృఢంగా తయారవుతుంది'... ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇలాంటి అమూల్యమైన కొటేషన్లు చాలానే చెప్పారు. అలాగే 'ఫిట్ ఇండియా' పేరుతో ఓ ఉద్యమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. వ్యాయామం చేయడం, శరీరాన్ని ధృఢంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులను దూరంగా ఉంచగలగడంతో పాటు మనం పనిచేస్తున్న రంగంలో అద్భుతంగా రాణించగలుగుతామని ప్రధానమంత్రి చేసిన గంభీర ఉపన్యాసంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలూ లేవు. ఉండాల్సిన అవసరమూ లేదు. అలాగే ఆటపాటలు వదిలేసి పిల్లలు సెల్‌ఫోన్లు పట్టుకుకూర్చుంటున్నారన్న వ్యాఖ్యలూ నిజమైనవే. దీనికి కారకులు కేవలం తల్లిదండ్రులేనా.. కనీసం ఆటస్థలం కూడా లేకుండా పాఠశాలలకు అనుమతులు ఎలా వస్తున్నాయి? పిల్లలను పూర్తిగా యంత్రాల మాదిరిగా మార్చిన విద్యావ్యవస్థలో మేలైన మార్పుల కోసం కసరత్తు ఎందుకు జరగడం లేదు? అలాంటి అనేక మౌలికమైన సమస్యలకు పరిష్కారాలు ప్రకటించకుండా క్రీడా దినోత్సవం రోజున కేవలం తీర్మానాలతో సరిపెట్టడం మాత్రం ఎవరూ ఊహించని పరిణామమే. భారత క్రీడా రంగాన్ని మరో మెట్టు ఎక్కించడానికి ప్రధానమంత్రి నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటిస్తారని, క్రీడాకారులకు అదనంగా ఆర్థిక భరోసా కల్పిస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఫిట్ ఇండియా ఉద్యమానికి పైసా పెట్టుబడి అవసరం లేదని, ప్రయోజనం మాత్రం అనంతమని వ్యాఖ్యానించడం ప్రధాని ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పింది. ఫిట్ ఇండియా ఉద్యమం కోసం ప్రభుత్వం ఏం చేయాలనేదానిపై సలహాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అనేకమంది నిపుణులను నియమించింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్లు, ఫిట్‌నెస్ ప్రమోటర్లతో ప్రత్యేకంగా ఒక కమిటీ కూడా వేసింది. కేంద్ర కీడల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నాయకత్వంలో క్రీడలు, ప్రాథమిక విద్య, ఆయుష్, యూత్ అఫైర్స్ ఇలా వివిధ విభాగాలకు చెందిన 12 మంది ప్రభుత్వ ప్రతినిధులు కూడా ఈ కమిటీలో ఉన్నారు. గత ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాన్నే ప్రచారం చేసింది. 'హమ్ ఫిట్ తో ఇండియా ఫిట్' అంటూ కార్యక్రమాలు నిర్వహించారు. పది బస్కీలు తీయాలంటూ ట్విట్టర్‌లో ప్రముఖ క్రీడాకారుల చేత ప్రచారం చేయించారు.

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినమైన ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకోవడం 2012 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ప్రముఖులంతా ట్వీట్లతోనూ, కామెంట్లతోనూ సామాజిక మాధ్యమాలను హోరెత్తించారు. 134 కోట్ల జనాభా ఉన్న భారతదేశం అంతర్జాతీయ క్రీడా యవనికపై అద్భుతాలు సృష్టించిన సందర్భాలు చాలా అరుదనే విషయం కొత్తదేమీ కాదు. టీమ్ ఈవెంట్లలో గానీ, వ్యక్తిగత ఈవెంట్లలో గానీ ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీలలో భారత్‌పేరు చివర్లో చూసుకోవలసిందే. ఒక్క పతకమొస్తే చాలు అదే పెద్ద విజయమన్నట్లు జాతీయపతాకాన్ని కప్పుకుని వీధుల్లో చిందులేస్తూ సంబరపడిపోతుంటాం. మూడేళ్ల క్రితం జరిగిన రియో ఒలింపిక్స్‌లో రెండంటే రెండు పతకాలతో 67వ స్థానంలో నిలిచాం. 2019 స్పోర్ట్స్ ప్రొవిజనల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 54వ స్థానంలో ఉంది. అనేక చిన్నచిన్న దేశాలు మనకన్నా ఎంతో ముందున్నాయి. కానీ క్రీడాభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలు మాత్రం అంతంతమాత్రమే. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పలు నిర్ణయాలు తీసుకోవడం ఆశించదగిన పరిణామం. దిగువస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తేనే పరిస్థితిలో మార్పు వస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. క్రీడా దినోత్సవం రోజు నుంచి వారోత్సవాలు నిర్వహించాలని, ప్రతి ఏటా ఈ కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన, ప్రతిభ చూపించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచడమే కాక ఈ ప్రోత్సాహకాల పెంపును గత ఐదేళ్ల క్రితం నుంచి వర్తింపజేయాలని నిర్ణయించడం క్రీడాకారులలో హర్షాతిరేకాలు నింపేదే. కేంద్ర స్థాయిలోనూ కనీసం క్రీడాదినోత్సవం సందర్భంగానైనా ఇలాంటి ప్రోత్సాహకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడతాయని క్రీడాలోకం ఎదురుచూసింది.

క్రీడల్లోనే కాదు ఆరోగ్యం విషయంలోనూ మనం అదే చివరి వరుసలో ఉన్నాం. వ్యాయామం పైనా, ఆరోగ్యం పైనా భారతీయులలో స్పృహ అంతంత మాత్రమేనన్న విమర్శలూ సహేతుకమైనవే. ఆరోగ్యం, వ్యాయామంపై చైతన్యపరచడమొక్కటే కాదు.. ప్రభుత్వాల నుంచి తగిన ప్రోత్సాహమూ ఉండాలి. జీవనశైలిలో వస్తున్న మార్పుల కారణంగా అనేక వ్యాధులు మహమ్మారులుగా మారుతున్నాయి. చిన్న వయసులోనే ప్రాణాలను కబళిస్తున్నాయి. భారత్‌లో జీవన శైలిలో మార్పుల కారణంగా వస్తున్న వ్యాధులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా 45 ఏళ్ల వయసులోపే 90శాతం మంది బీపీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. సరైన వ్యాయామం లేకపోవడం వల్ల మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి జబ్బులు చిన్న వయసులోనే వచ్చేస్తున్నాయి. సాధారణంగా 50 నుంచి 60 ఏళ్లలో కనిపించే గుండెపోటు వంటివి ఇపుడు 35 నుంచి 40 ఏళ్ల వయసువారిలోనూ పెరుగుతున్నాయి. ఉపఖండంలో అత్యంత పేద దేశమైన బంగ్లాదేశ్ కన్నా ఆరోగ్యరంగంలో భారత్ వెనకబడిపోవడం విషాదకరం. హెల్త్‌కేర్ ఇండెక్స్‌లో శ్రీలంక 71, బంగ్లాదేశ్ 132, భూటాన్ 134 స్థానాల్లో ఉండగా భారత్ 145వ స్థానంలో ఉంది. పరిస్థితి ఇలానే ఉంటే చిట్టచివరిదైన 195కు చేరుకున్నా ఆశ్చర్యంలేదు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి అమావాస్య సా.4.35 వరకు, తదుపరి భాద్రపద శు.పాడ్యమి నక్షత్రం మఖ సా.6.44 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం ఉ.7.30 నుంచి 8.58 వరకు, తిరిగి రా.2.09, నుంచి 3.39 వరకు, దుర్ముహూర్తం ఉ.8.16 నుంచి 9.05 వరకు, తదుపరి ప.12.24 నుంచి 1.14 వరకు అమృతఘడియలు... సా.4.26 నుంచి 5.56 వరకు.

**సూర్యోదయం :** 5.48
**సూర్యాస్తమయం :** 6.14
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# కొనుగోలు శక్తి పెంపే కీలకం

విశ్లేషణ


సి. రామచంద్రయ్య

**కీలకరంగాల్లో వృద్ధిరేటు వేగంగా పడిపోవడం, బంగారం ధర అనూహ్యంగా పెరిగిపోవడం, రూపాయి విలువ పతనం, నిరుద్యోగిత తారస్థాయికి చేరడం, వస్తుసేవల వినియోగం తగ్గుముఖం పట్టడం, దేశంలో లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోతుండటం.. ఇవన్నీ దేశ ఆర్థిక జవజీవాలు ప్రమాదంలో పడుతున్నాయని సంకేతిస్తున్నాయి. వినియోగదారుల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లడం అనే ఒకే ఒక కారణంవల్లే దేశ స్థూల ఉత్పత్తికి ఊపిరినిచ్చే కీలకరంగాలు ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా బలహీనతకు లోనవుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి ఎంత బలంగా ఉంటే అంతగా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం అన్నది ఏ ప్రభుత్వానికైనా అతిపెద్ద సవాలు. అదే లక్ష్యం కూడా. దీన్ని పక్కనబెట్టి ఆర్థిక మాంద్యానికి అరకొర మందులు ఎన్ని వేసినా ఫలితం శూన్యమే.**

తుపాను ముందు ఏర్పడే ప్రశాంతత మాదిరిగా.. తరుముకొస్తున్న ఆర్థిక సంక్షోభానికి ప్రతీకగా దేశ ఆర్థికరంగం నిస్తేజంగా తయారైంది. ఆర్థికరంగం మందగమనం దుష్ఫలితాలు పలు రంగాలలో అనేక రూపాల్లో కనపడుతున్నాయి. కీలకరంగాల్లో వృద్ధిరేటు వేగంగా పడిపోతున్నది. బంగారం ధర అనూహ్యంగా పెరుగుతున్నది. రూపాయి విలువ పతనం చెందుతున్నది. 4 దశాబ్దాల కనిష్టానికి నిరుద్యోగిత చేరింది. అదేవిధంగా, దేశంలో వస్తుసేవల వినియోగం తగ్గింది. విదేశీ ఎగుమతులు మందగించాయి. మౌలిక సదుపాయాల రంగంలో జరిగే ప్రభుత్వ వ్యయంలో క్షీణత నమోదవుతున్నది. ప్రైవేటు పెట్టుబడులు నిరుత్సాహంగా ఉన్నాయి. నిజానికి, దేశంలో ఇప్పటికే మాంద్యం ఏర్పడిందన్న వాదన కూడా విన్పిస్తున్నది. కొత్త ఉద్యోగాలు లేకపోగా ఉన్న ఉద్యోగాలకే ఎసరొస్తున్న దీనావస్థ అందుకు ప్రధాన సంకేతం. ఇవన్నీ తీవ్రమైన ఆర్థిక మందగమనానికి సాక్ష్యాలు. ఆర్థిక మందగమనానికి, మాంద్యానికి తేడా ఉందని.. ప్రస్తుతం దేశంలో ఏర్పడింది ఆర్థిక మందగమనమే తప్ప.. మాంద్యం కాదన్న వాదన కూడా వినిపిస్తున్నది. దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో వరుసగా రెండు త్రైమాసికాలలో వృద్ధిరేటు క్షీణించినపుడు.. ముఖ్యంగా, దేశంలో లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోతున్నప్పుడు.. దేశ ఆర్థిక వ్యవస్థ పట్ల ఎవరికైనా ఆందోళన కలగడం సహజం. మందగమనమైతే ఆర్థిక రంగం త్వరిత గతిన కోలుకొనే అవకాశం ఉంది. అదే మాంద్యం అయితే.. కోలుకోవడానికి దీర్ఘకాలం పడుతుంది.

భారత ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులకు లోను కావడానికి ప్రధాన కారణం.. వినియోగదారుల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లడమే. ఈ ఒక్క కారణంగానే దేశ స్థూల ఉత్పత్తికి ఊపిరినిచ్చే కీలకరంగాలు ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా బలహీనతకు లోనవుతున్నాయి. దేశంలో వాహనరంగం గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత సంక్షోభంలో ఉంది. వాహన తయారీ కంపెనీలు తమ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించాయి. కొన్ని కంపెనీలైతే తాత్కాలికంగా ప్లాంట్లు మూసివేశాయి. డీలర్ల వద్ద కార్ల నిల్వ పెరిగిపోయింది. కార్ల తయారీ కంపెనీలు కొన్ని వ్యయాలను తగ్గించుకోవడంలో భాగంగా అధిక వేతనాలు అందుకొనే ఉద్యోగులను తొలగించడానికి సిద్ధపడుతున్నాయి. వాహన విక్రయాలు తగ్గడంతో పరికరాల తయారీ పరిశ్రమ పైన ప్రభావం పడుతోంది. ఈ పరిస్థితి మెరుగుపడనట్లయితే.. దాదాపు 3.5 కోట్ల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న దేశీయ ఆటో మొబైల్ రంగంలో ఏకంగా 10 లక్షల మేర ఉద్యోగాల్లో కోత పడే అవకాశం ఉందని 'ఆటోమోటివ్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య (ఏసీఎమ్ఏ)' స్పష్టం చేసింది. స్థిరాస్తి రంగంలోనూ ఇదే పరిస్థితి. చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల ధరల్లో పెరుగుదల లేకపోగా క్రయవిక్రయాల లావాదేవీలు మందగించాయి. 250 అనుబంధ పరిశ్రమలకు మూలాధారంగా ఉన్న నిర్మాణ రంగంలో నెలకొన్న నిస్తేజం కారణంగా అనేక దుష్ఫలితాలు కన్పిస్తున్నాయి. ఇటుకలు, సిమెంట్, ఉక్కు, ఫర్నిచర్, ఎలక్ట్రికల్, తదితర రంగాలు అమ్మకాలు లేక వెలవెలపోతున్నాయి. జీఎస్టీ భారాన్ని తగ్గించాలని, ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలని, రుణ లభ్యత పెంచాలని నిర్మాణ రంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకొంటున్నాయి. ఐదు రూపాయలకు లభించే బిస్కెట్ ప్యాకెట్లు సైతం ఇంతకుముందులా వేగంగా అమ్ముడు కావడం లేదని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయంటే.. ప్రజల కొనుగోలు శక్తి ఏవిధంగా తగ్గిందో అర్థం చేసుకోవచ్చు.



### రూపాయి క్షీణత, పెద్దనోట్ల రద్దు

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో రెండేళ్లుగా ఒడిదుడుకులకు లోనవుతున్న ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు మరింత సంక్షోభంలో కూరుకొనిపోయింది. ముఖ్యంగా.. విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించే మార్గాల్లో ఒకటైన ఎగుమతులు పడకేశాయి. 2013–14లో 31,488 కోట్ల డాలర్ల మేర జరిగిన ఎగుమతులు 2017–18 నాటికి 30,331 కోట్ల డాలర్లకు పడిపోయాయి. అయితే, భారతదేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఎగుమతులపై ఆధారపడకపోవడం కొంత మేలైంది. అయితే, ఆర్థికరంగానికి వెన్నెముకగా నిలిచే ప్రైవేటు పెట్టుబడులను పరిశీలిస్తే 2011 వరకూ సగటున రూ. 25 లక్షల కోట్లుగా నమోదు కాగా, ఆ మొత్తం 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 9.5 లక్షల కోట్లకు పడిపోయింది. దేశంలో పెట్టే మొత్తం పెట్టుబడుల్లో.. దాదాపు 66%గా ఉండే ప్రైవేటు పెట్టుబడులు 2018–19 ఆర్థిక సంవత్సరంలో 47%నికి క్షీణించాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గడిచిన పదేళ్లలో ఏడేళ్లుగా క్షీణిస్తున్నది. రూపాయి క్షీణత వల్ల దేశీయ కార్పొరేట్ సంస్థల్లో విదేశీ మదుపరుల వాటాలు, ప్రభుత్వ బాండ్లలో విదేశీ పెట్టుబడులు పడిపోతున్నాయి. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం వల్ల దిగుమతులకు అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఈ అంశాలు దేశంలో నగదు నిల్వల తగ్గుదలకు కారణం అవుతున్నాయి.

### వేధిస్తున్న నగదు లభ్యత

మొండి బకాయిలు (ఎన్‌పీఏ) కారణంగా బ్యాంకులు రుణాల మంజూరును కఠినతరం చేయడంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలు ఎన్నడూ లేనివిధంగా నగదు కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రజల కొనుగోళ్లు, వినియోగం తగ్గాయి. వివిధ పరిశ్రమల టర్నోవర్‌లో క్షీణత నమోదవుతున్నది. ఫలితంగా.. ప్రభుత్వానికి పన్నులు, ఇతరత్రా రూపేణా సమకూరే ఆదాయం తగ్గింది. దీంతో ఆయా రంగాల్లో ప్రభుత్వ వ్యయం పడిపోయింది. రెండు, మూడేళ్ల ముందు వరకూ ప్రభుత్వ వ్యయంలో వృద్ధి ఏడాదికి సగటున 19% ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది దాదాపుగా 10%కి పరిమితం అయింది. దీంతో దేశ వృద్ధిరేటు ఐదేళ్ల కనిష్ఠస్థాయికి చేరుకొని 6.3% వద్ద నిలబడింది.

### కేంద్రం దిద్దుబాటు చర్యలు

ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం లక్షణాలపై కేంద్రం అప్రమత్తం అయింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు ఉన్నతాధికారులతో సమావేశమై ప్రత్యామ్నాయాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్ని చర్యలు చేపట్టారు. సంపద సృష్టించే వారికి తమ ప్రభుత్వం మద్దతు ఉంటుందని ప్రకటించడం ద్వారా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు చెప్పకనే చెప్పారు. కేంద్రం తీసుకున్న చర్యలను పరిశీలించినట్లయితే.. ద్రవ్య లభ్యత పెంచడానికి బ్యాంకులకు రూ. 70,000 కోట్ల మూలధనాన్ని సమకూరుస్తున్నారు. రెపో రేట్ల కోత బదిలీలకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, జలాన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వానికి 1.76 లక్షల కోట్ల మేర డివిడెండ్, అదనపు నిధులను బదిలీ చేయడానికి ఆర్బీఐ బోర్డ్ ఆమోదముద్ర వేయడం గొప్ప ఊరట. ఈ నిధుల లభ్యతతో ఆర్థిక వృద్ధిరేటును మెరుగుపర్చడం సాధ్యపడుతుంది. ఇదికాక మొత్తంగా రూ. 5 లక్షల కోట్ల నగదు చలామణిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గృహ, వాహన, ఇతర రిటైల్ రుణాలు చౌకగా అందిస్తున్నట్లు ప్రకటించారు. వాహనాల పన్నుల్లో కోత విధించడం, ప్రభుత్వమే భారీగా కార్లు కొనడం తదితర చర్యలు తీసుకుంటున్నారు.

ఏంజెల్ పన్ను వల్ల ఇబ్బందుల పాలవుతున్న స్టార్టప్‌లకు (అంకుర కంపెనీలకు) ఆ పన్నును తొలగించారు. అధిక సంపన్నవర్గాలపై సర్‌చార్జి ఉపసంహరణ, ఎమ్ఎస్ఎమ్ఈలకు 60 రోజుల్లోనే జీఎస్టీ రిఫండ్‌లు మొదలైన పలు రాయితీలను ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ప్యాకేజీలూ (ఉద్దీపనలు) ప్రకటించబోమని స్పష్టం చేసినప్పటికీ.. ఆర్థిక మందగమనం రీత్యా కేంద్రం దిగిరాక తప్పలేదు. కేంద్రం కొన్ని నెలల క్రితమే సమర్పించిన బడ్జెట్‌లోని నిర్ణయాలపై 'యు టర్న్' తీసుకున్నదని కొందరు విమర్శిస్తున్నప్పటికీ.. ఈ చర్యలను సానుకూల దృష్టితోనే చూడాలి. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి కేంద్రం ఏ చర్య తీసుకున్నా స్వాగతించాల్సిందే. ముఖ్యంగా.. నగదు లభ్యత పెరగాలి. పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత గరిష్ఠస్థాయికి చేరగలగాలి. కొత్త ఉద్యోగాల సృష్టి జరగాలి. ఇవన్నీ సాకారం కావాలంటే.. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. తాజాగా, కేంద్రం తీసుకున్న ఉద్దీపన చర్యలు ఆర్థిక మాంద్యం రుగ్మతకు మందుగా పని చేయగలవా? ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టి ఉరుకులు పెట్టించగలవా? ప్రతిపక్షాలు విమర్శించినట్లు ఇవి అరకొర చర్యలేనా? ఈ ప్రశ్నలకు జవాబులు భవిష్యత్తు పరిణామాలే స్పష్టం చేయగలవు.

వ్యాసకర్త మాజీ ఎంపీ,
అధికార ప్రతినిధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### నిబ్బరం



"కశ్మీర్‌లోని యువకులు, వృద్ధుల మనోనిబ్బరం చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. చాలామంది సుమారు నెలరోజులుగా వారి తల్లిదండ్రులతో మాట్లాడలేదు. చాలామంది తమ బంధువుల అంత్యక్రియలకు హాజరుకాలేకపోయి ఉంటారు. మేనకోడళ్లు, మేనల్లుళ్లు పుట్టిన విషయం తెలుసుకోలేకపోయి ఉంటారు. స్నేహితులుగానీ, బంధువులుగానీ గాయపడ్డారా, అరెస్ట్ అయ్యారా అనే సమాచారం కూడా వారికి తెలియదు. ఈ ఆధునిక సమాచార యుగంలో మనుషుల మధ్య సంభాషణలు జరగకపోవడం విషాదం. వాళ్ల స్థయిర్యాన్ని చాలా గౌరవిస్తున్నా"

– అజాద్ ఎస్సా, జర్నలిస్ట్

### మెషీన్స్



"ఓసారి నేను ఎవరితోనో ఫోన్‌లో బాటా గురించి మాట్లాడా. తర్వాత కొన్ని నిమిషాలకే దగ్గరలో ఉన్న బాటా షోరూమ్ వివరాలతో నాకో ఎస్ఎంఎస్ వచ్చింది. ఇది మెషీన్ల యుగం"

– ప్రవీణ్ కస్వాన్, అటవీ అధికారి

### క్లయింట్లు..



"స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం పతనమవుతున్నాయని, చాలా షేర్లు ఇప్పుడు సరైన ధరలో ఉన్నాయనీ, 20శాతం తక్కువకే కొనుగోలు చేయొచ్చని చెబుతాను నేను. అంటే, కొంత కాలం క్రితం అవి 20శాతం ఎక్కువ ధరలో ఉన్నట్టే కదా, ఆ విషయం నువ్వెప్పుడూ మాకు చెప్పలేదంటారు క్లయింట్లు"

– కల్పెన్ పరేఖ్, ఆర్థికరంగ నిపుణుడు

### రిజర్వేషన్లు



"రిజర్వేషన్లను తొలగించాల్సిందే. అయితే, అంతకంటే ముందు ఈ కులపరమైన రిజర్వేషన్లు ఎందుకు ఉన్నాయనేది తెలుసుకోవాలి. తమ రిజర్వేషన్లను వదులుకోవడానికి దళితులు సిద్ధంగా ఉన్నారు. మీరు మొదట మీ కులాన్ని వదులుకోవాలి. మీరు భారత రాజ్యాంగంలోని 15వ అధికరణాన్ని అనుసరించాలి, మనుస్మృతిని కాదు"

– ప్రశాంత్ కనోజియా, జర్నలిస్ట్

### ఫిట్



"ప్రధాని మోదీ ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ చేపట్టినందుకు చాలా సంతోషంగా ఉంది. పిల్లలందరూ ఆటలాడాలి. వాళ్లు ఆడుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఈ రోజు మొదలైన ఫిట్ ఇండియా కార్యక్రమం వల్ల ఒక నాటికి ప్రపంచ వేదికలపై భారత్ అనేక పతకాలు సాధిస్తుందని ఆశిస్తున్నా"

– సాక్షి మాలిక్, క్రీడాకారిణి

### నోర్మూయ్



"అందరూ కలిసి మాట్లాడుకోండి అంటుంది ప్రపంచం. అది ద్వైపాక్షిక సమస్య అంటుంది భారత్. సరే, మాట్లాడుకుందామంటుంది పాకిస్తాన్. వెంటనే అది మా అంతర్గత వ్యవహారం అంటుంది భారత్. అయితే, మమ్మల్ని మాట్లాడనివ్వండి అంటారు కశ్మీరీలు. నోర్మూయ్ అంటుంది భారత్"

– రిచర్డ్ హారిస్, వ్యాఖ్యాత

# పాత్రికేయులు పనికిరారా?

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

పత్రికా స్వేచ్ఛ అపరిమితమైందేమీ కాదు. పాత్రికేయవృత్తి ప్రమాణాలను రక్షించడానికి, మర్యాదలు కాపాడడానికి నీతి నియమావళులు ఉండాలి. పత్రికా స్వేచ్ఛను విచ్చలవిడిగా వాడుకోకూడదన్నట్టే, ప్రభుత్వాధికారులు తమ విపరీతమైన అధికారాలను కూడా విచ్చలవిడిగా వాడుకోకూడదు. మన సంవిధానమే కాదు ప్రజాస్వామ్య సంవిధానమేదైనా పాలకుల విపరీత అధికారాలను కట్టడి చేయడానికే. ప్రభువులకు అధికారాలు మత్తు కలిగిస్తాయి. ప్రజలు పన్నుల రూపంలో ఇచ్చిన కోట్లాది రూపాయలపైన పెత్తనం మొదటి మత్తు. సైనికదళాలమీద అదుపు మరొక మత్తు. జనం మెదళ్ల మీద పెంపుడు మీడియాను ప్రయోగించే బ్లాక్ మెయిల్ పాలన ఇంకొక మత్తు. జాతి భద్రత, సమైక్యత అనే అందమైన జంటపదాల చాటున అధికార దాహంతో కరాళ నృత్యం చేస్తుంటారు. స్వతంత్రమైన మాధ్యమాలు ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించాలి. ఆ స్వతంత్రులు ఈ దుర్మార్గుల దాడులకు బలికాకుండా కాపాడుకోవడానికి ఒక సంస్థను ఏర్పాటు చేశారు. అది ప్రెస్ కౌన్సిల్. ఇది పాత్రికేయుల వృత్తి రక్షణ సంస్థగా పనిచేయాలనే లక్ష్యం నిర్దేశిస్తూ చట్టం చేశారు.

ప్రభుత్వం ఒక్కోసారి అన్ని మాధ్యమాల మీద విరుచుకుపడినప్పుడు ప్రెస్ కౌన్సిల్ ప్రజలకోసం, పత్రికల స్వేచ్ఛ కోసం నిలబడవలసి ఉంటుంది. నీతినియమావళి ద్వారా పాత్రికేయులను కొంతవరకు, మందలింపుల ద్వారా అధికారులను కొంతమేరకు పగ్గాలు వేసి ఆపవచ్చు. అదే ప్రెస్ కౌన్సిల్ బాధ్యత. జమ్మూకశ్మీర్లో వాక్ స్వాతంత్ర్యం పైన ఆగస్టు నెల మొదటి నుంచి ప్రతిబంధకాలు మొదలైనాయి. ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్లు పనిచేయడం లేదు. పత్రికా కార్యాలయాలకు, కలాలకు, నోళ్లకు, మెదళ్లకు కూడా తాళాలు వేశారు. ఎంత మహానాయకుడైనా సరే కశ్మీర్‌లో అడుగుపెట్టాలంటే సుప్రీం కోర్టు అనుమతి తీసుకునే పరిస్థితి ఉంది. ఇదేమి అరాచకం అన్నవాడు పాకిస్తాన్ స్నేహితుడో లేదా ఇమ్రాన్ ఖాన్ అల్లుడో అవుతాడు.

'కనీసం మా పత్రికా కార్యాలయాలనైనా తెరవనివ్వండి. ఏం జరుగుతున్నదో రిపోర్ట్ చేయనీయండి. అక్షరాల వెలుగులపైన ఈ కటిక చీకటి ఆంక్షలు ఇంకెన్నాళ్లో చెప్పండి. కొంచెమన్నా సడలించడానికి వీలుంటుందేమో ఆలోచించి కేంద్ర ప్రభుత్వానికి తగిన రిట్లు జారీ చేయండి' అని ఒక పత్రికా సంపాదకురాలు సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టు ముందున్న అనేకానేక అత్యంత ప్రధానమైన వివాదాల మూటలు విప్పి, ఈ వివాదం వినాలో లేదో నిర్ణయించుకునే సర్వస్వతంత్ర వ్యవస్థ మన న్యాయవ్యవస్థ. తీరిక ఉన్నపుడు ఈ వివాదాన్ని కూడా పరిశీలిస్తుందనే ఆశాభావంతో బతకడం మనమే నేర్చుకోవాలి.

ఇక్కడ ప్రమాదకరమైన కొత్త విచిత్రమేమంటే, ప్రెస్ కౌన్సిల్ సంస్థాగతంగా పాత్రికేయురాలి అభ్యర్థనను వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకోవడం. ప్రెస్ కౌన్సిల్ చట్టం ప్రకారం పత్రికా స్వాతంత్ర్యం పైన పరిమితుల సమంజసత్వాన్ని పరిశీలించి, పునఃసమీక్షించి, అన్యాయమైన పరిమితులను సడలించాలని, న్యాయమైన పరిమితులు పాటించాలి. కానీ ఈ ఆంక్షలను రక్షించడానికే ప్రెస్ కౌన్సిల్ పూనుకోవడం ఆశ్చర్యకరమైన పరిణామం. ఈ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నది స్వయానా ప్రెస్ కౌన్సిల్ అధ్యక్షమహాశయుడైన మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగారే. కనీసం వారు ప్రెస్ కౌన్సిల్‌లో ఈ విషయం చర్చించలేదని, ఎవరినీ సంప్రదించలేదని అంటున్నారు. తనకు తానే ప్రెస్ కౌన్సిల్‌ను హోం మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థగా మార్చి కలాలకు అండగా కాకుండా తుపాకులకు అండగా పత్రికా కార్యాలయాల తాళాలకు అనుకూలంగా భజన తాళం వేయాలనుకోవడం మన వ్యవస్థల పతనానికి తాజా ఉదాహరణ.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన నిపుణుడూ గౌరవనీయమైన పెద్దమనిషే ఈ విధంగా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే, ఇక రాజ్యాంగానికి దిక్కెవరు? కలాలకు మొక్కెవరు? అసలు ప్రెస్ కౌన్సిల్‌కు అధ్యక్షత వహించడానికి జర్నలిస్టులకు అర్హత లేకపోవడమేమిటనే మౌలికమైన ప్రశ్న ఉదయిస్తున్నది. మెడికల్ కౌన్సిల్‌కు డాక్టర్లు, బార్ కౌన్సిల్‌కు లాయర్లు అధ్యక్షులుగా ఉంటారు. కానీ మరొక వృత్తిపరమైన ప్రమాణ రక్షణ సంస్థకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగారు ఎందుకు అధ్యక్షుడుగా ఉండాలి? పాత్రికేయులలో సమర్థులు, పరిపక్వత కలిగినవారులేరా? ఈ ప్రశ్నలు జర్నలిస్టులు వేయకపోవడం బాధాకరమైన దుష్పరిణామం.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్,
కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# దేవుళ్లకు జాతులు, కులాలు ఉండవు!

అభిప్రాయం


సీఎస్ రంగరాజన్

మల్లెపల్లి లక్ష్మయ్యగారి వ్యాసాన్ని బాధతో చదివాను. ఆయన మేధావి. జ్ఞానసంపన్నుడు. కాలానుగుణ మార్పులను సూక్ష్మంగా చూస్తున్నవారు. అలాంటి వ్యక్తి 'దేవుడికీ తప్పని కులవివక్ష' అనే వ్యాసం రాయడాన్ని (సాక్షి 29–08–2019) సున్నితంగా తిరస్కరిస్తున్నాను.

వివిధ ప్రాంతాల్లో ఒక్కొక్క కాలంలో సద్గురు రవిదాస్ మహరాజ్ లాంటి అవతార పురుషులు పుడుతూనే ఉన్నారు. వారిని సమాజం గుర్తించింది. వారి సందేశాలను భక్తితో స్వీకరించాయి.

***సాధువుల జాతి, పుట్టుక అడుగకు, వారి జ్ఞానాన్ని స్వీకరించు. ఒరను పట్టించుకోకు కత్తి పదును చూడు.***

సంత్ రవిదాస్ జయంతి సమావేశాల్లో చాలా సార్లు నేను పాల్గొన్నాను. ఢిల్లీలో సంత్ రవిదాస్ దేవాలయాన్ని కూలగొట్టినప్పుడు ముందుగా స్పందించిన వాణ్ణి నేనే.. సంత్ రవిదాస్ దళితులకే కాదు.. మానవజాతికే గురుతుల్యులు.

2018 ఏప్రిల్ 16 సాయంత్రం 4 గంటలకు ఒక దళిత శ్రీ వైష్ణవ భక్తుడిని నా భుజాలపై కూర్చోబెట్టుకుని జియాగూడ శ్రీరంగనాథ స్వామి ఆలయంలోనికి మేళతాళాలతో భక్త బృందం వెంటరాగా తీసుకువెళ్లాను. భక్తుల గోవింద నామ స్మరణ, తిరుప్పాణాళ్వారు రచించిన 'అమలనాది పిరాన్ పాశురగానం,' అన్నమయ్య రచించిన 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే..' అనే గానాల మధ్య దేవుడిముందు అందరూ సమానమే అని మరోమారు నిజం చేస్తూ, మునివాహన ఉత్సవం బ్రహ్మాండంగా నిర్వహించాం.

భగవద్రామానుజులవారి 1000వ జయంతి సంవత్సరంలో ఈ ఉత్సవం జరగడం విశేషం. వైష్ణవాచార్య గురుపరంపరలో నమ్మాళ్వారు ప్రథమాచార్యులు. నమ్మాళ్వారు శూద్రజాతిలో జన్మించారు. శ్రీవైష్ణవులు పన్నెండుగురు ఆళ్వారులను భక్తితో పూజిస్తారు. పన్నెండు మంది ఆళ్వారులు వివిధ వర్ణాలలో జన్మించి పూజలందుకుంటున్నారు. వీరిలో తిరుప్పాణ్ ఆళ్వార్ దళిత కులానికి చెందినవారు. ఈ పరమ భక్తుడు శ్రీరంగనాథునికి తన జీవితాన్ని అంకితం చేసి శాస్త్రబద్ధ జీవనం చేస్తూ శ్రీరంగంలోని ఆలయం వెలుపలి నుండే రంగనాథుని గుణగానం చేస్తూ ఉండేవారు.

పరమ భక్తుడైన ఈ ఆళ్వారుని, ఆలయ అర్చకులైన శ్రీలోక సారంగముని గుర్తించారు. శ్రీరంగనాథుని ఆజ్ఞానుసారం శ్రీలోకసారంగముని తిరుప్పాణాళ్వారుని కలుసుకుని, ఆ భక్తాగ్రేసరుని తన భుజాలపై కూర్చుండబెట్టుకుని ఆలయ ప్రవేశం చేయించమని తనను స్వామి ఆదేశించారని తెలిపారు. దైవాజ్ఞకు ఎదురు చెప్పలేక ఆళ్వారు అంగీకరించారు. ఈ విధంగా 'మునివాహనునికి' సంతోషకరమైన స్వామి దర్శనం లభించింది.



ఈ సంఘటన దాదాపు 2,700 సంవత్సరాల క్రితం జరిగింది. ఇప్పుడు మన సమాజంలో కులాల మధ్య వివక్ష, అగౌరవం అధికంగా కనిపిస్తున్నాయి. కులాల నడుమ చెలరేగుతున్న అగౌరవం, వివక్షతలు తొలగాలనీ, అందరినీ సమానంగా గౌరవించాలన్న సందేశం ఇచ్చే విధంగా, నేను మునివాహన సేవను నిర్వహించాను. ఒక దళిత భక్తుని తిరుప్పాణాళ్వారు వలె నా భుజాలపై కూర్చుండబెట్టుకుని అమలనాది పిరాన్ పఠిస్తూ ఆలయ ప్రవేశం చేశాను. సమాజంలో ఎస్సీ, ఎస్టీ సోదరుల పట్ల చూపుతున్న దుర్వ్యవహారం ఆపివేసి, ప్రజలకు వారిపట్ల గౌరవభావాన్ని ఇనుమడింప చేయడానికి నేను చేసిన చిన్న ప్రయత్నం ఇది. నేను 2018వ సంవత్సరం జూన్ నెలలో గుంటూరులో, జూలై నెలలో నెల్లూరులో ఈ ఉత్సవాన్ని నిర్వహించాను. నేను చేసిన ప్రయత్నాలు తప్పుగా మా ధర్మశాస్త్రజ్ఞులు పరిగణించలేదు. మనువాదులుగా మీరు నిందించిన వారెవరూ నన్ను దూషించలేదు.

మల్లెపల్లి లక్ష్మయ్యగారు తమ వ్యాసంలో పేర్కొన్న అంశాలు సనాతన ధర్మం కానీ, రామానుజ సాంప్రదాయం కానీ ఎన్నటికీ ఒప్పుకోవు. కొంతమంది చేసే దుశ్చర్యలకు మొత్తం సమాజాన్ని నిందించే పని చేయడం సబబు కాదు. మనమందరం కలిసి మంచి సమసమాజ స్పృహను, చైతన్యాన్ని లోకంలో ఆవిష్కరిద్దాం. లక్ష్మయ్యగారూ.. మీరూ రండి. ఇదే మా ఆహ్వానం.

వ్యాసకర్త చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు | csranga@gmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



కరెక్ట్ నోట్
– సినిమా పేజీలో

ఫాలోవర్

# ఎక్కడిది నీకు?!

విడిపోయాక కూడా భర్త ఎందుకు భార్యను వెంటాడుతుంటాడు! ఎందుకు ఆమెను, ఆమె ఇక్కట్లను, ఆమె బ్యాంక్ అకౌంట్‌లను ఫాలో అవుతుంటాడు? ఎందుకు రోజూ ఫోన్ చేసి వంద ప్రశ్నలు వేస్తుంటాడు? మనిషిగా స్థానం కోల్పోయాక కూడా అతడిలోని భర్త పీఠం దిగిపోడెందుకని?!

● మాధవ్ శింగరాజు

భార్యాభర్తలవి మంచి ఉద్యోగాలు. భర్త నాసా వ్యోమగామి. భార్య యు.ఎస్. ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్. ప్రస్తుతం ఆమె ఉద్యోగం చేయడం లేదు. కొడుకును చూసుకుంటూ ఇంట్లోనే ఉంటోంది. వాడి వయసు ఐదేళ్లు. కడుపున పుట్టినవాడు కాదు. ఆమె అండంతో వేరే స్త్రీ కడుపున పెరిగి పుట్టిన బిడ్డ వాడు.

భర్త ఇప్పుడు ఆమెతో ఉండటం లేదు. ఆమే ఉండనివ్వలేదు! పట్టింపు వచ్చి వేరుగా ఉంటున్నాడు. పట్టింపు వచ్చింది కొడుకు దగ్గర. వాడిని తనకు దత్తత ఇచ్చేయమంటాడు! ‘ఇవ్వలేను’ అంది భార్య. అయినా కొడుకును తండ్రి దత్తత అడగడం ఏమిటి? ఇది అర్థం చేసుకోవడానికి కొంచెం ఓపిక అవసరం. వీళ్ల పెళ్లయ్యేనాటికే ఆ బిడ్డకు ఏడాది వయసు. కాబోయే భార్యకు బిడ్డ ఉన్నాడని తెలిసీ పెళ్లి చేసుకుని భర్త అయ్యాడు అతడు. భర్త అయ్యాడు తప్ప తండ్రి అవలేకపోయాడు. ఆ బాధ అతడిలో ఉండిపోయింది. వాడి తొలి అడుగులు చూశాడు. వాడి తొలి మాటలు విన్నాడు. నాకూ వీడిలో భాగం ఉంటే ఎంత బాగుండేది అనుకునేవాడు ఎత్తుకుని ఆడిస్తూ. ఓరోజు అలాగే ఆడిస్తూ ‘వీడిని నాకు ఇచ్చేయ్’ అన్నాడు. భార్య నవ్వింది. ‘ఇచ్చేయడమేంటి? మన బిడ్డే కదా’ అంది. ‘పెళ్లి చేసుకుంటేనే కదా నువ్వు నా భార్యవయ్యావ్. దత్తత తీసుకుంటేనే వీడు నా బిడ్డ అవుతాడు’ అన్నాడు. భార్య అయోమయంగా చూసింది. ‘నేనివ్వను’ అంది. ‘కడుపు చించుకుని పుట్టకపోయినా, నా కణాలు చీల్చుకుని పుట్టినవాడు వీడు. నేనివ్వను’ అంది.. బిడ్డను భర్త చేతుల్లోంచి లాక్కుని వాడి ఒంటి నిండా ముద్దులు పెడుతూ. భర్త అసూయగా చూశాడు! ‘వాడు నాకు పుట్టకపోవచ్చు, వాడిని నువ్వు నాకు దత్తత ఇవ్వకపోవచ్చు. కానీ పేరెంట్‌గా వాడి మీద నీతో సమానంగా నాకూ హక్కుంటుంది’ అన్నాడు. భార్య మీద భర్తకు, భర్త మీద భార్యకు హక్కు ఉండొచ్చు. భార్యాభర్తల మధ్య మాత్రం హక్కు అనే మాట రాకూడదు. వచ్చిందా ఇక అది ఇద్దరూ వేరవడానికే! భర్త నుంచి భార్య విడిపోయింది. భార్య విడిపోయింది కనుక కొడుకు మీద తండ్రిగా తన సగం హక్కు తనకు ఇప్పించమని కోర్టుకు వెళ్లాడు భర్త. ‘నేను లేకపోతే వాడు ఉండలేడు’ అని కోర్టు హాల్లో బోరుమన్నాడు. ‘వాడు లేకపోతే నేను ఉండలేను’ అని బోరుమనడానికి లోపల ఏదైనా అడ్డుపడి ఉండొచ్చు. ఇప్పుడింకా కేసు కోర్టులోనే ఉంది. ఒక కేసు కాదు. రెండు కేసులు. ఒకటి విడాకుల కేసు. అది అక్టోబర్‌లో తీర్పుకు వస్తోంది. రెండోది.. బిడ్డను ఒకరి తర్వాత ఒకరు మార్చి మార్చి దగ్గర ఉంచుకునే కేసు. దాని తీర్పుపై జడ్జిగారేమీ మాట్లాడలేదు. కొత్తగా ఇప్పుడు ఇంకో కేసు వచ్చి చేరింది! ఆ భర్తపై ఆ భార్య వేసిన కేసు అది. నీకూ నాకు ఏం సంబంధం లేదని ఆమె విడిపోయాక కూడా ఆమె బ్యాంక్ అకౌంట్‌లలోకి అతడు లాగిన్ అవుతున్నాడు. ‘కారు కొన్నట్లున్నావ్? ఎక్కడిది నీకు డబ్బులు?’ అని ఈమధ్య ఫోన్ చేసి అడిగాడు. ఇంకా డబ్బుల విషయాలేవో చాలా అడిగాడు. అప్పుడొచ్చింది ఆమెకు అనుమానం.. భర్త తన బ్యాంక్ అకౌంట్‌లు చూస్తున్నాడేమోనని. గతంలో ఆమె ఇంటెలిజెన్స్ ఆఫీసర్ కాబట్టి తన అకౌంట్ ఎక్కడి నుంచి లాగిన్ అవుతున్నదీ తేలిగ్గానే ఎంక్వయిరీ చేయించింది. నాసా వాళ్ల కంప్యూటర్ నుంచి అవుతోందది! నాసా అంటే ఇంకెవరు? భర్తే. గత ఏడాది డిసెంబర్–ఈ ఏడాది జూన్ మధ్య అతడు అనేకసార్లు ఆమె బ్యాంక్ అకౌంట్‌లు తెరిచి చూశాడు. అయితే ఆ టైమ్‌లో అతడు భూమి మీద లేడు. పైన భూకక్ష్యలో తిరుగుతుండే ‘ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్’లో ఉన్నాడు.. మిగతా వ్యోమగాములతో కలిసి నట్లూ బోల్టులూ బిగిస్తూ. ఉన్నవాడు ఉండకుండా భార్యమీద కూడా ఓ కన్నేసి ఉంచాడు. భార్య వదిలేసి వెళ్లిపోయినా అతడింకా ఆమె చుట్టూనే పరిభ్రమిస్తున్నాడు. ఏం చేస్తోంది? ఎక్కడ ఉంటోంది? ఎవరితో ఉంటోంది? ఏం కొంటోంది? ఏం కట్టుకుంటోంది? ఇవి కావాలి అతడికి. అంత ఎత్తుకు వెళ్లినా కిందే ఉండిపోయాడు! ‘‘కలిసి ఉన్నప్పుడు ఒకే పాస్‌వర్డ్ షేర్ చేసుకున్నాం. విడిపోయాక కూడా తను పాస్‌వర్డ్ మార్చుకోలేదంటే నేను తన అకౌంట్‌లు చూసినా పర్లేదనేగా’’ అని అతడి వాదన! అతడి అకౌంట్ పాస్‌వర్డ్ ఆమె దగ్గరా ఉంది. కానీ అతడిలా ఆమె మళ్లీ లాగిన్ అవలేదు. మనిషిలోంచే లాగవుట్ అయినప్పుడు, మనిషి అకౌంట్‌లోకి ఎందుకు లాగిన్ అవుతుంది? కానీ అతడు అలా ఉండలేకపోయాడు. పూర్వపు భార్యాభర్తలే అయినా అకౌంట్‌లలోకి చొరబడడం నేరం. అతడిని ఏ సెక్షన్ కింద అరెస్టు చేయాలో ఇప్పుడు పోలీసులకు పాలుపోవడం లేదు. నేరం జరిగింది అంతరిక్షంలో! అంతరిక్షంలో జరిగిన తొలి నేరం కూడా ఇదే. అతడు అమెరికన్ కాబట్టి అమెరికా చట్టాల ప్రకారం శిక్ష విధిస్తారేమో మరి. ఒక వేళ అతడి భార్య రష్యన్ అయివుంటే నేరస్థుల అప్పగింత ఒప్పందం ప్రకారం అమెరికా అతడిని రష్యాకు అప్పగించవలసి వచ్చేదేమో.

ఏం చేస్తోంది?
ఎక్కడ ఉంటోంది?
ఎవరితో ఉంటోంది?
ఏం కొంటోంది?
ఏం కట్టుకుంటోంది?
ఇవి కావాలి అతడికి.
కానీ అతడిలా ఆమె మళ్లీ
లాగిన్ అవలేదు.
మనిషిలోంచే లాగవుట్
అయినప్పుడు, మనిషి
అకౌంట్‌లోకి ఎందుకు
లాగిన్ అవుతుంది?



తమిళ చిత్రం ‘కుంబసరమ్ – ది కన్ఫెషన్’లో హనీ రోజ్ (ప్రతీకాత్మక చిత్రం)



భార్యాభర్తలు : సమ్మర్ వోర్డెన్, యాన్ మెక్లెయిన్

**స్త్రీని స్త్రీ వివాహం చేసుకున్నప్పుడు కూడా ఆ దంపతులలో ఒకరికి భర్త లక్షణాలు ఎలా వస్తాయి? బాయ్ కట్, బలిష్టమైన భుజాల కారణంగానా లేక అది వివాహ వ్యవస్థ మహత్యమా?!**

ఇక ఇప్పుడు అసలు విషయం. విదేశీ భార్యాభర్తల పేర్లు భర్తెవరో, భార్యెవరో మనం వెంటనే క్యాచ్ చేయగలిగేలా ఉండవు. ఈ దంపతులలో భార్య పేరు సమ్మర్ వోర్డెన్. భర్త పేరు యాన్ మెక్లెయిన్. ‘సమ్మర్ వోర్డెన్ బ్యాంక్ అకౌంట్‌లను యాన్ మెక్లెయిన్ దొంగతనంగా చూశాడు అంటే.. ‘చూశాడు’ అనే మాటను బట్టి అతడు భర్త అని అర్థం చేసుకోవడమే. అయితే ఈ భార్యభర్తల్ని అలాక్కూడా అర్థం చేసుకునే వీలు లేదు. ఎందుకంటే ఇద్దరూ స్త్రీలే! ఎక్కడో కలుసుకున్నారు. మనసులు ఇచ్చిపుచ్చుకున్నారు. నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. పిల్లవాడి విషయంలో గత ఏడాదే విడిపోయారు. భర్త వయసు నలభై. భార్య వయసు కొంచెం తక్కువ. ఇద్దరూ స్త్రీలే అయినప్పుడు భర్తేమిటి? భార్యేమిటి? నిజమే. భర్త అనకూడదు. భార్య అనకూడదు. జీవిత భాగస్వామి అనాలి. సమ్మర్ వోర్డెన్‌కు పొడవాటి జుట్టు ఉంటుంది. ముఖం కోమలంగా ఉంటుంది. మెక్లెయిన్‌ది బాయ్ కట్. బలమైన బాడీ. వీటిని చూసి వోర్డెన్‌ని భార్య అని, మెక్లెయిన్‌ని భర్త అని ఎవరైనా అంటే అనొచ్చు. చుట్టుపక్కల వాళ్లు అనేస్తున్నారు కూడా. బిడ్డకు చందమామను చూపిస్తూ ఆడించే తల్లి మనసు వోర్డెన్‌లో ఉంది. ‘అదుగో.. ఆ చందమామ మీదకు వెళ్లొచ్చాడ్రా మీ నాన్న..’ అని బిడ్డకు గర్వంగా చెప్పుకుని, వాడి కళ్లల్లో ఆశ్చర్యం చూడాలనుకునే తండ్రి మనసు మెక్లెయిన్‌లో ఉంది. అలా కూడా ఆ ఇద్దరు స్త్రీలు భార్యాభర్తలు కావచ్చు. ఎలాగైనా కావచ్చు కానీ.. విడిపోయాక కూడా సతాయిస్తూ, బిడ్డ ముద్దు మురిపాలలో వాటా కావాలని వేధిస్తూ, నిఘా వేసి నీడలా వెంటాడుతూ, తెలిసినవాళ్లకు తెలియనివాళ్లకూ అలాంటిదనీ ఇలాంటిదనీ చెబుతూ ఉన్నందువల్ల ఇద్దర్లో ఒకరు భర్త స్థానంలోకి వెళ్లిపోవడం అంటే స్త్రీ స్త్రీగా నిలబడలేని బలహీనతలోకి కూలబడటమే. నాసా త్వరలో చంద్రుడి మీదకు తొలిసారిగా ఒక స్త్రీని పంపబోతోంది. ఆ లిస్టులో మెక్లెయిన్ పేరు కూడా ఉంది. పరీక్షల్లో ఆమె నెగ్గితే మెక్లెయిన్ చంద్రుడి మీదకు వెళుతుంది. అప్పుడైనా మెక్లెయిన్‌లోని ‘భర్త’ కిందికి దిగుతాడా?! ●



సోనాల్ : విద్యావారధి

**మనదేశంలో చదువుకొని, మనదేశపు పల్లెప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో ప్రారంభమైన సోనాల్ ప్రయాణం తను ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆమెను ఎక్కడో సుదూర తీరాలకు చేర్చింది. ఇక్కడి వైద్య విద్యాభారం భరించలేక అష్టకష్టాలూ పడి రష్యా వెళ్లి చదువుకొని.. మన దేశ విద్యార్థుల కోసం కిర్గిజ్‌స్థాన్ వైద్యవిద్యా విధానంలోనే మార్పులకు కారణమవడం ద్వారా తన స్వప్నాన్ని సాకారం చేసుకున్న సోనాల్‌తో ఫ్యామిలీ మాటామంతీ...**

# అవరోధాలతో వంతెన

‘‘ఓ మధ్య తరగతి పంజాబీ కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు పేదరికం పెద్దగా తెలియదు. కష్టాలు కన్నీళ్లు తెలియకుండా పెంచారు మా అమ్మానాన్న. నాన్న ఢిల్లీ మదర్ డెయిరీలో మేనేజర్. అమ్మ కారులో షాల్స్ వేసుకొని తనే స్వయంగా కారు నడుపుకుంటూ ఇంటింటికీ తిరిగి అమ్మేవారు. అలా ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాం. అందుకే ఇక్కడ సీటు రాకపోతే రష్యాలో మెడిసిన్ చదివించారు నన్ను. నేను ఢిల్లీలోనే పుట్టినా నేను ప్రేమించి పెళ్లి చేసుకున్న నా భర్త మాత్రం తెలంగాణలోని ఓ పల్లెటూళ్లో పుట్టారు. వాళ్ల నాన్నగారు ఆర్ఎంపీ డాక్టర్. ఆ చిన్న ఊళ్లో ఆయన చేసే వైద్యం కోసం క్యూ కట్టేవారు. ‘అది పెద్ద విషయమేమీ కాదనీ, ప్రసవం కోసం మహిళలను మా ఊళ్లలో మైళ్లదూరం డోలెకట్టుకొని తీసుకెళ్లేవారని’ చెప్పేవారు నా భర్త. ఆయన పేరు ఫణి.

**నరకమెక్కడో లేదు**

ఒక స్త్రీజీవితంలో ప్రసవం దానికదే పునర్జన్మ. కానీ మన దేశంలో ప్రసవం మరణంతో సమంగా మారుతోంది చాలా చోట్ల. నన్నడిగితే నరకం ఎక్కడో లేదు. వైద్యుడు లేని చోటే నరకం అన్నది నా అభిప్రాయం.

ప్రసవం కోసం వాగులూ వంకలూ దాటుకొని గంటల తరబడి ప్రయాణిస్తారని విన్నప్పుడు, చదివినప్పుడూ నిలువెల్లా కదిలిపోయాను. మన దేశంలో వైద్యం సామాన్యులకు అందనంత దూరంలో ఉండిపోతోంది. వైద్య విద్య సంగతి ఇక చెప్పక్కర్లేదు. కోట్ల రూపాయలు పోసి వైద్య విద్యను కొనుక్కునే పరిస్థితి సాధారణ మధ్యతరగతి వారికెలా సాధ్యం? ఇదే పరిస్థితి నన్నైనా, నా సహచరుడినైనా విదేశాలకు వెళ్లి చదువుకునేలా చేసింది.

**అందని వైద్య విద్య**

వైద్యుడు లేని గ్రామం ఉండకూడదన్నది నా ఆలోచన. ఈ దేశంలో వైద్యుల కొరత తీరాలంటే రెండు జరగాలి. ఒకటి మన దేశంలో వైద్య విద్యకయ్యే ఖర్చు ఆకాశాన్నుంచి భూమ్మీదకు దిగిరావాలి. లేదంటే తమ పిల్లలు డాక్టరు కావాలనే తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేరాలంటే మన పిల్లలే ఆ విద్య కోసం ఖర్చు తక్కువగా ఉండే దేశాలకు తరలి వెళ్లాలి. మొదటిది అసాధ్యం అని తేలిపోయింది. ఇక రెండో విషయం పైనే నేనూ, నా భర్త చాలా రోజులు ఆలోచించాం. మనదేశంలో అందని వైద్య విద్యని మన పిల్లలకు అందుబాటులోకి తేవాలనుకున్నాం. సోవియట్ రష్యాలో భాగంగా ఉండి తరువాత విడిపోయిన కిర్గిజ్‌స్థాన్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి (కిర్గిజ్‌స్థాన్ స్టేట్ మెడికల్ అకాడమీ) మొదట కొందరు విద్యార్థులను పంపాం. ప్రస్తుతం కిర్గిజ్‌స్థాన్ ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు మరో ఎనిమిది కాలేజీలకు విద్యార్థులను పంపిస్తున్నాం. మన దేశంలో గ్రామగ్రామాన వైద్యుడు అందుబాటులో ఉండాలన్న మా ఆకాంక్ష యిప్పుడిప్పుడే కొత్తరెక్కలు విచ్చుకుంటోంది. త్వరలోనే మా అత్తగారి ఊళ్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టించే ప్రయత్నంలో ఉన్నాం.

**ఏడేళ్లు... రష్యన్ భాషలో..!**

మేం రష్యాలోని కిర్గిజ్‌స్థాన్‌లో చదువుకున్నప్పుడు మెడిసిన్ ఏడేళ్ల పాటు చదవాల్సి వచ్చేది. అది కూడా రష్యన్ భాషలోనే విద్యాబోధన ఉండేది. అది అర్థం చేసుకోవడానికి మేం పడ్డ కష్టాలు ఆ దేవుడికే ఎరుక. అయినాసరే అక్కడ చదువు మమ్మల్నిద్దర్నీ మేమెంతగానో ప్రేమించే వైద్య వృత్తిలో నిలదొక్కుకునేలా చేయలేకపోయింది. అందుకే అందరికీ అనుకూలంగా ఉండే ఆంగ్లబోధన ఉంటే ఎంత బాగుంటుందని అనుకునేవాళ్లం. క్వాలిటీ ఎడ్యుకేషన్ ఉంటే సరిపోదు. అది ఒంటబట్టించుకునే భాష కూడా ప్రధానమే. కిర్గిజ్‌స్థాన్ విద్యావిధానంలో మార్పుకి మా శాయశక్తులా కృషి చేశాం. ఆ దేశ విద్యావిధానంలో మార్పు జరిగితేనే మన విద్యార్థులకు వైద్యవిద్య సులభమౌతుంది. మొదట రష్యన్ భాషలో విద్యాబోధన మన విద్యార్థులెదుర్కొంటోన్న ప్రథమ అడ్డంకి. దానికి స్వస్తి పలకాలంటే రష్యన్ భాషకి బదులు ఇంగ్లిషులో విద్యాబోధన ఉండాలి. అతికష్టం మీద కిర్గిజ్‌స్థాన్‌లో ఆ మార్పు తీసుకురాగలిగాం. ఏడేళ్ల వైద్య విద్యని మనదేశంలోలా ఐదేళ్లకు తగ్గించేలా చేశాం. ఈ రెండు మార్పులూ మన భారతీయ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారాయి’’ అని ముగించారు సోనాల్.

– అరుణ అత్తలూరి

ఫొటో : రఘుబీర్‌సింగ్

## మూడు రోజులు తిండి లేకుండా!

వైద్య విద్య ఖర్చు తక్కువే అయినా అక్కడి తిండిని తట్టుకోలేక ఇంటిపైన బెంగపెట్టుకునే విద్యార్థులెందరో. అక్కడి ఆహారపుటలవాట్లు వేరు. మన పిల్లలు ఆ తిండి తిని ఎక్కువ రోజులుండడం కష్టతరమైన పనే. రష్యాలోని కిర్గిజ్‌స్థాన్‌లో చదువుకునేప్పుడు నేను మూడు రోజులు తిండి లేకుండా గడిపాను. అప్పటికి అక్కడ మెస్ ఉండేది కాదు. మేమే స్వయంగా వండుకుని తినాల్సి వచ్చేది. నాతో పాటు ఉండేవాళ్లు వెళ్లిపోయారు. నాకు భాష రాదు. ఎక్కడికెళ్లాలో తెలియదు. బయటకెళితే ఏదైనా చేస్తారేమోనని ఇంట్లో చెప్పిన జాగ్రత్తల భయం. గదిలో ఓ మూలన ఆకలితో ముడుచుకు పడుకున్నా. నాకు మిత్రులు వచ్చాక కానీ తిండి దొరకలేదు. అందుకే మన దేశం నుంచి కిర్గిజ్‌స్థాన్ వెళ్లే విద్యార్థులకోసం ప్రత్యేకించి మన ఆహారాన్ని అక్కడే పండించే ఏర్పాటు చేశాం. భూమిని కౌలుకు తీసుకొని మన పంటలు సైతం అక్కడ పండిస్తున్నాం. స్వయంగా తెలంగాణ నుంచి వెళ్లిన మా బంధువులతో ఆంధ్రా హాస్టల్‌నీ, మెస్‌నీ ఏర్పాటు చేశాం. మన సొరకాయలూ, మన వంకాయలూ, మన బీరకాయ పప్పుతో భోంచేసే అదృష్టం మన పిల్లలకి కిర్గిజ్‌స్థాన్‌లో కూడా సాధ్యమేనంటే నమ్మగలరా?



చెట్టు నీడ

## రక్షించు భగవాన్!

అదొక సుందర సువిశాలమైన ఒక పెద్ద మైదానం. ప్రశాంతతకు మారుపేరైన ఆ ప్రదేశంలో, ఒక చెట్టు మీద ఒక పిచ్చుక నివసిస్తూ ఉండేది. కొద్దిరోజుల క్రితమే దానికి కొన్ని పిల్లలు పుట్టాయి. ఆ చిన్నారి పిచ్చుకలకు ఇంకా రెక్కలు రాకపోవడంతో అవి ఎగురలేని స్థితిలో ఉన్నాయి. స్వయంగా తామే ఆహారం సంపాదించుకోలేని పరిస్థితి వాటిది. తల్లే వాటికి ఆహారం సమకూర్చేది. ఇంతలో పరిస్థితి ఉన్నట్లుండి మారిపోయింది. అంతవరకు ప్రశాంతంగా ఉన్న ఆ ప్రదేశంలో యుద్ధానికి తగిన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.



యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఇరుపక్షాల సైన్యాలూ బారులు తీరి నిలబడ్డాయి. దాంతో సైనికుల కోలాహలం, ఏనుగుల ఘీంకారావాలు, గుర్రాల సకిలింపులు, వీరులు తమ కత్తులను సానబట్టే శబ్దం, యుద్ధభేరీల శబ్దం, వీరుల శంఖ నాదాలతో ఆ ప్రాంత మంతా అట్టుడికిపోయింది. దాంతో చెట్టు మీద ఉన్న పిచ్చుక గడగడ వణికిపోయింది. తన పిల్లలను అక్కున చేర్చుకుని దేవుణ్ణి తలచుకుని, ‘‘దేవా! మమ్మల్ని ఈ ఆపద నుండి రక్షించు!’’ అని ప్రార్థించింది. దాని మొరను దేవుడు ఆలకించాడు. వెంటనే ఆయన పిచ్చుక గూడు కట్టుకుని ఉన్న చెట్టు వద్దకు వచ్చాడు. పిచ్చుకను చూసి ఆయన, ‘‘ఓ పిచ్చుకా భయపడకు! ఇక్కడ యుద్ధం జరుగుతున్నప్పటికీ, దానివల్ల నీకూ, నీ పిల్లలకూ ఎటువంటి ఆపదా రాకుండా చూస్తాను!’’ అని అభయమిచ్చాడు. ఆ తరువాత యుద్ధం ప్రారంభమయింది. ఆ యుద్ధం జరిగినంతకాలం పిచ్చుకకు, దాని సంతానానికి ఏ ఆపదా వాటిల్లలేదు

భగవంతుడు మనుషులకే కాదు, పక్షులు, మృగాలు తదితర సకల జీవజాలాన్ని రక్షించి కాపాడుతూ ఉంటాడు. అందుకే దిక్కులేని వారికి దేవుడే దిక్కన్నారు. భగవంతుణ్ణి చిత్తశుద్ధితో ప్రార్థించిన వారి మొరను తప్పక వింటాడు. అనుగ్రహిస్తాడు. మనకు ఉండవలసిందల్లా విశ్వాసమొక్కటే!

– డి.వి.ఆర్.

హెల్త్ టిప్

## బరువు తగ్గించే అలోవెరా

అలోవెరా సౌందర్య సాధనంగానే కాదు, శరీర బరువు తగ్గించటంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే దానికి మరికొన్ని ఇతర పదార్థాలు జతకూడితే మరింత బాగా పని చేస్తుంది. అవేమిటో చూద్దాం.



గ్రీన్ టీలో ఒక స్పూన్ అలోవెరా జ్యూస్ కలపాలి. అవసరమనుకుంటే దీనికి చెంచా తేనె, నిమ్మరసం చేర్చవచ్చు. దీనిని రోజూ పరగడుపున ఒక కప్పు, పడుకోవడానికి గంట ముందు ఒక కప్పు తాగుతుండాలి. ఇతర పదార్థాలేవీ కలపడానికి ఇష్టం లేకపోతే రోజూ గ్లాసు గోరువెచ్చటి నీటిలో రెండుస్పూన్ల అలోవెరా జ్యూస్ కలుపుకుని తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే కొద్దిరోజుల్లోనే శరీరం బరువు తగ్గడం ప్రారంభిస్తుంది.

చొక్కా నిక్కరు

**కేరళ, ఎర్నాకుళం జిల్లాలో వలయాంచిరంగార అనే గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. వందేళ్లు దాటిన ఆ పాఠశాలలో టీచర్లతోపాటు బోధనేతర సిబ్బంది కూడా మహిళలే. ఈ ఆల్ ఉమెన్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు సి.రాజి పిల్లల యూనిఫామ్ విషయంలో ఇప్పటి వరకు కొనసాగిన ఒక సంప్రదాయ విభజన రేఖను చెరిపేశారు. అన్ని స్కూళ్లలాగే ఆ స్కూల్లో కూడా అబ్బాయిలకు షర్టు – నిక్కరు, అమ్మాయిలకు షర్టు– స్కర్టు స్కూల్ యూనిఫామ్‌గా ఉండేది. ప్రిన్సిపల్ నిర్ణయంతో ఇప్పుడు అమ్మాయిలు, అబ్బాయిలు అందరూ ‘షర్టు – నిక్కరు’ వేసుకుంటున్నారు. బాలికలకు ఆడేటప్పుడు సౌకర్యంగా ఉండటం కోసమే ఇలా యూని (డ్రెస్) కోడ్‌ను తెచ్చారు.**

# ఆటకు రెక్కలు



ఒకే యూనిఫామ్‌లో విద్యార్థులు, విద్యార్థినులు

‘‘ఆటల్లో ఒకటో తరగతి పిల్లలు ఉన్నంత చురుగ్గా పెద్ద తరగతుల పిల్లలు ఉండడం లేదు. ఒకటి– రెండు తరగతుల్లో చురుగ్గా ఉన్న పిల్లలు కూడా నాలుగైదు తరగతులకు వచ్చే సరికి ఆటలాడడానికి బిడియపడుతున్నారు. ఉత్సాహంగా ఉండాల్సిన పిల్లలకు కనిపించని సంకెళ్లుగా మారుతున్నది వాళ్ల దుస్తులే. ఆటల్లో పైకెగిరి షటిల్ రాకెట్‌తో కాక్‌ను కొట్టాలన్నా, ఒక్క గెంతులో లాంగ్ జంప్ చేయాలన్నా, హై జంప్ చేయాలన్నా స్కర్టు పైకెగురుతుందేమోనన్న బిడియంతో ఆటలాడడానికి ముందుకు రావడం లేదు. క్రీడాకారులుగా తయారు కాగలిగిన సత్తా ఉన్న పిల్లలను వస్త్రధారణ కారణంగా రెక్కలు విరిచి కూర్చోబెట్టడం ఏమిటి అనిపించింది. కార్పొరేట్ స్కూళ్లలో ఉన్నట్లు రెగ్యులర్ స్కూల్ డ్రస్ ఒకటి, స్పోర్ట్స్ పీరియడ్‌కి మరో రకం డ్రస్ అనే నియమం పెట్టడం మాకు కుదరదు. ఎందుకంటే ప్రభుత్వ పాఠశాలల్లో డ్రస్ చేంజ్ రూములు ఏర్పాటు చేయడం కష్టం. ఇంటి నుంచి స్కూలుకి నడిచి వచ్చే పిల్లలకు తమ వెంట మరో జత దుస్తులు తెచ్చుకోవడం కూడా కష్టమే. అందుకే స్కూల్ డ్రెస్‌ని ఇలా డిజైన్ చేశాం. నిక్కర్‌ని కూడా ముందు ఉన్నట్లు తొడల వరకే కాకుండా, అందరికీ మోకాళ్ల వరకు ఉండేలా నియమం పెట్టాం’’ అన్నారు ప్రధానోపాధ్యాయురాలు రాజీ మేడమ్.



ప్రధానోపాధ్యాయురాలు సి.రాజి

**తల్లిదండ్రులకూ సంతోషమే**

రాజీ మేడమ్ డిజైన్ చేసిన యూనిసెక్స్ యూనిఫామ్ పట్ల అమ్మాయిల తల్లిదండ్రులు కూడా సంతోషంగా ఉన్నారు. బాలికలు మాత్రం... నిక్కర్ జేబులో చేతులు పెట్టుకుంటూ సంతోషపడుతున్నారు. చాక్లెట్ కొనుక్కోవడానికి అమ్మ ఇచ్చిన రూపాయిని జేబులో దాచుకుంటూ, మధ్యలో చూసుకుంటూ మురిసిపోతున్నారు. రాజి మేడమ్ పదేళ్లుగా వలయాంచిరంగార ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతే కాదు, ఆమె చదివింది కూడా అదే స్కూల్లో. ప్రస్తుతం ఆమెతో పని చేస్తున్న అనేక మంది సిబ్బంది ఆమెకు చిన్నప్పటి నుంచి తెలిసిన వాళ్లే. ‘తనకు స్కూల్లో ప్రతి అంగుళం తనకు తెలుసని, గ్రామంలో ప్రతి ఒక్కరితో పరిచయం ఉందని, అందువల్లనే స్కూలు అవసరం ఏమిటో గుర్తించి పరిష్కరించడంలో తనకు అందరి సహకారం ఉంటోందని’ చెప్పారు రాజీ మేడమ్.

– మంజీర

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
30-8-2019

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నాదొక చిన్న ప్రాబ్లమ్. కానీ భరించలేనంత బాధ. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. ఒక చిన్న పాపని 10 ఏళ్లుగా అమ్మలా చూసుకుంటున్నాను. తన వయసు ఇప్పుడు 15 ఏళ్లు. తనంటే నాకు ప్రాణం. తనలో అమ్మని మాత్రమే చూస్తున్నా. మళ్లీ జన్మంటూ ఉంటే తన కొడుకుగా మాత్రమే పుట్టాలని కోరుకుంటాను. నేను అమ్మ అనుకునే తను వన్ ఇయర్‌గా నాతో మాట్లాడటం లేదు. కారణం నేను 'అమ్మా' అని పిలవడమే. చిన్నప్పటి నుంచి అమ్మా అని పిలిస్తే నవ్వుతూ నా దగ్గరకు వచ్చే తను ఇప్పుడు దూరం ఎందుకు అవుతోందో అర్థం కావట్లేదు. ఓ అమ్మాయిలో అమ్మని చూసుకోవడం తప్పా? నాకు అమ్మగా తను కావాలి. మా అమ్మ నాతో మాట్లాడాలంటే నేనేం చెయ్యాలో చెప్పగలరు ప్లీజ్!

– వెంకీ

కొంచెం స్లో అవ్వు స్వామీ!

నీ విషయం అర్థం చేసుకోవడానికి ఈ జన్మ సరిపోదు!

నువ్వు ఎవరి కడుపులో పుడతావో తెలియదు కానీ, నేను మాత్రం మళ్లీ లవ్ డాక్టర్‌గా పుట్టకూడదని నిర్ణయించుకున్నాను.

వాయమ్మో!! ఏం లవ్ ప్రాబ్లమ్ ఇది? ఐ రిజైన్!!

'సార్.. ఏంటి సార్ వెంకీ ప్రాబ్లమ్?'

చిన్నపిల్లను చిన్నప్పటి నుంచీ పెంచి ఆ అమ్మాయిలో అమ్మను చూసుకుంటున్నాడట. ఇప్పుడు అమ్మాయికి వీడిలో కొడుకు కనపడటం లేదట. అమ్మాయి వెంకీ వాలకం చూసి బెదిరి మౌనవ్రతంలో ఉందట. ఇప్పుడు నేను ఆ వ్రత భంగం చేసి ఈ కొడుకుతో మాట్లాడించాలట. ఓరి నాయనో.. ఐ రిజైన్!!

'రిజైన్ చేసే ముందు ఏదైనా సలహా ఇవ్వండి సార్!'

అమ్మాయిలను స్వేచ్ఛగా బతకనివ్వండి.. వాళ్లను గౌరవించండి.. మీ ఎక్స్‌ప్రెషన్స్‌తో వాళ్ల జీవితాలకు సంకెళ్లు వెయ్యకండి. ప్రేమ ఆనందాన్ని కలిగించేలా ఉంచండి. ఉన్మాదంలా మార్చకండి. ప్రేమ స్వేచ్ఛ కలిగించేలా ఉంచండి.. ప్రేమతో సంకెళ్లు వెయ్యకండి. ప్రేమ ఆట వస్తువు కాదు. ఆటవిక ఆనందానికి టూల్‌గా వాడకండి. ప్రేమించండి. ప్రేమను ఇవ్వండి. ప్రేమను కోరుకోకండి. ఇచ్చే ప్రేమలో 'నాకు రిటర్న్‌లో ప్రేమ కావాలి' అనుకోవడం ప్రేమ కాదు, అది ఒక బిజినెస్. ప్రేమించండి. ప్రేమించిన వ్యక్తికి ఒప్పుకునే, తిరస్కరించే స్వేచ్ఛను కలిగించండి.

'బై సార్.. ఆల్ ది బెస్ట్!'

బై ఫ్రెండ్స్, ఇన్నిరోజులూ మీకు సలహాలు ఇచ్చే అవకాశం కలిగించినందుకు థ్యాంక్స్. నా ప్లేట్‌లో అరటిపండు పెట్టి ఇన్నాళ్లు కాపాడుకున్న నీలాంబరికి థ్యాంక్స్. ఆల్ ది బెస్ట్!!

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
దేవుడే దిగి వచ్చినా స్వర్గమే నాకిచ్చినా
షాజహాన్ తిరిగొచ్చినా తాజ్‌మహల్ రాశిచ్చినా
ఇప్పుడి సంతోషం ముందర
చిన్నబోతాయి అన్ని కదరా
లోలోనా మనసంతా సంతోషమే
ఈ ప్రేమ పులకింత సంతోషమే (2)

**చరణం : 1**
వెన్నెల చూడు నన్నిలా
ఎంత హాయిగా ఉంది ఈ దినం
నమ్మవా నన్ను నమ్మవా
చేతికందుతూ ఉంది ఆకాశం
ఇప్పుడే పుట్టినట్టుగా
ఎంత బుజ్జిగా ఉంది భూతలం
ఎప్పుడు ముందరెప్పుడు
చూడలేదిలా దీని వాలకం
ప్రేమొస్తే ఇంతేనేమో పాపం
దాసోహం అంటుందెమో
వంగి వంగి ఈలోకం

**చరణం : 2**
కోయిల నేర్చుకో ఇలా
ఆమె నవ్వులో తేనె సంతాకం
హాయిగా పిల్చుకో ఇలా
చల్లగాలిలో ఆమె పరిమళం.
నీటిపై చందమామలా
నేడు తేలుతూ ఉంది నామది
చీటికి మాటిమాటికి
కొత్త కొత్తగా ఉంది ఏమది
అవునంతా ఉంటుదమ్మా ప్రేమ
అనచాలి అనుకొన్నమా
చేస్తుందమ్మా హంగామా
॥దేవుడే॥

**చిత్రం : సంతోషం (2002)**
**రచన : కులశేఖర్**
**గానం : కె.కె., ఉష**
**సంగీతం : ఆర్.పి.పట్నాయక్**

కట్‌చేయ్...దాచేయ్...



● వరుణ్ తేజ్

# గోదారిలో పాట

గ్యాంగ్‌స్టర్ గోదావరికి వెళ్లి పాటలు పాడుతున్నాడు. వరుణ్‌తేజ్, అథర్వ హీరోలుగా నటిస్తున్న చిత్రం 'వాల్మీకి'. పూజా హెగ్డే, మృణాళిని కథానాయికలుగా నటిస్తున్నారు. గోపీ ఆచంట, రామ్ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గ్యాంగ్‌స్టర్ పాత్రలో వరుణ్ తేజ్ కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ గోదావరి పరిసర ప్రాంతాల్లో జరుగుతోందని తెలిసింది. ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ వహిస్తున్నారు. ''గోదావరి జిల్లాలో కాదు.. అచ్చంగా.. గోదారిలో షూటింగ్ నా ఎన్నో ఏళ్ల కల..'' అని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. తమిళ హిట్ చిత్రం 'జిగర్తాండ'కు 'వాల్మీకి' తెలుగు రీమేక్. ఈ చిత్రాన్ని సెప్టెంబరు 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

# చోళ రాజుల కథలో...

ప్రస్తుతం తమిళంలో అందరి చూపు మణిరత్నం తెరకెక్కించబోయే 'పొన్నియిన్ సెల్వన్' మీదే ఉందని చెప్పొచ్చు. చోళుల కథ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూర్తి రాసిన నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఐశ్వర్యా రాయ్, విక్రమ్, కార్తీ, 'జయం' రవి, నయనతార, అనుష్క, కీర్తీ సురేశ్, అమలా పాల్ వంటి నటీనటులు ఈ సినిమాలో కనిపించబోతున్నారనే వార్తలు కూడా వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో మలయాళ నటుడు జయరామ్ కూడా కనిపిస్తారని తెలిసింది. ఓ ఇంటర్వ్యూలో 'పొన్నియిన్ సెల్వన్' చేస్తున్నట్టు జయరామ్ ప్రకటించారు. తన పాత్ర ఎలా ఉంటుందనే విషయం మాత్రం చెప్పలేదు. జయరామ్ ప్రస్తుతం తెలుగులో 'అల వైకుంఠపురములో' యాక్ట్ చేస్తున్నారు.



● జయరామ్



● రవితేజ

# రాజా వచ్చేది అప్పుడే!

రాజా రెడీ అయ్యాడు. క్రిస్మస్ పండక్కి ఆడియన్స్‌ను ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. రవితేజ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డిస్కో రాజా'. పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్, తాన్యా హోప్ కథానాయికలుగా నటిస్తున్నారు. సాయి రిషిక సమర్పణలో రామ్ తాళ్లూరి, రజిని తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రంలోని రవితేజ ఫస్ట్ లుక్‌ను సోమవారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 20న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''ఆల్రెడీ విడుదల చేసిన ప్రీ-లుక్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. హైదరాబాద్, ఢిల్లీ లొకేషన్స్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ వచ్చే నెల 2న గోవాలో మొదలు కానుంది. టైటిల్‌కు తగ్గట్లుగానే 'డిస్కోరాజా' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు డైలాగ్స్: అబ్బూరి రవి, సంగీతం: తమన్.

# సక్సెస్ బాంబ్ ఎవరిది?



● 'బిగిల్'లో విజయ్



● 'సంగ తమిళన్'లో విజయ్ సేతుపతి




● 'ఖైదీ'లో కార్తీ

ఈ ఏడాది దీపావళికి జోరుగా పేలడానికి మూడు బాంబు ( తమిళ సినిమా)లు రెడీ అవుతున్నాయి. ఫుట్‌బాల్ ప్లేయర్‌గా విజయ్, ఖైదీగా కార్తీ, రాజకీయ నాయకుడిగా విజయ్ సేతుపతి.. ఈ ముగ్గురు హీరోలు దీపావళి బరిలో నిలిచారు. వీరి చిత్రాలతో పాటు పండక్కి ఇంకెన్ని చిత్రాలు వస్తాయో చూడాలి. ప్రస్తుతం ఈ మూడు చిత్రాల వివరాల్లోకి వెళితే...

గత రెండేళ్లుగా దీపావళికి తన సినిమా విడుదలయ్యేలా చూసుకున్నారు విజయ్. 2017లో 'మెర్సెల్' (తెలుగులో 'అదిరింది'), 2018లో 'సర్కార్' చిత్రాలతో దీపావళికి తెరపై సందడి చేశారు. ఈ దీపావళిని కూడా ఆయన మిస్ కావడంలేదు. ప్రస్తుతం నటిస్తున్న 'బిగిల్' సినిమాను దీపావళి విడుదలకు రెడీ చేశారు. విజయ్‌తో ఇది వరకు 'తేరి, మెర్సెల్' వంటి హిట్ సినిమాలను తీసిన అట్లీ ఈ 'బిగిల్' సినిమాకు దర్శకుడు. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. ఫుట్‌బాల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ డ్యూయల్ రోల్ చేస్తున్నట్లు అర్థం అవుతోంది. ఈ సినిమాకు విజయ్ సుమారు 150 రోజులు కాల్షీట్స్ ఇవ్వగా ఆల్రెడీ ఈ సంఖ్య 200 దగ్గరకు చేరుకుంది. దీన్నిబట్టి రాజీ అనేది లేకుండా కాకుండా ఎంత శ్రమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికి 80 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. ఇక ఇటీవలి కాలంలో కోలీవుడ్‌లో మంచి స్టార్ ఇమేజ్ తెచ్చుకోవడంలో సూపర్ సక్సెస్ అయ్యారు విజయ్ సేతుపతి. కేవలం హీరోగానే కాదు వీలు చిక్కినప్పుడల్లా క్యారెక్టర్ ఆర్టిస్ట్ అవతారం కూడా ఎత్తి ఆడియన్స్ మనసు దోచుకునే పాత్రలు చేస్తున్నారు. విజయ్ సేతుపతి నటించిన తాజా చిత్రం 'సంగ తమిళన్'. 'స్కెచ్' ఫేమ్ విజయ్ చందర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో రాశీ ఖన్నా కథానాయికగా నటించారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి రాజకీయ నాయకుడి పాత్రలో నటించారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా కూడా దీపావళికే విడుదల కానుంది. 'బిగిల్'లో విజయ్ రెండు పాత్రలు చేశారనే ప్రచారం జరుగుతున్నట్లుగానే 'సంగ తమిళన్'లో విజయ్ సేతుపతి కూడా డ్యూయల్ రోల్ చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇక దీపావళికి వస్తున్న మరో హీరో కార్తీ. 'ఖైదీ' చిత్రంతో ఆయన పండక్కి తెరపై కనిపించబోతున్నారు. 'మానగరం' సినిమాతో ఆడియన్స్‌ను మెప్పించిన లోకేష్ కనగరాజన్ ఈ సినిమాకు దర్శకుడు. ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనింగ్ చిత్రం ఇది. ఈ సినిమాలో హీరోయిన్ లేకపోవడం విశేషం. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచేశాయి. ఇలా మూడు సినిమాలు ఈ ఏడాది దీపావళికి విడుదల కానున్నాయి. మరి.. మూడు బాంబుల్లో మూడూ దిగ్విజయంగా పేలి, వసూళ్ల సౌండ్ బలంగా వినిపిస్తే ఇండస్ట్రీకి మంచిదే. మరి ఎవరిది సక్సెస్ బాంబ్ అవుతుందో వేచి చూడాలి.



● కీర్తీ సురేశ్

# కరెక్ట్ నోట్

సినిమా సినిమాకు యాక్టర్స్ సరికొత్త విషయాలు నేర్చుకోవాల్సి వస్తూనే ఉంటుంది. తాజాగా 'మరక్కార్: అరబికడలింటే సింహం' సినిమా కోసం వీణ వాయించడం నేర్చుకున్నారు కీర్తీ సురేశ్. మోహన్‌లాల్ ముఖ్యపాత్రలో ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కింది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాలో కీర్తీ అతిథి పాత్రలో నటించారు. కీర్తీ పాత్ర గురించి దర్శకుడు ప్రియదర్శన్ మాట్లాడుతూ– ''మరక్కార్' సినిమాలో క్లాసికల్ సంగీతం నేర్చుకున్న విద్వాంసురాలిగా కీర్తీ కనిపిస్తారు. ఆమె పాత్రే కథలో ఓ మలుపు తీసుకొస్తుంది. మరక్కార్ ఫ్రెండ్ చినాలి అనే వ్యక్తితో కీర్తీ ప్రేమలో పడుతుంది. జనరల్‌గా పాత్రని వివరించగానే స్క్రీన్ మీద ఎలా కనిపిస్తాం అనే దానికంటే ఎలాంటి అవుట్ పుట్ తీసుకురావాలా అని కీర్తీ ఆలోచిస్తుంది. ఈ పాత్ర కోసం చాలా కష్టపడి వీణ వాయించడం నేర్చుకుంది. వీణ నేర్చుకోవడం అంత సులభం కాదు. సెట్లో ప్రతీ నోట్ కరెక్ట్‌గా వాయించింది. ఇప్పటికీ ఫస్ట్ సినిమాలో చూపించిన ఉత్సాహాన్నే చూపిస్తోంది'' అని ప్రియదర్శన్ అన్నారు. విశేషం ఏంటంటే కీర్తీ ఫస్ట్ మలయాళం సినిమా 'గీతాంజలి'కి ప్రియదర్శన్ దర్శకుడు, మోహన్‌లాల్ హీరో. 'మరక్కార్' చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది.



● మురళీ శర్మ

# జీవితం భలే మారిపోయింది

''తొలిసారి ప్రభాస్‌తో కలిసి పనిచేశా. అందరూ ఆయన్ని డార్లింగ్ డార్లింగ్ అంటారు. అలా ఎందుకంటారో 'సాహో' సినిమా చేసినప్పుడు తెలిసింది'' అన్నారు మురళీ శర్మ అన్నారు. ప్రభాస్, శ్రద్ధాకపూర్ జంటగా సుజీత్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన 'సాహో' నేడు విడుదలవుతోంది. ఈ చిత్రంలో పోలీస్ పాత్ర చేసిన మురళీ శర్మ చెప్పిన విశేషాలు.

- 'సాహో' తొలిరోజు షూటింగ్ లంచ్‌టైమ్‌లో 'ఇంటి భోజనం నాకు చాలా ఇష్టం' అన్నాను. ఆ తర్వాత 60 రోజుల పాటు ప్రభాస్‌గారి ఇంటి నుంచి నాకు భోజనం వచ్చేది. నాకే కాదు.. పది మందికి సరిపడే పెద్ద క్యారియర్‌లో భోజనం వచ్చేది. గుత్తి వంకాయ కూర ఎంత బాగుంటుందంటే చెప్పడానికి మాటల్లేవ్. నిజంగా ప్రభాస్ మంచి మనిషి.. యూనివర్సల్ డార్లింగ్.
- 'భాగమతి' సినిమా టైమ్‌లో సుజీత్ 'సాహో' కథ చెప్పాడు. తనది మంచి బ్రెయిన్. కథని అద్భుతంగా రాసుకున్నాడు. వంశీ, ప్రమోద్, విక్కీ చాలా ప్యాషనేట్ నిర్మాతలు. ఎప్పుడూ సెట్‌లో ఉండి సినిమా ఎలా వస్తోంది? ఏంటి? అని చూసుకునేవారు. యూవీ క్రియేషన్స్ నాకు హోమ్ బ్యానర్ లాంటిది. 'అభినేత్రి' సినిమాకి మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పా. ఇప్పుడు 'సాహో'కి కూడా. ఓ సినిమాని ఒకేసారి పలు భాషల్లో చేయడం, డబ్బింగ్ చెప్పడం ఓ ప్రయోగం. ఏ భాషలో అయినా భావోద్వేగాలు ఒక్కటే.. భాష మాత్రం వేరు.
- ఏ సక్సెస్‌కి అయినా ప్రిపరేషన్ ముఖ్యం. నా పాత్రకి ముందుగానే నేను ప్రిపేర్ అవుతా. ఇటీవల 'ఎవరు, రణరంగం' చిత్రాల్లోనూ మంచి పాత్రలు చేశా. ప్రతి పాత్రనీ ఎంజాయ్ చేస్తా. తండ్రి పాత్ర చేయడం చాలా సంతోషంగా అనిపిస్తుంది. 'భలే భలే మగాడివోయ్' తర్వాత నా జీవితం మారిపోయింది.
- నేను పుట్టి, పెరిగింది ముంబైలో. మా అమ్మగారు తెలుగువారే. 'అతిథి' చిత్రంలో నాకు చాన్స్ వచ్చింది. బిగినింగ్‌లోనే మహేశ్‌బాబులాంటి సూపర్‌స్టార్‌తో, అంత పెద్ద సినిమాలో మంచి పాత్ర చేస్తాననుకోలేదు. 'మా అబ్బాయి కృష్ణగారి అబ్బాయి సినిమాలో చేస్తున్నాడు' అని మా అమ్మ అందరికీ చెప్పుకున్నారు. తెలుగు, తమిళ్, మరాఠీ, హిందీ భాషలను మేనేజ్ చేసుకుంటున్నాను. ప్రస్తుతం 'అల.. వైకుంఠపురములో', శర్వానంద్‌తో ఓ సినిమా చేస్తున్నా. మారుతిగారితో ఓ చిత్రం చేశా. సందీప్ కిషన్–నాగేశ్వర్‌రెడ్డి గారి సినిమా దాదాపు పూర్తి కావస్తోంది. 'అతిథి' తర్వాత మహేశ్‌బాబుతో 'సరిలేరు నీకెవ్వరు' సినిమా చేశా.

# మీకు మాత్రమే చెప్తా

'పెళ్ళిచూపులు' సినిమాతో విజయ్ దేవరకొండకు మంచిహిట్ ఇచ్చి, హీరోగా నిలబెట్టారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అయితే.. తనను హీరోగా నిలబెట్టిన తరుణ్ భాస్కర్‌ని హీరోని చేశారు విజయ్ దేవరకొండ. తరుణ్ భాస్కర్, అభినవ్ గోమఠం, అనసూయ భరద్వాజ్ లీడ్ రోల్స్‌లో షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. కింగ్ ఆఫ్ ది హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై విజయ్ దేవరకొండ, వర్ధన్ దేవరకొండ నిర్మించిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని గురువారం విడుదల చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. పావని గంగిరెడ్డి, నవీన్ జార్జ్ థామస్, వాణి భోజన్, అవంతిక మిశ్రా, వినయ్ వర్మ ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: మదన్ గుణదేవా, సంగీతం: శివకుమార్, లైన్ ప్రొడ్యూసర్: విజయ్ మట్టపల్లి.



● అభినవ్, తరుణ్ భాస్కర్, నవీన్



● జాన్వీ కపూర్

# ఆకాశమే నీ హద్దు కాకూడదు

అమ్మాయిలు పైలెట్ కాలేరు. అమ్మాయిలు పైలెట్ అవడం ఏంటి? విహంగయానం చేయాలనుకున్న గుంజన్ సక్సేనాతో ఇరుగు పొరుగు అన్న మాటలివి. ఎవరో ఏదో అన్నారని గుంజన్ వెనక్కి తగ్గలేదు. సరి కదా.. పైలెట్ కావాలనే ఆమె ఆశయం రోజు రోజుకి బలపడింది. సంకల్పం బలమైనదైనప్పుడు ఆశయం నెరవేరుతుంది. గుంజన్ పైలెట్ అయ్యారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న తొలి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా చరిత్రలో నిలిచిపోయారు కూడా. ఈ సక్సెస్‌ఫుల్ సక్సేనా జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'గుంజన్ సక్సేనా: కార్గిల్ గాళ్'. గుంజన్ పాత్రలో జాన్వీ కపూర్ నటిస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వంలో కరణ్ జోహార్, అపూర్వా మెహతా, హీరూ జోహార్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పంకజ్ త్రిపాఠి, అంగద్ బేడీ, వినీత్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను గురువారం రిలీజ్ చేశారు. ''ఆకాశమే నీ హద్దు కాకూడదు. దానికి మించిన ఎత్తుకు నువ్వు ఎదగాలి. చాలా గర్వపడుతున్నాను బేటా. అందరు తండ్రులు తమ పిల్లల్ని చూసి గర్వపడేలా చేస్తావని అనుకుంటున్నాను. త్వరలోనే ఈ ప్రపంచం కూడా నీకు చప్పట్లు కొడుతుంది'' అని ఒక్కో పోస్టర్‌కు ఒక్కో అభినందనను తన ట్వీటర్‌లో రాశారు జాన్వీ తండ్రి బోనీ కపూర్. 'ధడక్'తో హీరోయిన్‌గా పరిచయమై, నటిగా మంచి పేరు తెచ్చుకున్న జాన్వీ మలి చిత్రంగా 'గుంజన్ సక్సేనా'ని సెలెక్ట్ చేసుకున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 13న విడుదల కానుంది.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 2 | | 9 | 6 | | 5 |
| 1 | | 4 | | 5 | | 2 | | 7 |
| | 2 | | | 4 | 7 | 9 | | 1 |
| | | 8 | | | | | 7 | |
| | | 3 | | | | 4 | | 2 |
| | 1 | | | | | 5 | | |
| 8 | | 5 | 9 | 2 | | | 6 | |
| 7 | | 1 | | 6 | | 8 | | 9 |
| 2 | | 9 | 8 | | 3 | | | |

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | 6 | 9 | 5 | 2 | 3 | 7 | 8 |
| 5 | 9 | 7 | 1 | 3 | 8 | 2 | 6 | 4 |
| 8 | 2 | 3 | 4 | 6 | 7 | 5 | 9 | 1 |
| 7 | 6 | 9 | 2 | 1 | 4 | 8 | 3 | 5 |
| 4 | 1 | 5 | 6 | 8 | 3 | 7 | 2 | 9 |
| 3 | 8 | 2 | 5 | 7 | 9 | 1 | 4 | 6 |
| 2 | 5 | 1 | 7 | 9 | 6 | 4 | 8 | 3 |
| 6 | 3 | 4 | 8 | 2 | 1 | 9 | 5 | 7 |
| 9 | 7 | 8 | 3 | 4 | 5 | 6 | 1 | 2 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
30-8-2019





రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా రాజీవ్ ఖేల్‌రత్న పురస్కారం అందుకుంటున్న పారా అథ్లెట్ దీపా మాలిక్

# ఆశలకు ఆటగాళ్లు రెక్కలు తొడుగుతున్నారు

## క్రీడాకారులకు ప్రధాని మోదీ అభినందన • జాతీయ క్రీడా పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారుల ప్రదర్శన పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తున్న ఆటగాళ్లను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆయన అభినందించారు. 'త్రివర్ణ పతాకాన్ని ఎంతో ఎత్తుకు తీసుకెళుతున్న అథ్లెట్లను ఈ రోజు అభినందిస్తున్నాను. అది బాక్సింగ్‌లో కానివ్వండి లేదా బ్యాడ్మింటన్, టెన్నిస్, లేదంటే మరే క్రీడాంశంలోనైనా సరే... మన ఆశలకు ఆటగాళ్లు కొత్త రెక్కలు తొడుగుతున్నారు. మన దేశం మరింత విశ్వాసంతో ముందుకు వెళుతోందన్న విషయాన్ని క్రీడల్లో సాధిస్తున్న ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి' అని ప్రధాని వ్యాఖ్యానించారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ 114వ జయంతి సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకొన్నారు. 'ధ్యాన్‌చంద్‌లాంటి గొప్ప వ్యక్తి జన్మించిన రోజు, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అందరికీ నా అభినందనలు. హాకీ స్టిక్‌తో ఆయన ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేశారు. ఆయనకు తల వంచి నమస్కరిస్తున్నాను' అని ప్రధాని అన్నారు. గురువారం 'జాతీయ క్రీడా పురస్కారాలు' అందుకున్న ఆటగాళ్లకు కూడా మోదీ తన అభినందనలు తెలిపారు.

**కన్నుల పండువగా...**

క్రీడా పురస్కారాల ప్రదానం రాష్ట్రపతి భవన్‌లో కన్నులపండువగా జరిగింది. రాజీవ్ ఖేల్‌రత్నతో పాటు అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డులను విజేతలు అందుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ అవార్డులు అందజేశారు. 'ఖేల్‌రత్న'కు ఎంపికైన వారిలో మహిళా పారా అథ్లెట్ దీపా మాలిక్ వీల్‌చైర్‌లో తన అవార్డును స్వీకరించింది. ట్రోఫీ, ప్రశంసాపత్రంతో పాటు రూ.7.5 లక్షల నగదు ప్రోత్సాహకం కూడా ఆమె అందుకుంది. ఈ ఏడాది మొత్తం 19 మంది 'అర్జున'కు ఎంపికయ్యారు. తెలుగు కుర్రాడు, ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత భమిడిపాటి సాయిప్రణీత్ తన 'అర్జున'ను స్వీకరించాడు. ఈ కార్యక్రమానికి అతని తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. అర్జున విజేతకు రూ. 5 లక్షల నగదు ప్రోత్సాహకం లభిస్తుంది. హైదరాబాద్‌కే చెందిన షూటర్, లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన 'స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్'కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ దక్కింది. దీనిని నారంగ్, తన అకాడమీ కోచ్, సహ భాగస్వామి పవన్ సింగ్‌తో కలిసి అందుకున్నాడు. ఇదే విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన 'రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్' తరపున మాంచో ఫెర్రర్ పురస్కారాన్ని స్వీకరించారు.

**బజరంగ్ గైర్హాజరు...**

'రాజీవ్ ఖేల్‌రత్న'కు ఎంపికైన భారత మేటి రెజ్లర్ బజరంగ్ పూనియా తన అవార్డును అందుకోలేకపోయాడు. వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ సన్నాహాల్లో భాగంగా అతను రష్యాలో ఉన్నాడు. వెస్టిండీస్‌లో ఉన్న క్రికెటర్ రవీంద్ర జడేజా కూడా కార్యక్రమానికి హాజరు కాలేదు. అథ్లెట్లు తజీందర్‌పాల్ సింగ్, మొహమ్మద్ అనస్, షూటర్ అంజుమ్ మౌద్గిల్ కూడా గైర్హాజరయ్యారు. వీరందరికి మరో రోజు క్రీడా మంత్రి కిరణ్ రిజిజు చేతుల మీదుగా అవార్డులను అందజేస్తారు.


రెజ్లర్ పూజా ధాండ


క్రికెటర్ పూనమ్ యాదవ్


కబడ్డీ ప్లేయర్ అజయ్ ఠాకూర్


ఆర్‌డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్


షూటర్ గగన్ నారంగ్, పవన్ సింగ్

## అవార్డు విజేతల జాబితా

- **రాజీవ్ ఖేల్‌రత్న:** బజరంగ్ పూనియా (రెజ్లింగ్), దీపా మాలిక్ (పారా అథ్లెటిక్స్)
- **అర్జున:** భమిడిపాటి సాయిప్రణీత్ (బ్యాడ్మింటన్), రవీంద్ర జడేజా, పూనమ్ యాదవ్ (క్రికెట్), మొహమ్మద్ అనస్, తజీందర్‌పాల్ సింగ్, స్వప్న బర్మన్ (అథ్లెటిక్స్), గుర్‌ప్రీత్ సింగ్ సంధు (ఫుట్‌బాల్), సోనియా లాథర్ (బాక్సింగ్), చింగ్లెన్‌సానా సింగ్ (హాకీ), ఎస్.భాస్కరన్ (బాడీ బిల్డింగ్), అజయ్ ఠాకూర్ (కబడ్డీ), అంజుమ్ మౌద్గిల్ (షూటింగ్), ప్రమోద్ భగత్ (పారా బ్యాడ్మింటన్), హర్మీత్ దేశాయ్ (టేబుల్ టెన్నిస్), పూజా ధాండా (రెజ్లింగ్), ఫౌద్ మీర్జా (ఈక్వెస్ట్రియన్), సిమ్రన్ సింగ్ షెర్గిల్ (పోలో), సుందర్ సింగ్ గుర్జర్ (పారా అథ్లెటిక్స్), గౌరవ్ సింగ్ గిల్ (మోటార్ స్పోర్ట్స్).
- **ద్రోణాచార్య (రెగ్యులర్):** మొహిందర్ సింగ్ ధిల్లాన్ (అథ్లెటిక్స్), సందీప్ గుప్తా (టేబుల్ టెన్నిస్), విమల్ కుమార్ (బ్యాడ్మింటన్).
- **ద్రోణాచార్య (లైఫ్‌టైమ్):** సంజయ్ భరద్వాజ్ (క్రికెట్), రామ్‌బీర్ సింగ్ ఖోఖర్ (కబడ్డీ), మెజ్‌బాన్ పటేల్ (హాకీ).
- **ధ్యాన్‌చంద్ (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్):** మనోజ్ కుమార్ (రెజ్లింగ్), లాల్‌రెమ్‌సంగా (ఆర్చరీ), అరూప్ బసక్ (టేబుల్ టెన్నిస్), నితిన్ కీర్తనే (టెన్నిస్), మాన్యుయెల్ ఫ్రెడ్రిక్స్ (హాకీ).
- **రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్:** గగన్ నారంగ్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్ (షూటింగ్), రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (మాంచో ఫెర్రర్, అనంతపురం), గో స్పోర్ట్స్ ఫౌండేషన్.
- **మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీ (క్రీడా ప్రదర్శనలో ఉత్తమ విశ్వవిద్యాలయం):** పంజాబ్ యూనివర్సిటీ (చండీగఢ్).

## సంజీవ్‌కు రజతం

### షూటింగ్‌లో భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్



**రియో డి జనీరో (బ్రెజిల్):** ప్రపంచ కప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు మరో పతకం లభించింది. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సంజీవ్ రాజ్‌పుత్ రజత పతకాన్ని గెల్చుకున్నాడు. దాంతోపాటు భారత్‌కు 2020 టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌ను అందించాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఫైనల్లో సంజీవ్ 462 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. పీటర్ గోర్సా (క్రొయేషియా–462.2 పాయింట్లు) స్వర్ణం, జాంగ్ చాంగ్‌హాంగ్ (చైనా–449.2 పాయింట్లు) కాంస్యం గెలిచారు. ఆఖరి షాట్ వరకు పాయింట్ ఆధిక్యంలో ఉండి పసిడి రేసులో నిలిచిన సంజీవ్ చివరి షాట్‌లో 8.8 పాయింట్ల షాట్ కొట్టి మూల్యం చెల్లించుకున్నాడు. పీటర్ గోర్సా చివరి షాట్‌లో 10 పాయింట్ల షాట్ కొట్టి స్వర్ణాన్ని దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఇలవేనిల్ వలరివాన్ స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు అభిషేక్ వర్మ, సౌరభ్ చౌధరీ ఫైనల్‌కు చేరుకున్నారు.

## రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న రాయుడు

### హెచ్‌సీఏ లీగ్స్‌లో బరిలోకి



**సాక్షి, హైదరాబాద్:** తెలుగుతేజం, భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు మళ్లీ బరిలోకి దిగబోతున్నాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న రాయుడు ఈ సీజన్‌లో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నిర్వహించే పరిమిత ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లు ఆడనున్నాడు. హెచ్‌సీఏ వన్డే, టి20 క్రికెట్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటానని అతను చెప్పాడు. గత రెండేళ్లుగా భారత వన్డే ప్రపంచకప్ జట్టు ప్రణాళికల్లో ఉండి కూడా ప్రపంచకప్ ఆడలేకపోవడంతో రాయుడు ఆకస్మికంగా రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. తాజాగా ఇప్పుడు అతను మనసు మార్చుకొని బ్యాట్ పట్టేందుకు సిద్ధమయ్యాడు.

# భారత్‌కు ఎదురుందా?

*తుది అంకానికి చేరిన కరీబియన్ పర్యటనలో టీమిండియాను అరుదైన 'సిరీస్ క్లీన్‌స్వీప్' అవకాశం ఊరిస్తోంది. ఇప్పటికే టి20లు, వన్డే సిరీస్‌లలో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిన కోహ్లి సేన... తొలి టెస్టులోనూ గెలుపు ఢంకా గట్టిగానే మోగించింది. రెండో టెస్టుకూ అదే ఆత్మవిశ్వాసంతో బరిలో దిగుతోంది. వెస్టిండీస్ మాత్రం సొంతగడ్డపై ఆపసోపాలు పడుతోంది. భారత్ జోరు కంటే తమ ఆటగాళ్ల ప్రదర్శన మరీ తీసికట్టుగా ఉండటం వారిని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియాను నిలువరించాలంటే హోల్డర్ బృందం శక్తికి మించి పోరాడాల్సిందే.*

- నేటి నుంచి వెస్టిండీస్‌తో రెండో టెస్టు
- విజయాల ఊపులో కోహ్లి సేన
- పరువు కోసం ప్రత్యర్థి పోరాటం

**రాత్రి గం.7 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**కింగ్‌స్టన్ (జమైకా):** తొలి టెస్టులో దక్కిన ఘన విజయం ప్రేరణతో వెస్టిండీస్‌తో రెండో టెస్టుకు సిద్ధమవుతోంది కోహ్లి సేన. శుక్రవారం ప్రారంభమయ్యే ఈ టెస్టుకు ఇక్కడి సబీనా పార్క్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. రెండు జట్లు మార్పులతో బరిలో దిగే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలుస్తోంది. పేసర్ షమీని తప్పించి ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ఆడించాలని టీమిండియా భావిస్తోంది. గాయంతో చివరి నిమిషంలో తొలి టెస్టుకు దూరమైన పేసర్ కీమో పాల్... కమిన్స్ స్థానంలో విండీస్ తుది జట్టులోకి వచ్చే వీలుంది. బ్యాట్స్‌మన్ షమారా బ్రూక్స్‌ను పక్కనపెట్టి మహాకాయుడు రకీమ్ కార్న్‌వాల్‌తో అరంగేట్రం చేయించనుంది.

**పంత్‌పై దృష్టి; అశ్విన్‌కు అవకాశం!**

తొలి టెస్టుకు ముందు విపరీతమైన ఒత్తిడిలో ఉన్న వైస్ కెప్టెన్ రహానే... అర్ధసెంచరీ, సెంచరీతో పరుగుల దాహాన్ని తీర్చుకున్నాడు. అయితే, వికెట్ కీపర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ వైఫల్యం స్పష్టంగా కనిపించింది. అవసరమైన సమయంలో అతడు క్రీజులో నిలవలేకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఇప్పుడు అందరి దృష్టి పంత్‌పై పడింది. అశ్విన్‌కు తుది జట్టులో చోటు కూడా ఆసక్తికరంగా మారింది. తొలి టెస్టులో అతడిని ఆడించకపోవడం ఆశ్చర్యపర్చినా ఘన విజయం ముందు అదేమీ చర్చనీయాంశం కాలేదు. అశ్విన్‌కు చోటిస్తే పేసర్ షమీని తప్పించాల్సి ఉంటుంది. ఓపెనర్లలో కేఎల్ రాహుల్ ఫర్వాలేదనిపించాడు. మయాంక్ అగర్వాల్ మంచి స్కోరు చేయాల్సిన అవసరం ఉంది. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ పుజారా వైఫల్యం సైతం అనూహ్యమే. కానీ, తన స్థాయి ఆటగాడికి పుంజుకోవడం పెద్ద పనేం కాదు. కోహ్లి, రహానేకు తోడుగా అతడూ రాణిస్తే జట్టు భారీ స్కోరు అందుకుంటుంది. భారత పేస్ ధాటిని ఎదుర్కొంటూ విండీస్ బ్యాటింగ్ ఆర్డర్ నిలవగలదా? అనేది పెద్ద ప్రశ్న. ఇషాంత్ కాదంటే బుమ్రా ప్రత్యర్థికి సింహస్వప్నాల్లా కనిపిస్తున్నారు. స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా పరుగులు చేస్తూ వికెట్లు తీస్తుండటం టీమిండియాను మరింత బలోపేతం చేసింది.

**బ్యాటింగే విండీస్ బెంగ...**

బౌలింగ్ అంత బలహీనంగా ఏమీ లేకున్నా బ్యాటింగ్‌లో టాపార్డర్ పేలవ ఫామ్ వెస్టిండీస్‌ను దెబ్బతీస్తోంది. ప్రత్యర్థి పేసర్లు ఎంత భీకరంగా ఉన్నా, బ్యాట్స్‌మెన్ నుంచి కనీస ప్రతిఘటన లేకపోవడం జట్టును ఆందోళన పరుస్తోంది. నమ్మదగ్గ బ్యాట్స్‌మన్, ఓపెనర్ బ్రాత్‌వైట్ నిలిస్తేనే ఈ టెస్టులోనైనా వారి పరువు దక్కుతుంది. క్యాంప్‌బెల్‌కు అనుభవం లేదు కాబట్టి బాధ్యతంతా హోప్, చేజ్, హెట్‌మైర్‌లదే. పేసర్ రోచ్ ఒక్కడికే టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీయగల సత్తా ఉంది. గాబ్రియెల్, కీమో పాల్, హోల్డర్ తలో చేయి వేస్తే కోహ్లి సేనను కట్టడి చేయగలదు.



**1** మరొక్క విజయం సాధిస్తే... టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన భారత కెప్టెన్‌గా విరాట్ కోహ్లి రికార్డులకు ఎక్కుతాడు. ప్రస్తుతం 27 విజయాలతో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనితో అతడు సమంగా ఉన్నాడు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** మయాంక్, రాహుల్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహానే, విహారి, పంత్, జడేజా, షమీ/అశ్విన్, ఇషాంత్, బుమ్రా. **వెస్టిండీస్:** బ్రాత్‌వైట్, క్యాంప్‌బెల్, బ్రూక్స్/కార్న్‌వాల్, హోప్, బ్రేవో, చేజ్, హెట్‌మైర్, హోల్డర్ (కెప్టెన్), కీమో పాల్, రోచ్, గాబ్రియెల్.

**పిచ్, వాతావరణం**

పిచ్ పచ్చికతో ఉంది. పేస్‌కు అనుకూలంగా తయారు చేశారు. ఇదే మైదానంలో గతంలో బంగ్లాదేశ్‌పై విండీస్ పేసర్లు చెలరేగారు. 20కి 18 వికెట్లు పడగొట్టి మూడు రోజుల్లోనే టెస్టును ముగించేశారు. వాతావరణం మేఘావృతమై ఉన్నా... వర్షానికి అవకాశం తక్కువే.

## భారత్ 'ఎ' విజయం

### మెరిసిన అక్షర్, శివమ్, చహల్



**తిరువనంతపురం:** దక్షిణాఫ్రికా 'ఎ'తో ఆరంభమైన ఐదు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్‌లో భారత్ 'ఎ' శుభారంభం చేసింది. 69 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా 'ఎ'ను చిత్తు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ షోతో ఆదరగొట్టాడు. మొదట బ్యాటింగ్‌లో (36 బంతుల్లో 60 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగి, అనంతరం కీలక సమయంలో రెండు వికెట్లు తీశాడు. యుజువేంద్ర చహల్ 5 వికెట్లతో రాణించాడు. 47 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత భారత్ 6 వికెట్లు కోల్పోయి 327 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (46), మనీశ్ పాండే (39), ఇషాన్ కిషన్ (37) రాణించారు. శివమ్ దూబే (60 బంతుల్లో 79 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం దక్షిణాఫ్రికా 'ఎ' చహల్ స్పిన్ దెబ్బకు 45 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. రీజా హెన్‌డ్రిక్స్ (108 బంతుల్లో 110; 12 ఫోర్లు, సిక్స్) ఒంటరి పోరాటం వృథా అయింది. రెండో వన్డే ఈ నెల 31న జరగనుంది.

## మళ్లీ ఓడిన తలైవాస్

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ప్రొ కబడ్డీ లీగ్ సీజన్‌లో తమిళ్ తలైవాస్ 'డబుల్ హ్యాట్రిక్' ఓటములను నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 26–35తో బెంగాల్ వారియర్స్ చేతిలో చిత్తయింది. బెంగాల్ రైడర్ ప్రపంజన్ సూపర్ 'టెన్'తో చెలరేగగా... మణీందర్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. తలైవాస్ తరపున అజయ్ ఠాకూర్ 11 పాయింట్లతో 'టాప్' స్కోరర్‌గా నిలిచినా జట్టును ఓటమి నుంచి కాపాడలేకపోయాడు. రాహుల్ చౌదరి ఒక పాయింటుతో నిరాశ పరిచాడు. నేటి మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో తెలుగు టైటాన్స్; పట్నా పైరేట్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

# ధోని లేకుండానే...

- దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన
- భువనేశ్వర్‌కు విశ్రాంతి
- హార్దిక్ పాండ్యా పునరాగమనం




**న్యూఢిల్లీ:** వెటరన్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్‌పై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ప్రపంచ కప్ అనంతరం ధోని రిటైర్ అవుతాడని భావించగా... అతడేమో సైన్యంలో పనిచేసేందుకు మొగ్గుచూపుతూ వెస్టిండీస్ పర్యటన నుంచి స్వచ్ఛందంగా తప్పుకొన్నాడు. ఆ బాధ్యతలూ ముగించుకున్నప్పటికీ.. ముందుగా ప్రకటించిన మేరకు రెండు నెలల విరామం (జూలై 21–సెప్టెంబర్ 21) పూర్తి కాకపోవడంతో సెప్టెంబర్‌లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు సెలక్టర్లు ఎంపిక చేయలేదు. పనిభారం తగ్గించే ఉద్దేశంతో గురువారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో పేసర్ భువనేశ్వర్ కుమార్‌కూ చోటివ్వలేదు. వెస్టిండీస్‌పై టి20 సిరీస్ గెలిచిన జట్టులోని మిగతా సభ్యులందరికీ స్థానం కల్పించారు. కరీబియన్ పర్యటన నుంచి పూర్తి విశ్రాంతినిచ్చిన ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా పునరాగమనం చేయనున్నాడు.

**ధోని అమెరికాలో:** ధోని ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడు. ఖాళీ సమయాన్ని అతడు విహారయాత్రకు కేటాయించినట్లు సమాచారం. ఏకైక వికెట్ కీపర్‌గా పంత్ బాధ్యతలు మోయనున్నాడు.

**దక్షిణాఫ్రికా సిరీస్‌కు భారత టి20 జట్టు:** ధావన్, రోహిత్, కోహ్లి (కెప్టెన్), కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కృనాల్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, రాహుల్ చహర్, దీపక్ చహర్, ఖలీల్ అహ్మద్, నవదీప్ సైనీ.

## అక్షత్ సెంచరీ

### ఇండియా 'గ్రీన్' 308/4

**బెంగళూరు:** హైదరాబాద్ రంజీ క్రికెటర్ అక్షత్ రెడ్డి దులీప్ ట్రోఫీలో శతకంతో కదం తొక్కాడు. బెంగళూరులో ఇండియా 'రెడ్'తో ప్రారంభమైన టెస్టు మ్యాచ్‌లో అతను సెంచరీ (248 బంతుల్లో 146; 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) చేశాడు. ఫలితంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా 'గ్రీన్' 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 308 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. ప్రియమ్ గార్గ్ (30 బ్యాటింగ్), అక్షయ్ వాడ్కర్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన 'గ్రీన్' జట్టుకు ఓపెనర్లు ఫైజ్ ఫజల్ (18), అక్షత్ తొలి వికెట్‌కు 41 పరుగులు జోడించారు. సిద్ధేశ్ లాడ్ (64)తో కలిసి మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో ఈ హైదరాబాద్ రంజీ ఆటగాడు శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరో 7 ఓవర్లలో ఆట ముగుస్తుందనే సమయంలో అక్షయ్ బౌలింగ్‌లో మహిపాల్‌కు క్యాచ్ ఇచ్చి అక్షత్ రెడ్డి వెనుదిరిగాడు.




## క్విటోవాకు చుక్కెదురు




- రెండో రౌండ్‌లో ఓడిన ఆరో సీడ్
- యూఎస్ ఓపెన్ టోర్నీ

**న్యూయార్క్:** ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మరో సంచలనం నమోదైంది. ఈ సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్, ఆరో సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్) రెండో రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. ఆమె 4–6, 4–6తో ప్రపంచ 88వ ర్యాంకర్ పెట్కొవిక్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ యాష్లే బార్టీ, ఐదో సీడ్ స్వితోలీనా, పదో సీడ్ మాడిసన్ కీస్ ముందంజ వేశారు. స్థానిక అక్కాచెల్లెళ్లకు మిశ్రమ ఫలితాలొచ్చాయి. అక్క వీనస్ విలియమ్స్ ఆట ముగియగా, చెల్లి సెరెనా విలియమ్స్ మూడో రౌండ్లోకి ప్రవేశించింది. రెండో సీడ్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా) 6–2, 7–6 (7/2)తో అమెరికాకు చెందిన లారెన్‌పై చెమటోడ్చి నెగ్గింది. ఏడో సీడ్ స్వితోలీనా (ఉక్రెయిన్) ఏడు సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్ అయిన వీనస్‌ను 6–4, 6–4తో ఓడించింది. 2017 రన్నరప్ కీస్ (అమెరికా) 6–4, 6–1తో జు లిన్ (చైనా)పై గెలిచింది. 17 ఏళ్ల టీనేజ్ అమ్మాయి మెక్‌నాలీ అమెరికన్ స్టార్ సెరెనా విలియమ్స్‌తో ఓ ఆటాడుకుంది. తొలిసెట్‌ను గెలిచి తమ దేశానికే చెందిన దిగ్గజానికి ముచ్చెమటలు పట్టించింది. రెండో సెట్‌లో కోలుకున్న అమెరికా నల్లకలువ 5–7, 6–3, 6–1తో మెక్‌నాలీ (అమెరికా)పై గెలిచి ఊపిరి పీల్చుకుంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 6–4, 7–6 (7/3), 6–1తో 56వ ర్యాంకర్ ఇగ్నాసియో (అర్జెంటీనా)పై గెలిచాడు. మూడో సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) 3–6, 6–2, 6–3, 6–4తో జుమ్హుర్ (బోస్నియా)పై నెగ్గాడు.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
శుక్రవారం
30-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| మార్పు | 383 ▼ | 98 ▼ |
| ముగింపు | 37,069 | 10,948 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,979 | ▲ 124 |
| డోజోన్స్ | 26,383 | ▲ 347 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,184 | ▲ 70 |
| డాక్స్ | 11,839 | ▲ 138 |
| షాంఘై | 2,891 | ▼ 3 |
| నికాయ్ | 20,461 | ▼ 18 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.25 | 72.90 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.39 | 89.48 |
| యూరో | ఎస్‌బీఐ | 78.45 | 81.36 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 66.78 | 69.33 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.49 | 49.64 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.02 | 52.79 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.36 | 19.96 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.08 | 20.09 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.43 | 10.69 |

# సింగిల్ 'బ్రాండ్' బాజా..!



## భారత్‌కు విదేశీ దిగ్గజాల క్యూ..

- స్టోర్స్ ఏర్పాటుకు యాపిల్ తదితర దిగ్గజాల ఆసక్తి
- రిటైల్ నిబంధనల సడలింపుతో ఊతం
- ముందుగా ఆన్‌లైన్ సేల్స్.. తర్వాత ఆఫ్‌లైన్ స్టోర్స్







సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఇప్పటిదాకా ప్రతిబంధకంగా ఉన్న పలు నిబంధనలను కేంద్రం సడలించడంతో భారత్‌లో సొంతంగా కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్న విదేశీ దిగ్గజ సంస్థల ప్రణాళికలకు ఊతం లభించినట్లయింది. దీంతో టెక్ దిగ్గజం యాపిల్ సహా పలు సంస్థలు భారత్‌లో సింగిల్ బ్రాండ్ విక్రయాలకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం దేశీ సంస్థల భాగస్వామ్యంతో భారత మార్కెట్లోకి ప్రవేశించిన జారా, హెచ్‌అండ్‌ఎం, గ్యాప్ వంటి సంస్థలు కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు కూడా నిబంధనల సడలింపుతో మార్గం సుగమమైంది. ఒకే బ్రాండ్ ఉత్పత్తులను విక్రయించే పలు సింగిల్ బ్రాండ్ విదేశీ సంస్థలు.. అత్యంత వేగంగా ఎదుగుతున్న భారత మార్కెట్లో ప్రవేశించేందుకు చాన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఇక్కడ సొంతంగా కార్యకలాపాలు సాగించాలంటే కచ్చితంగా ముందు ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేయాలన్న నిబంధన వాటికి అడ్డంకిగా ఉంటోంది. స్టోర్ ఏర్పాటు వ్యయాలు భారీగా ఉంటున్న నేపథ్యంలో అసలు తమ ఉత్పత్తులకు ఎంత డిమాండ్ ఉంటుందో తెలియకుండా ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేయడం సరికాదనే ఉద్దేశంతో అవి వెనుకడుగు వేస్తూ వస్తున్నాయి. ఒకవేళ ముందుకొచ్చినా.. స్థానికంగా ఏదో ఒక సంస్థతో టైఅప్ పెట్టుకోవడం తప్పనిసరవుతోంది. దీంతో పాటు 30 శాతం కొనుగోళ్లు స్థానికంగా జరపాలన్న మరో నిబంధన కూడా విదేశీ సంస్థలకు అడ్డంకిగా ఉంటోంది. ఫలితంగా.. అవి స్థానికంగా ఇతర సంస్థలతో జట్టు కట్టి కార్యకలాపాలు సాగించాల్సి వస్తోంది. తాజాగా తప్పనిసరి ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు, సోర్సింగ్ నిబంధనలను సడలించాలని కేంద్రం బుధవారం నిర్ణయించింది.

### పలు ప్రయోజనాలు..

నిబంధనల సడలింపుతో సింగిల్ బ్రాండ్ రిటైల్ సంస్థలు ముందుగా ఆన్‌లైన్‌లో విక్రయాలు జరపవచ్చు. అయితే, రెండేళ్ల వ్యవధిలో ఆఫ్‌లైన్ స్టోర్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక సోర్సింగ్ విషయానికొస్తే సింగిల్ బ్రాండ్ రిటైలర్లు తొలి అయిదేళ్లలో సగటున 30% స్థానికంగా కొనుగోళ్లు చేస్తే చాలు. ఆ తర్వాత నుంచి ఏటా ఈ నిబంధనను పాటించాల్సి ఉంటుంది. అయితే, ఇందులోనూ రిటైలర్లకు ఇంకొంత వెసులుబాటు లభించనుంది. సదరు బ్రాండ్‌ను విక్రయించే కంపెనీ లేదా ఆ గ్రూప్ కంపెనీలు లేదా థర్డ్ పార్టీ వెండార్లయినా సరే స్థానికంగా జరిపే కొనుగోళ్లు సోర్సింగ్ నిబంధన పరిధిలోకి వస్తాయి. ఉదాహరణకు యాపిల్‌కు వెండార్.. ఫాక్స్‌కాన్ గానీ స్థానికంగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తే.. అది సోర్సింగ్‌పరంగా యాపిల్‌కు కూడా దఖలుపడుతుంది. వాస్తవానికి చిన్న, మధ్య తరహా దేశీ సంస్థలు, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తుల వారి ప్రయోజనాలు కాపాడేందుకు ఈ 30 శాతం నిబంధన పెట్టారు. విదేశీ సింగిల్ బ్రాండ్ సంస్థలు భారత్‌లో కార్యకలాపాలకు దూరంగా ఉండటానికి ఈ సోర్సింగ్ నిబంధన కూడా ఒక కారణమే. స్వీడన్‌కు చెందిన ఫర్నిచర్ దిగ్గజం ఐకియా వంటి సంస్థలు భారత్‌లో చాన్నాళ్లుగా వివిధ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. ఇక్కడ స్టోర్ పెట్టాలంటే కచ్చితంగా 30 శాతం ఇక్కడివే కొనాలన్న నిబంధన కారణంగా చాలా కాలం ముందుకు రాలేదు. తాజాగా నిబంధనల మార్పుతో విదేశీ రిటైలర్లకు మరింత వెసులుబాటు లభించనుంది.

### 'స్మార్ట్‌ఫోన్స్' విస్తరణ..

నిబంధనల సడలింపుతో ఎగుమతులకు కూడా ఉపయోగపడేలా భారత్‌లో తయారీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని చైనా స్మార్ట్‌ఫోన్స్ తయారీ దిగ్గజం వన్‌ప్లస్ ఇండియా జీఎం వికాస్ అగర్వాల్ చెప్పారు. 'ఆఫ్‌లైన్ స్టోర్స్ విస్తరణకు కూడా దీర్ఘకాలిక ప్రణాళిక ఉంది. ఇప్పటికే మా స్థానిక భాగస్వాములతో అన్ని ప్రధాన నగరాల్లో స్టోర్స్ ఏర్పాటు చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, తాజా పరిణామంతో భారత తయారీ రంగంలో మరిన్ని విదేశీ పెట్టుబడులు రాగలవని మరో స్మార్ట్‌ఫోన్ సంస్థ వివో ఇండియా డైరెక్టర్ (బ్రాండ్ స్ట్రాటెజీ విభాగం) నిపుణ్ మార్యా చెప్పారు. యాపిల్, వన్‌ప్లస్, ఒప్పో వంటి దిగ్గజ బ్రాండ్ల సొంత స్టోర్స్ ఏర్పాటుతో దేశీ మొబైల్ హ్యాండ్‌సెట్ రిటైలింగ్ మార్కెట్ అంతర్జాతీయ స్థాయికి ఎదగగలదని పరిశ్రమ సమాఖ్య ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) అభిప్రాయపడింది.

### ఉపాధికి ఊతం..

నిబంధనలను సడలించడం ఉభయతారకంగా ఉంటుందన్నది ప్రభుత్వ అభిప్రాయం. ఆయా సంస్థలు స్వయంగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ఊతం లభిస్తుందని, ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపినా ఉపాధి కల్పనకు తోడ్పాటు లభించగలదని భావిస్తోంది. లాజిస్టిక్స్, డిజిటల్ చెల్లింపులు, కస్టమర్ కేర్, శిక్షణ తదితర విభాగాల్లో ఉద్యోగాల కల్పన జరగగలదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఉదాహరణకు.. 2013లో అమెజాన్ భారత మార్కెట్లోకి వచ్చినప్పట్నుంచి 2,00,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరిగిందని అంచనా. అమెజాన్ సుమారు 5,00,000 మంది విక్రేతలతో కలిసి పనిచేస్తోంది. అమ్మకాలు పెరిగే కొద్దీ ఆయా విక్రేతలు మరింత మంది సిబ్బందిని తీసుకుంటూ ఉండటం వల్ల ఆ రకంగా కూడా ఉపాధికి ఊతం లభిస్తోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



### సన్నాహాల్లో యాపిల్..

- 3 నెలల్లో ఆన్‌లైన్ విక్రయాలు
- ఏడాదిన్నరలో తొలి ఆఫ్‌లైన్ స్టోర్

సింగిల్ బ్రాండ్ రిటైల్ నిబంధనల సడలింపుతో టెక్ దిగ్గజం యాపిల్ తమ తొలి ఆన్‌లైన్ స్టోర్ ప్రారంభించే సన్నాహాల్లో పడింది. వచ్చే 3–5 నెలల్లో ఇది సిద్ధం కావొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉన్న ఆన్‌లైన్ స్టోర్స్ తరహాలోనే ఇది కూడా ఉండనుందని పేర్కొన్నాయి. ఇక వచ్చే 12–18 నెలల్లో ఆఫ్‌లైన్ స్టోర్ సైతం ప్రారంభించాలని యాపిల్ నిర్ణయించుకున్నట్లు వివరించాయి. ప్రస్తుతం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం మాల్ భాగస్వామ్యంతో యాపిల్ ఆన్‌లైన్‌లో భారత్‌లో విక్రయాలు జరుపుతోంది. భారత్‌లో ఐఫోన్ అమ్మకాల్లో 35–40 శాతం వాటా ఈ–కామర్స్‌దే ఉంటోంది. ఐప్యాడ్ ట్యాబ్లెట్స్, మాక్‌బుక్ ల్యాప్‌టాప్స్ అమ్మకాలు కూడా ఆన్‌లైన్‌లో భారీగానే ఉంటున్నాయి. దేశీయంగా మొత్తం ఉత్పత్తుల విక్రయాల్లో ఆన్‌లైన్ అమ్మకాల వాటా 25 శాతం పైగా ఉంటోంది. అందుకే ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని యాపిల్ భావిస్తోంది. 'భారత్‌లో తొలి యాపిల్ రిటైల్ స్టోర్ ఏర్పాటు చేసే రోజు కోసం ఎదురుచూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా కస్టమర్లకు అందిస్తున్న సేవలను భారతీయ కస్టమర్లకు కూడా అందిస్తాం. త్వరలోనే మిగతా ప్రణాళికలను వెల్లడిస్తాం' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం యాపిల్‌కు 25 దేశాల్లో స్టోర్స్ ఉన్నాయి.

# రామ్‌కో సిమెంట్ భారీ విస్తరణ

- రూ.4,000 కోట్ల పెట్టుబడి
- కంపెనీ ఈడీ బాలాజీ మూర్తి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సిమెంటు తయారీ సంస్థ రామ్‌కో సిమెంట్స్ భారీ విస్తరణ చేపట్టింది. ఇందుకోసం రూ.4,000 కోట్లు వ్యయం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో 3.15 మిలియన్ టన్నుల సామర్థ్యంతో సిమెంటు ఉత్పత్తి కేంద్రాన్ని రూ.1,500 కోట్లతో నెలకొల్పుతోంది. ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి లభిస్తుందని రామ్‌కో మార్కెటింగ్ ఈడీ బాలాజీ కె మూర్తి గురువారం వెల్లడించారు. సూపర్‌క్రీట్ సిమెంట్‌ను ఇక్కడి మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మార్కెటింగ్ ప్రెసిడెంట్ ఆర్.రామకృష్ణన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లాలో 1.5 మిలియన్ టన్నుల క్లింకర్ యూనిట్, విశాఖపట్నం జిల్లాలో 1 మిలియన్ టన్నుల గ్రైండింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఒడిశాలోని సిమెంటు తయారీ ప్లాంటులో 1.5 మిలియన్ టన్నులు, కోల్‌కతాలో 1 మిలియన్ టన్నుల సామర్థ్యం జోడిస్తున్నట్టు పేర్కొన్నారు.

**వచ్చే ఏడాది చివరికల్లా..**

కంపెనీ చేపట్టిన అన్ని ప్రాజెక్టులు 2020 డిసెంబరుకల్లా పూర్తి కానున్నాయి. కర్నూలు ప్లాంటు రాకతో ఆంధ్రప్రదేశ్‌లో రామ్‌కో సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం 10 మిలియన్ టన్నులు నమోదు కానుంది. తద్వారా ఏపీలో అత్యధిక ఉత్పత్తి సామర్థ్యమున్న సంస్థగా నిలుస్తుంది. అన్ని తయారీ కేంద్రాలు కలిపి ప్రస్తుతం సంస్థ వార్షిక సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం 12.5 మిలియన్ టన్నులు ఉంది. విస్తరణ పూర్తి అయితే ఇది 20 మిలియన్ టన్నులకు చేరుతుందని బాలాజీ వెల్లడించారు. 2018–19లో కంపెనీ టర్నోవరు రూ.5,146 కోట్లు. 2020–21లో ఇది రూ.7,500 కోట్లను తాకుతుందని ఆయన పేర్కొన్నారు.

**సుస్థిర ప్రభుత్వం ఉంటే..**

'ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాజెక్టులు నిలిచిపోయాయి. మీరేమో విస్తరణ చేపడుతున్నారు. ఫలితం ఎలా ఉండబోతోంది' అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు.. 'ఏ రాష్ట్రంలోనైనా ఒడిదుడుకులు తాత్కాలికం. మళ్లీ మార్కెట్ పుంజుకుంటుందన్న నమ్మకం మాకుంది. సుస్థిర ప్రభుత్వం ఉన్నప్పుడు సిమెంటుకు డిమాండ్ ఉంటుంది. మా పెట్టుబడులు కొనసాగిస్తాం' అని బాలాజీ స్పష్టం చేశారు. మందగమన ప్రభావం సిమెంటు రంగంపై ఉందా అన్న మరో ప్రశ్నకు వ్యక్తిగత గృహాల నిర్మాణాలు అన్ని ప్రాంతాల్లోనూ కొనసాగుతున్నాయని వివరించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టులు సాగుతున్నాయని చెప్పారు. సిమెంటు వినియోగం దేశంలో ఏప్రిల్–జూన్ కాలంలో 7–8 శాతం వృద్ధి నమోదైందన్నారు.




మీడియా సమావేశంలో రామకృష్ణన్, బాలాజీ కె మూర్తి (కుడి)

## వచ్చేస్తోంది కొత్త ఐఫోన్

వచ్చే నెల 10న ఆవిష్కరణ



**శాన్ ఫ్రాన్సిస్కో:** త్వరలో కొత్త ఐఫోన్ వెర్షన్‌ను ప్రవేశపెట్టనుందన్న వార్తలకు ఊతమిస్తూ టెక్ దిగ్గజం యాపిల్ వచ్చే నెల 10న సిలికాన్ వేలీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు అధికారికంగా ఇన్విటేషన్లు పంపింది. సాధారణంగా ఏటా క్రిస్మస్ షాపింగ్ సీజన్‌కు ముందు.. ఇలాంటి కార్యక్రమంలోనే యాపిల్ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తూ వస్తోంది. ఈసారి సెప్టెంబర్ 10న జరిగే కార్యక్రమంలో 'ఐఫోన్ 11' హ్యాండ్‌సెట్స్‌ను కూడా ఆవిష్కరించవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తం మూడు ఐఫోన్ 11 మోడల్స్‌ను ప్రవేశపెట్టవచ్చని తెలుస్తోంది. ఐఫోన్ ఎక్స్‌ఎస్ మ్యాక్స్‌ని అప్‌గ్రేడ్ చేసి ఎక్స్ఎస్, ఎక్స్ఆర్ మోడల్స్‌ను కొత్త రూపంలో ఆవిష్కరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఐఫోన్ ఎక్స్ఎస్ సిరీస్ స్థానంలో వచ్చే కొత్త ఐఫోన్ 11 మోడల్‌లో ట్రిపుల్ రియర్ కెమెరా ఉండవచ్చన్న అంచనాలు ఉన్నాయి.

# డిజిటల్‌లో అగ్రగామిగా భారత్

**రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ**

**గాంధీనగర్:** డిజిటల్ రంగంలో భారత్ త్వరలోనే అగ్రగామిగా ఎదుగుతుందని పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) చైర్మన్ ముకేశ్ అంబానీ ధీమా వ్యక్తం చేశారు. 'డిజిటల్ రంగం ప్రతీ రోజు, ప్రతీ క్షణం కొత్త పుంతలు తొక్కుతున్న దేశం ఏదైనా ఉందంటే.. అది భారత్ మాత్రమేనని ఘంటాపథంగా చెప్పగలను. మొబైల్ డేటా విభాగంలో ప్రపంచ దేశాల జాబితాలో 155వ స్థానంలో ఉండే భారత్ కేవలం 24 నెలల్లోనే నంబర్ వన్ స్థాయికి చేరింది. అలాగే నాలుగో పారిశ్రామిక విప్లవంలో భాగమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో కూడా వచ్చే 24 నెలల్లో అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముకేశ్ ఈ విషయాలు చెప్పారు. మరోవైపు, ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్టంగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. భారతదేశం.. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎకానమీ అని ఆయన పేర్కొన్నారు.



పండిట్ దీన్‌దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ముకేశ్ అంబానీ

# వృద్ధి బాటలో చిన్న మందగమనమే!

- ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ విశ్లేషణ
- సైక్లికల్ ఎఫెక్ట్‌గా అభిప్రాయం
- 2018–19 వార్షిక నివేదిక విడుదల
- వినియోగం, ప్రైవేటు పెట్టుబడుల వృద్ధిపై దృష్టి అవసరమని సూచన

**ముంబై:** భారత్ ప్రస్తుత మందగమన పరిస్థితులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తక్కువ చేసి చూపించింది. భారీ వృద్ధికి ముందు చిన్న మందగమన పరిస్థితులను భారత్ ఎదుర్కొంటోందని పేర్కొంది. దీనిని సైక్లికల్ ఎఫెక్ట్ (ఎగువ దిగువ)గా పేర్కొంది. వినియోగం, ప్రైవేటు పెట్టుబడుల పునరుద్ధరణ కేంద్రం, విధాన నిర్ణేతల అధిక ప్రాధాన్యత కావాల్సిన అవసరం ఉందని వివరించింది. 2018–19 (జూలై–జూన్) వార్షిక నివేదికను ఆర్‌బీఐ గురువారం ఆవిష్కరించింది. నివేదికలోని ముఖ్యాంశాలు...

- ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ ఇబ్బంది ఏమిటి అన్నది కచ్చితంగా చెప్పడం కష్టం. అయితే సమస్యలు వ్యవస్థాపరమైనవి కావు. భూ, కార్మిక, వ్యవసాయ ఉత్పత్తి, మార్కెటింగ్ రంగాల్లో మాత్రం సంస్కరణలు అవసరం.
- భారీ వృద్ధికి ముందు చిన్న కుదుపా లేక అప్ అండ్ డౌన్స్‌లో భాగమా? లేక వ్యవస్థాగత మందగమనమా? అన్నది ప్రస్తుతం ప్రశ్న. అయితే భారీ వృద్ధికి ముందు మందగమనం, సైక్లింగ్ ఎఫెక్ట్ అని మాత్రమే దీనిని చెప్పవచ్చు. తీవ్ర వ్యవస్థాగత అంశంగా దీనిని పేర్కొనలేము.
- వరుసగా నాలుగు ద్వైమాసికాలాల్లో ఆర్‌బీఐ 1.10 శాతం రెపో రేటు కోత (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 5.40 శాతం) లక్ష్యం వృద్ధి మందగమన నిరోధమే. 2019–20లో వృద్ధి 6.9 శాతంగా భావించడం జరుగుతోంది.
- బ్యాంకింగ్, బ్యాంకింగేతర రంగాలను పటిష్టం చేయాలి. మౌలిక రంగ వ్యయాలకు భారీ మద్దతు నివ్వాల్సిన అవసరం ఉంది. కార్మిక చట్టాలు, పన్నులు, ఇతర న్యాయ సంస్కరణల అంశాల్లో వ్యవస్థాగత సంస్కరణల అమలు అవసరం.
- దేశీయ డిమాండ్ పరిస్థితులు ఊహించినదానికన్నా బలహీనంగా ఉన్నాయి. దీని పునరుద్ధరణకు వ్యవస్థలో తగిన చర్యలు తీసుకోవాలి.
- వ్యాపార పరిస్థితులు మెరుగుపరచాలి.
- రైతుల రుణ మాఫీ, ఏడవ వేతన కమిషన్ నివేదిక అమలు, వివిధ ఆదాయ మద్దతు పథకాలు ఆర్థిక క్రమశిక్షణా పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఆయా పరిస్థితులతో ఆర్థిక ఉద్దీపన అవకాశాలకూ విఘాతం.
- ఆర్థిక వ్యవస్థలో సానుకూలతలూ ఉన్నాయి. తగిన వర్షపాతంతో అదుపులో ఉండే ధరలు, ద్రవ్యలోటు కట్టుతప్పకుండా చూసే పరిస్థితులు, కరెంట్ అకౌంట్ లోటు కట్టడి వంటివి ప్రధానం.
- బ్యాంకింగ్‌లో వేగంగా విలీనాల ప్రక్రియ.
- ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ వైఫల్యం నేపథ్యంలో– వాణిజ్య రంగానికి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) రుణం 20 శాతం పడిపోయింది. 2017–18లో రుణ పరిమాణం రూ.11.60 లక్షల కోట్లు ఉంటే, 2018–19లో ఈ మొత్తం రూ.9.34 లక్షల కోట్లు.
- అమెరికా–చైనాల మధ్య వాణిజ్య సంబంధ అంశాలు అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇది అంతర్జాతీయ మందగమన పరిస్థితులకు దారితీసి, ఫైనాన్షియల్ మార్కెట్లపై సైతం ప్రతికూల ప్రభావం చూపుతోంది.
- బ్యాంకింగ్ మొండిబకాయిలు తగ్గాయి. 2017–18లో మొత్తం రుణాల్లో మొండిబాకాయిలు 11.2 శాతం ఉంటే, ఇది 2018–19లో 9.1 శాతానికి తగ్గాయి. మొండిబకాయిల సమస్య తగ్గడంలో దివాలా చట్టం కూడా కీలకం.
- బ్యాంక్ మోసాల విలువ 2018–19లో రూ.71,543 కోట్లకు చేరాయి. 2017–18 నుంచి చూస్తే ఈ విలువ 73.8 శాతం (రూ.41,167.04 కోట్లు) పెరిగింది. ఇక కేసులు, 15% పెరుగుదలతో 5,916 నుంచి 6,801కి చేరాయి.
- ప్రైవైటు బ్యాంకులు, విదేశీ బ్యాంకుల చీఫ్‌ల వేతనాల విషయంలో సవరించిన నిబంధనలు త్వరలోనే విడుదల.
- యువతకు ఆర్‌బీఐ పట్ల అవగాహన పెంచేందుకు ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా వేదికలను విస్తృతంగా ఉపయోగించుకోవడం.




## రూ.1.96 లక్షల కోట్లకు ఆర్‌బీఐ అత్యవసర నిధి

కేంద్రానికి మిగులు నిధులు రూ.52,000 కోట్ల బదలాయింపుల నేపథ్యంలో ఆర్‌బీఐ వద్ద అత్యవసర నిధి రూ.1.96 లక్షల కోట్లకు తగ్గుతోంది. ఆర్‌బీఐ 2018–19 వార్షిక నివేదిక ఈ విషయాన్ని తెలిపింది. 2019 జూన్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ఆర్‌బీఐ గురువారం ఆవిష్కరించింది. మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ చేసిన సిఫారసులను సోమవారంనాడు ఆర్‌బీఐ బోర్డ్ ఆమోదించిన సంగతి తెలిసిందే. బ్యాలెన్స్ షీట్‌లో ఆర్‌బీఐ క్యాపిటల్ రిజర్వ్స్ బఫర్స్ పరిమాణం 5.5 నుంచి 6.5 శాతం శ్రేణిలో ఉండాలని కమిటీ సిఫారసు చేసింది. ఎటువంటి ఆర్థిక సవాళ్లనైనా ఎదుర్కొనగల అత్యున్నత స్థాయి కలిగిన సెంట్రల్ బ్యాంకుల్లో ఆర్‌బీఐ ఒకటని 2018–19 వార్షిక నివేదిక పేర్కొంది. 2018 జూన్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ వద్ద అత్యవసర నిధి పరిమాణం రూ. 2,32,108 కోట్లుగా ఉంది. తాజాగా కేంద్రానికి అందివచ్చిన 52,000 కోట్లు ఆర్‌బీఐకి సంబంధించి 2018–19 ఆర్థిక సంవత్సరం లెక్కలో వేస్తే, ప్రభుత్వానికి వచ్చే సరికి ఈ నిధులు 2019–20 ఆర్థిక సంవత్సరానికి అందినట్లు అవుతుంది.

## పసిడి.. కొత్త రికార్డు

- ఢిల్లీ మార్కెట్లో రూ. 40,220
- మాంద్యం భయాలు...



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా మాంద్యం భయాలు, ఇన్వెస్టర్ల నుంచి పటిష్టమైన డిమాండ్ ఊతంతో పసిడి రేట్ల పరుగు కొనసాగుతోంది. తాజాగా గురువారం మరో కొత్త గరిష్ట స్థాయిని తాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 250 పెరిగి రూ. 40,220కి చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇది పసిడికి జీవిత కాల గరిష్ట స్థాయి. రెండు రోజుల క్రితమే ముంబై మార్కెట్‌లో పసిడి రూ. 40 వేల మార్కును దాటి రూ. 40,100కి చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు, వెండి ధర కూడా క్రమంగా రూ. 50,000 మార్కుకు చేరువవుతోంది. కేజీకి రూ. 200 పెరిగి రూ. 49,050కి చేరింది. అంతర్జాతీయంగా మాంద్యం భయాలు, వాణిజ్య యుద్ధంపై అమెరికా–చైనా మధ్య చర్చల విషయంలో అనిశ్చితి తదితర అంశాలు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారానికి మద్దతుగా నిలుస్తున్నాయని బులియన్ ట్రేడర్స్ తెలిపారు.

# అన్నదాతకు ‘క్రెడిట్’

**రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయం**

**పెద్ద ఎత్తున బ్యాంకుల ద్వారా ఇప్పించాలని యోచన**

**5,00,000** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కిసాన్ క్రెడిట్ కార్డులు

**25,00,000** వ్యవసాయ శాఖ లక్ష్యం

సాక్షి, హైదరాబాద్

విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, సాగు ఖర్చులు.. ఇలా పెట్టుబడికి రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకుంటే అధిక మొత్తానికి అప్పు తెస్తుంటారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని వ్యవసాయ శాఖ యోచిస్తోంది. సాధారణంగా ప్రజలు వినియోగించే క్రెడిట్ కార్డు లాంటి వాటిని రైతులకు ఇవ్వాలని భావిస్తోంది. బ్యాంకులతో మాట్లాడి కార్డు ఇప్పించడం ద్వారా అధిక వడ్డీల నుంచి అన్నదాతను ఆదుకోవాలన్న దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పుట్టుకొచ్చిందే ‘కిసాన్ క్రెడిట్ కార్డు’. అనేక రాష్ట్రాల్లో ఈ కార్డులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నా, తెలంగాణలో పెద్దగా ప్రచారంలేదు. అసలేంటి ఈ క్రెడిట్ కార్డు..! వివరాల్లోకి వెళితే...



### రుణాలిచ్చేందుకు బ్యాంకుల పేచీ

**రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు తాత్సారం చేస్తున్నాయి. గత నాలుగైదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏడాదికేడాదికి లక్ష్యాలను ఘనంగా పేర్కొంటున్నా, రైతులకు ఇచ్చే సరికి బ్యాంకులు అనాసక్తి చూపిస్తున్నాయి. దీంతో రైతులు పెట్టుబడి సొమ్ము పుట్టక ప్రైవేటు అప్పుల వైపు పరుగులు తీయాల్సి వస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ. 29 వేల కోట్లు పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు అందులో సగం కూడా ఇవ్వలేదని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి.**

### ప్రయోజనాలు ఇవీ..

విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, సాగు ఖర్చులు వంటి వ్యవసాయ అవసరాల కోసం కిసాన్ క్రెడిట్ కార్డులు ఇస్తారు. రోజువారీ వ్యవసాయ సంబంధిత ఖర్చులకూ వినియోగించుకోవచ్చు.

వ్యవసాయ భూమి కలిగిన ప్రతీ రైతు కిసాన్ క్రెడిట్ కార్డ్ పొందడానికి అర్హుడే. కొన్ని పరిమితుల మేరకు కౌలు రైతులకు ఇస్తారు. భూమి ఉన్న రైతు తన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకెళ్లి సాధారణ డాక్యుమెంటేషన్ ద్వారా బ్యాంకులో పొందవచ్చు. రైతుకు బీమా కవరేజీ కూడా ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకున్న రైతులకు కేంద్రం రూపే కార్డులు ఇస్తుంది. వాటిని సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగా ఉపయోగించుకోవచ్చు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉంది.




### కార్డు పొందండి ఇలా...

వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు లేదా ఇతర వ్యవసాయేతర కార్యకలాపాల్లో నిమగ్నమైన ఎవరికైనా కిసాన్ క్రెడిట్ కార్డు రుణం ఇస్తారు. రైతు వయస్సు 18 నుంచి 75 ఏళ్ల వరకు ఉండాలి. కిసాన్ క్రెడిట్ కార్డు దరఖాస్తు చేసేటప్పుడు గుర్తింపు కార్డుండాలి. ఓటరు ఐడి, పాన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవాటిలో ఏదో ఒకటి ఉండాలి. పట్టాదారు పాసు పుస్తకం తప్పనిసరి. కిసాన్ క్రెడిట్ కార్డు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్డును రాష్ట్రంలో అనేక ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు అందిస్తున్నాయి.

## ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ యూనిట్

**సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్కులో ఏర్పాటు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ (గుండె శస్త్ర చికిత్సలో వాడే పరికరం) తయారీ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రూ.250 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ మెడికల్ డివైజెస్ పరిశ్రమ ద్వారా 3 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. పరిశ్రమ ఏర్పాటు కోసం సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ అనే సంస్థకు సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్కులో ఇదివరకే టీఎస్‌ఐఐసీ భూమి కేటాయించింది. సెప్టెంబర్ 1న జరిగే భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు ఈటల రాజేందర్, మల్లారెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి పాల్గొంటారు. స్టెంట్ తయారీ పరిశ్రమ ఏర్పాటుతో రాష్ట్రంలో వైద్య ఉపకరణాల తయారీ రంగం ఊపందుకుంటుందని టీఎస్‌ఐఐసీ అంచనా వేస్తోంది. స్థానికంగానే వీటి తయారీ నేపథ్యంలో స్టెంట్ల ధరలు కూడా తగ్గనున్నాయి. తద్వారా సామాన్యులకు కూడా హృద్రోగ చికిత్స తక్కువ ధరలో అందుబాటులోకి వస్తుందని పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి.

# అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వద్దు

- **తక్షణమే బాధితులకు ఆర్థికసాయం అందాలి**
- **కేసు నమోదులో వేగం పెంచాలి**
- **చెంచు రైతులకు భూ పంపిణీపై నివేదిక సమర్పించండి**
- **ప్రభుత్వ శాఖల సమీక్షలో జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్**



**గురువారం మీడియాతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి. చిత్రంలో సీఎస్ ఎస్.కె.జోషి తదితరులు**

**సాక్షి, హైదరాబాద్:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఏమాత్రం అలసత్వం వహించొద్దని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి అధికారులను ఆదేశించారు. ఏదైనా ఘటన వెలుగుచూసిన వెంటనే బాధితులకు ఆర్థికసాయం అందించాలని, అదేవిధంగా కేసు నమోదుతో పాటు చార్జిషీట్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం, పరిహారం పంపిణీలో ఆలస్యమైతే బాధితులకు సాంత్వన లభించక చట్టంపై విశ్వసనీయత తగ్గే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి, సభ్యులు మాయా చింతం, హరిక్రిష్ణ దామోర్, హర్షబాయ్ చున్నిలాల్, సంయుక్త కార్యదర్శి ఎస్‌కే రాథో బృందం బుధవారం రాష్ట్రానికి చేరుకుంది. తొలిరోజు పర్యటనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కమిషన్ సభ్యులు పర్యటించారు. రెండోరోజు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో కమిషన్ సమావేశం నిర్వహించింది. నందకుమార్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల కార్యదర్శులు, ప్రభుత్వ విభాగాధిపతులు హాజరయ్యారు. గిరిజన సంక్షేమం, జనజాతి తెగల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

**గిరిజన యూనివర్సిటీ మాత్రమే జాప్యం**

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని నందకుమార్ స్పష్టం చేశారు. గిరిజనులకు డబుల్ బెడ్రూంలు, రాయితీ రుణాల పంపిణీ సంతృప్తికరంగా ఉందన్నారు. 500 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలను కూడా పంచాయతీలుగా నవీకరణ చేసి గిరిజనుల్లో రాజకీయ చైతన్యం పెంచడం శుభపరిణామమంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనల్లో చెంచులు సాగుభూమి కావాలని కోరారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. అవసరమైతే కేంద్రానికి సూచనలు చేస్తామన్నారు. ఆర్‌ఓఎఫ్ఆర్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరితంగా పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతుందని అభిప్రాయపడ్డారు. గిరిజనులకు గురుకులాల ఏర్పాటు, ఆశ్రమ పాఠశాలల అప్‌గ్రెడేషన్ బాగుందని, వారి ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గిరిపుత్రులకు స్కూల్ యూనిఫాంతోపాటు బూట్లు, సాక్సులు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించగా.. సీఎస్ జోషి స్పందిస్తూ గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటికే పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని పలువురు గిరిజనులు తమను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి ప్రజావసరాలను వివరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి అజయ్‌మిశ్రా, రెవెన్యూ కార్యదర్శి సోమేశ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్‌రెడ్డి, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి

**కేంద్ర మంత్రిని కోరిన స్పీకర్ పోచారం**

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాల్సిందిగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు జాజుల సురేందర్, హన్మంత్ షిండేలతో గడ్కరీని కలిశారు. రాష్ట్రంలో 3,155 కి.మీ. మేర రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా నిర్మాణం చేయాల్సి ఉందని, ఇందులో ఇప్పటి వరకు 1,388 కి.మీ. రోడ్లను మాత్రమే జాతీయ రహదారులుగా గుర్తించారన్నారు. మరో 1,767 కి.మీ. రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించి, నిర్మాణం చేయాలని కోరారు.

**ప్రధాన ప్రాజెక్టులు..**

1. హైదరాబాద్‌లోని గౌరెల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్ జంక్షన్ – వలిగొండ – తొర్రూర్ – నెల్లికుదురు – మహబూబాబాద్ – ఇల్లందు – కొత్తగూడెం 234 కి.మీ
2. మెదక్–ఎల్లారెడ్డి–రుద్రూరు (92 కి.మీ)
3. బోధన్–బాసర–భైంసా (76 కి..మీ), మెదక్– సిద్దిపేట్–ఎల్కతుర్తి (133 కి.మీ),
4. చౌటుప్పల్–షాద్‌నగర్–కంది (186 కి.మీ) ఈ నాలుగు రోడ్లను జాతీయ రహదారిగా గుర్తించి నిర్మాణం చేపట్టడంతో పాటుగా ఇటీవల గుర్తించిన జాతీయ రహదారి 161–ఏఏ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి.




5 వారంటీ *షరతులు వర్తిస్తాయి.

Hero MotoCorp Ltd. Regd. Office: 34, Community Centre, Basant Lok, Vasant Vihar, New Delhi- 110057, India. CIN: L35911DL1984PLC017354. For more information, contact the nearest Hero MotoCorp's authorised outlet or call Toll Free No: 1800-266-0018 or visit heromotocorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding.

Hero MILEAGE THODA EXTRA KILOMETERS PER LITRE

HeroMotoCorp.com · HeroMotoCorpLimited · HeroMotoCorpIndia · TheHeroMotoCorp · HeroMotoCorp

Scan the QR code to experience the new Hero Pleasure+

Authorised Dealers: Telangana: Hyderabad: Sri Lakshmi Hero, Malakpet: Ph: 7799766408. Saroornagar: Ph: 9246223479. Vanasthalipuram: Ph: 9246223423. Lakshmi Hero, Somajiguda: Ph: 7799766412. Masab Tank: Ph. 9246223413. Venkateshwara Hero, Narayanguda: Ph: 7799766345. Mody Hero, R.P. Road: Ph: 7799766325. Bowenpally: Ph: 27844854. 9885100442. Phoenix Hero, Habsiguda: Ph: 7799766415. Ramanthapur: Ph: 27030336. Nagole: Ph: 24034335. Phoenix Hero, Kushaiguda: Ph: 9246824193, Bhongir: Ph: 9246394481. Bhanu Hero, Erragadda: Ph: 7799766400. Kukatpally: Ph: 23706999. Phoenix Hero, Hi-tech City: Ph: 7799766355. Hafeezpet: Ph: 7799017976. Dealwel Hero, Nampally: Ph: 7799766416. Asifnagar: Ph: 23536264/65. Krishna Sai Hero, Maredpally: Ph: 9849362062. Malkajgiri: Ph: 7799766379. Sri Venkanna Hero, Serilingampally: Ph: 9640515185. Medak: Sri Venkanna Hero, Patancheru: Ph: 7799766387. Geeta Hero, Suchitra Circle: Ph: 9346205550. Delight Hero, Sangareddy: Ph: 7799766365. Sowjanya Hero, Bahadurpura: 9248747804/05, Karimnagar: Bharadwaj Hero, Ph: 7799766341. Devesh Hero, Ph: 7799766346. Ramagundam: Siddhi Sree Vinayaka Hero - Ph: 9817009247. Warangal: Sri Sri Sri Hero, Ph: 7799766330. Sree Vaishnavi Hero, Ph: 7799766351. Nizamabad: Venkateshwara Hero, Ph: 7799766420. Sri Sai Durga Hero, Ph: 7799766405. Adilabad: Chandra Hero, Ph: 7799766397. Mancherial: Balaji Hero, Ph: 7799766326. Delight Hero, Sangareddy: Ph: 7799766365. Khammam: Sri Sri Sri Hero, Ph: 7799766384. Kothagudem: Rajyalakshmi Hero, Ph: 7799766390. Bhadrachalam: Sri Ram Hero, Ph: 7799766409. Nalgonda: Venkataramana Hero, Ph: 7799766404. Miryalguda: Sree Krishna Hero, Ph: 7799766371. Suryapet: Sri Venkata Lakshmi Hero - Ph: 7799766429. Mahabubnagar: Ashvini Hero, Ph: 7799766361, Ashvini Hero (Ext), Ph: 99491 11933, Gadwal: Meghanath Hero, Ph: 7799766392.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792